

జూన్-'65
జ్యోతి
వెల 75 పై


జగపతి పిక్చర్స్
అంతస్తులు
REVATHI
దర్శకత్వం:వి.మధుసూదన రావు
నిర్మాత:వి.రాజేంద్రప్రసాద్,B.Sc.,
వాణీ రిలీజ్



తొలిమాట



శేఖరం జయంతిని ఆదరిస్తాడా ?

అతని జీవితానికి ఆమె సెక్రటరీ అవుతుందా ?

ఆమె హృదయానికి అతడు ప్రెసిడెంటవుతాడా ?

జవాబులకు 19వ పేజీ చూడండి

* * *

"జీవితం భగవంతుడు మన కిచ్చిన అందమైన వరం. దాన్ని అన్నివైపుల నుంచి చూడకుండా ఏదో వ్రాస్తూ కూర్చోవాలంటే విసుగు. ప్రపంచానికి మనం చెప్పవలసిన దానికంటె దాని నుంచి నేర్చుకోవలసిందే చాలా వుందనిపిస్తుంది..." అంటారు రచయిత్రి సులోచనా రాణిగారు.

అయినా ఆమె కథలు వ్రాయక పోలేదు. తొలి కథ 1957 లో అచ్చయింది. నాటినుంచి ఎక్కువ కాకపోవచ్చు గాని చక్కనివే వ్రాశారు. జీవితంమీద పై వ్యాఖ్యానంలో కనబడే భక్తి గౌరవాలే ఆ కథలన్నిటిలో కనిపిస్తాయి. నేలమీదే నిలిచి నింగిని అందుకోవాలనే ఆరాటం, పోరాటం, ఆశావాదం వాటిలో వినిపిస్తాయి. మానవులను "అన్ని వైపులనుంచి" చూడాలనే ఆమె పరిశీలనాత్మక దృష్టికి "సెక్రటరీ"యే తార్కాణం.

ఈ సీరియల్‌ను టెక్నికలర్‌లో తీసిన సుందరస్వప్నంగా ఒక పాఠకుడు వర్ణించారు. పన్నెండు సంచికలనుంచి పాఠకులను సమ్మోహపరచిన ఈ కథ ఈ సంచికతో బై బై చెబుతోంది.

ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడుచున్నది



సచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2.

విడిప్రతి వెల: 75 పైసలు — ఏడాది చందా: 9 రూపాయలు

సంపుటి 3 జూన్ 1965 సంచిక 6

ముఖచిత్రం : విజయ వారి "సత్యహరిశ్చంద్ర" లో

ఎన్. టి. రామారావు

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య

ఆర్ట్ ఎడిటర్ : బాపు

సంపాదక వర్గం :

నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ,
వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు.

ఉత్తరాయణం

ప్రముఖ సినీ నటీమణి, ప్రసిద్ధ గాయని అయిన శ్రీమతి భానుమతీ రామకృష్ణగారి "అత్తగారూ–అష్టావధానం" మమ్మల్ని కడుపుబ్బ నవ్వించిందంటే నమ్మండి. సంపాదకీయంలో మీరు పేర్కొన్నట్లు తెలుగు సాహిత్య వీధుల్లో ఈ అత్తగారులాంటి పాత్రను సృష్టించిన ఘనత భానుమతిగారికే దక్కుతుంది. ఇందుకు వారు మిక్కిలి అభినందనీయులు.

పత్రికకు జోడు గుర్రాల్లాంటి సీరియల్స్‌లో "సరిహద్దులూ – శిఖరాలూ" పరిసమాప్తం కావడంతో జ్యోతి కొంతవరకు వెలవెలబోతున్నట్లే తోచింది. మరో మంచి సీరియల్ వెంటనే ప్రారంభిస్తే పాఠకులకి కొరత తీర్చిన వారవుతారు.

శేఖరాన్ని మనస్ఫూర్తిగా ప్రేమిస్తూకూడా తన అంతరాత్మని తనే అర్థం చేసుకోలేని విషమ పరిస్థితిలో లేనిపోని కష్టాలు చేతులారా కొనితెచ్చుకుంటున్న అమాయకురాలు జయంతి పాత్ర పాఠకుల మనస్సుల్లో కలకాలం నిలచిపోతుంది. వచ్చే సంచికలో వారిద్దర్నీ దంపతులు గా చేసి, 'అయిపోయింది' అని అంటారేమోనని ఒక విధంగా విచారిస్తూ మరోరకంగా సంతోషిస్తున్నాను.

కావూరి భాస్కరరావు,
సికిందరాబాదు.

ఏప్రిల్ "జ్యోతి" ఒకటి–నాలుగు కవరుపేజీలే ఓ ప్రత్యేక అకర్షణ అనుకొంటే, అంతకు మించిన సింగారంతో–ఇంతకు మునుపులేని శోభల్ని సంతరించుకొని, ఈ 'మే' "జ్యోతి" చూచినవారందరి కళ్ళకి నిజంగా విందు చేసింది. ప్రస్తుతం 'రాజకీయ వాతావరణం' ఉన్న తీరును అనంతంగారు చక్కగా వర్ణించేరు. నా అభిమాన నటి, ప్రఖ్యాత రచయిత్రి, గాయకురాలు, ఒక కేమిటి, అపరవాణి అన తగిన శ్రీమతి భానుమతీ రామకృష్ణగారి "అత్తగారు–అష్టావధానం" కథ చక్కగా ఉంది. సులోచనారాణిగారి "సెక్రటరీ" సీరియల్ ఇంట్రెస్టింగ్‌గావుంటూ, సస్పెన్సుతో సాగిపోతోంది. నండూరి పార్థసారధిగారి "శిఖరాలూ–సరిహద్దులూ" సీరియల్ "ముగింపు" మనోజ్ఞంగా ఉంది. క్రొత్త పంథాలో "అశలు – అనుభవాల్ని" సృష్టించిన విహారి – శాలివాహనలను మెచ్చుకోవాలి. మిగిలిన కథలూ – అవీ–ఇవీ – ఫరవాలేదు. తప్పక ఇలాగే "జ్యోతి" జైత్రయాత్ర సాగించాలని నా కోరిక.

బి. అనంతరావు,
విశాఖపట్నం.

'అత్తగారు అష్టావధానం' చాలా బాగుంది. చదువుతున్నంతసేపు కడుపుబ్బ నవ్వు వచ్చిందనుకోండి! వారికి నిజంగా అత్తగారు వున్నారా? ఉంటే యీ వ్యాసాలు వ్రాయనిస్తారా? అని నా కొక అనుమానం.

టి.వి.ఎస్. సేఠి, హనుమకొండ.

మే నెల 'జ్యోతి' చూడ ముచ్చటగా వుంది. ముఖ్యంగా శ్రీమతి భానుమతీ రామకృష్ణగారి 'అత్తగారు అష్టావధానం' నన్ను ఆకర్షించిందని చెప్పటంలో సంకోచంలేదు. ప్రత్యేకంగా కథగా లేకపోయినా అత్తగారి చాదస్తం చక్కగా వ్యక్తంచేయటం చాలా సహజంగా వుంది. వీరు చక్కగా పాడుతేగాక యీ రకమైన కథ లల్లి చదువరులను సంతసింపచేయుచున్నందుకు నా హృదయపూర్వక అభివందనలు.

సత్యవతీ సన్యాసిరావు,
ఎస్. కోట (విశాఖజిల్లా).

చి॥ సౌ॥ జయంతికి పెళ్ళి అయ్యే యోగము సుదూర భవిష్యత్తులో లేకుండా చేసి మమ్ముల నిరుత్సాహపరుస్తున్నారు. పాపం! శేఖరం-జయంతుల పెళ్ళి ఈ వేసవి కాలములోనయినా జయప్రదముగా జరిపే ఏర్పాట్లు చేసి మమ్ముల నందర నాహ్వానించెదరని ఆశిస్తున్నాము.

ఎ. యస్. కె. ప్రసాద్,
హైద్రాబాద్.

మే సంచికలో సస్పెన్స్ తారాస్థాయిని అందుకొని 'సెక్రటరీ' పెడ్తున్న బాధను భరించ లేకుండా వున్నాము. సుఖాంతమైన ముగింపుకై ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాము. ఇక పోతే భానుమతిగారి 'అత్తగారూ – అష్టావధానం' హాస్య రసంతో మాకు ఆనందానుభూతి కల్పించిందని వేరే చెప్పాలా?

'తప్పెవరిది?' అన్న కథానిక సహజత్వంతో, మనస్సుకి హత్తుకొని పోయే సంభాషణలతో అద్భుతంగా వుంది.

కుమారి వి. మాలతి,
గుంటూరు.

'జ్యోతి' చదవాలన్న కుతూహలము నాకు మొన్నటిదాకా వుండేదికాదు. కాని యీ నెల 'జ్యోతి' చదివినప్పటి నుంచి కుతూహలముకలిగింది. నాలో పైభావము కల్గుటకు ముఖ్యముగ యీనెల మీ పత్రికలో ప్రచురించిన 'ఆశలు-అనుభవాలు' యనుకథ అనుటకు సందేహములేదు. ఆకథ చదివినప్పటినుండి మీకు వుత్తరము వ్రాద్దామన్న ఆత్రుతకన్న ఆకథ రాసినవారికి నా ధన్యవాదములు చెప్పాలన్న ఆత్రుతే యెక్కువైనది.

ఇకపోతే భానుమతీ రామకృష్ణ గారు వ్రాసిన స్కెచ్ బాగున్నదని వేరే చెప్పవలెనా! తక్కిన కథలు గూడ బాగున్నవి. జూన్ నెల సంచిక కొరకు యెదురు చూస్తున్నాను.

రవి, (రాయగఢ్)

మీ పత్రిక ప్రతీనెల అత్యంత ఆసక్తితో చదువుచున్నాము. 'సెక్రటరీ' చాల ఉత్సుకత కలిగించుచు, తరువాత ఏమి జరుగునా అనిపించుచున్నది. 'శిఖరాలు-సరిహద్దులూ' సీరియల్‌లో యుద్ధ వర్ణన, శివరామ్ యొక్క దేశభక్తి చాల బాగుగా మున్నవి. 'మరో ప్రపంచము' వైజ్ఞానికముగా బాగుగా యున్నది. మీ పత్రికద్వారా ఆపై రచయితలకు, అవి అందజేసిన మీకు మా అభినందనలు.

ముత్యాల వెంకట రమణారావు,
సుసర్ల నారాయణమూర్తి,
తిరువనంతపురం (కేరళ)

నండూరి పార్థసారథిగారి 'శిఖరాలు-సరిహద్దులు' గంభీరంగా సాగుతూ ఠపీమని 'సమాప్తం' అన్నారు. ఐనా చాలా బాగా ముగించారండి. ఏమండోయ్! భానుమతిగారికి అత్తలంటే ఎందుకంత కోపం? ఎందుకంటే యీమధ్య అత్తలనుగురించి చాలా ఇదిగా వ్రాస్తుంటేను. బహుశ వచ్చేమాసంలో జయంతి – శేఖరంగార్లకు వివాహం జరుగగలదని ఆశిస్తాను.

కె. పి. రంగప్రసాద్, కర్నూలు

భానుమతీ రామకృష్ణగారి 'అత్తగారూ-అష్టావధానం' నేను చదువుచున్నంతసేపూ నాలో నేను నవ్వు నిలుపుకోలేక పోయాను. అత్తగారి గడియారం సంగతి ముఖ్యంగా నాకు నచ్చినది.

విహారి అండ్ శాలివాహనగార్ల 'ఆశలు, అనుభవాలు' అన్న కథ నన్నెంతో ఆకర్షించినది. ఈ కథలోని కరుణాకరంలాంటి దురదృష్టవంతులు, కాంతారావు లాంటి ఆదర్శ స్నేహితులను కల్పించి, వారి పాత్రలు సహజ ధోరణిలో నడిపించి పాఠకులను అలరించినందుకు వారికి నా కృతజ్ఞతాభివందనలు.

యస్. నాగరాజు, యలమంచిలి.

అత్తగారు అష్టావధానం' సంచికకు ఒక ప్రత్యేకమైన శోభను కూర్చింది అని వ్రాయడం అతిశయోక్తికాదేమో! ఒక క్రొత్తరకమైన అత్తగార్ని సృష్టించిన శ్రీమతి భానుమతీరామకృష్ణగారికి ధన్యవాదాలు అందజేయండి.

దొండపాటి దేవదాసుగారు వ్రాసిన 'తప్పెవరిది?' వాస్తవానికి చాలా దగ్గరగా వుంది. ఇప్పటికీ మన సమాజంలో సుధాకర్‌వంటి పరోపకార జీవులు వుండబట్టే మనం ఇలానైనా బ్రతగ్గలుగుతున్నాం.

మొసలికంటి లక్ష్మి,
కోమర్తి.

మే 'జ్యోతి' అంతస్తుల న[illegible] నటులతో ముచ్చటగా వెలువడిం[illegible]. భానుమతీ రామకృష్ణగారి 'అత్త గారూ అష్టావధానం' [illegible] వుంది. అన్నిటికన్నా [illegible] వాహనగార్ల ఆశలు, [illegible] కథ నాకు బాగా న[illegible]

యల్లపు [illegible]

రాజకీయ వాతావరణం

హద్దుమీరిన పాకిస్తాన్

మే నెల — దేశం ఉట్టుడికినట్టు ఉడికిపోయింది. దీనికి మండు వేసవి మాత్రమే కారణం కాదు.

ఇండియా, పాకిస్తాన్‌లమధ్య ఏ రోజున, ఏ క్షణంలోనైనా యుద్ధం రావచ్చు ననిపించేటంత ఉద్రిక్తత ఏర్పడింది. రెండు దేశాలమధ్య పచ్చగడ్డి కూడా భగ్గుమనే పరిస్థితి చాల కాలంగా వుంది. అయినా, ఈ మధ్య కచ్ వివాదంతో విభేదాలు తారస్థాయి నందుకున్నాయి. కాశ్మీర్ యుద్ధం తరవాత ఎప్పుడూ ఎరగనంత తీవ్ర స్థితి వచ్చింది.

ఒకానొక దుర్ముహూర్తాన సింధు-కచ్ సరిహద్దును దాటి పాకిస్తాన్ సేనలు ఇండియా భూభాగంలో ప్రవేశించాయి. మనకు చెందిన కంజర్‌కోట స్థావరాన్ని ఆక్రమించుకున్నాయి. అక్కడున్న మన పోలీసు గస్తీదళం వెనక్కి తగ్గవలసివచ్చింది. ఆ తరవాత క్రమంగా బియర్‌బెట్, చాడ్‌బెట్ మొదలైన కొన్ని స్థావరాలను పాకిస్తాన్ సేనలు ఆక్రమించుకున్నాయి. సుమారు ఆరు మైళ్ళదూరానికి అవి మన భూభాగంలోకి చొచ్చుకువచ్చాయి. మొదట్లో తా నేపాపం ఎరగనని పాకిస్తాన్ బుకాయించింది. ఆ తరవాత తాను సేనలను పంపింది నిజమేనని అంగీకరించింది. నిజానికి ఒక బెటాలియన్ సైన్యంతో, భారీ టాంకులు, పెద్ద పిరంగులతో అది ఈయుద్ధంలో పాల్గొంది. ఇంత పెద్ద యుద్ధానికి సిద్ధంగాలేని మన కొద్దిపాటి సేనలు కొన్ని స్థావరాలను విడిచిపెట్టి రాక తప్పలేదు.

అబద్ధాలాడ్డంలో పాకిస్తాన్ ప్రభుత్వాన్ని మించింది ప్రపంచంలోనే లేదు. కచ్ యుద్ధంలో పాకిస్తాన్ సేనలు అమెరికా తనకిచ్చిన పాటన్ టాంకులను, రికాయిల్‌లెస్ తుపాకులను ఉపయోగించింది. ఈ సంగతిని మన ప్రభుత్వం మొదట బయట పెట్టినప్పుడు ఆ టాంకులను కేవలం యుద్ధరంగంలోకి తీసుకురావడమేగాని ఉపయోగించనేలేదని పాకిస్తాన్ అబద్ధమాడింది. ఆ తరవాత మనం రెట్టించి అడిగేసరికి అసలక్కడ టాంకులంటూ లేనేలేవంది. ఇంతలో మన సైన్యానికి చెందిన ఫ్లయింగ్ ఆఫీసర్ శ్రీ బార్బారా యుద్ధరంగాన్ని ఫొటోలు తీశాడు. వాటిలో స్పష్టంగా అమెరికన్ ట్యాంకులు, తుపాకులు కనిపించాయి. అప్పుడు పాకిస్తాన్ తాను వాటిని ఉపయోగించిన మాట నిజమేనని ఒప్పుకుంది. కరాచీలోని అమెరికన్ రాయబారి నిలేసి అడిగినప్పుడు ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ ఈ సంగతి స్వయంగా ఒప్పుకున్నాడు. కావలిస్తే మీ యిష్టం వచ్చినప్పుడు అక్కడికి వెళ్ళి చూసుకోవచ్చునని గర్వంగా చెప్పాడు. మీ చేతనైంది మీరు చేసుకోండన్నట్టుగా మాట్లాడాడు.

ఇంత జరిగినా అమెరికా ప్రభుత్వం ఈ విషయంలో కిమ్మనకుండా ఊరుకోవడమే విచిత్రంగా వుంది. అది పాకిస్తాన్‌కు ఆయుధ సహాయం చేస్తోంది ఇండియామీద ప్రయోగించడానికి కాదు; కమ్యూనిస్టు దురాక్రమణ నుంచి ఆత్మరక్షణ చేసుకోడానికే. కాని, పాకిస్తాన్ దుష్టబుద్ధిని ఎరిగి వున్న మనం ఈ ఆయుధ సహాయాన్ని గురించి ఒకప్పుడు సందేహాలు వెలిబుచ్చగా, అలా జరక్కుండా చేస్తామని ప్రెసిడెంట్ ఐసెన్‌హొవర్ హామీ ఇచ్చారు.

ఇప్పుడు ఆ హామీ లేమైపోయాయో తెలియదు. అమెరికా ప్రభుత్వం పాకిస్తాన్‌ను మందలించడానికి జంకుతోంది. గట్టిగా మాట్లాడితే సీటో కూటంనుంచి తప్పుకుంటా నంటుందేమోనని భయం కావచ్చు.

ఇంతకీ పెద్దగా వివాదానికి అస్కారంలేని కచ్-సింధు పరిహద్దును వివాదగ్రస్తం చేసింది పాకిస్తాన్. సుమారు 3,500 చదరపు మైళ్ళ భాగం తనకు రావాలని అది పేచీ పెడుతున్నది. నిజానికి ఆ ప్రాంతంలో వివాదం ఏదైనా వుంటే అది సరిహద్దురేఖ నిర్ణయానికి సంబంధించింది మాత్రమే. దాన్ని యెప్పుడైనా శాంతంగా పరిష్కరించుకోవచ్చు. అలా కాకుండా కొంత భూభాగం కూడా తనకి రావాలని పాకిస్తాన్ తగాదా లేవదీసింది.

ఇదంతా అక్రమ వ్యవహారమని బ్రిటన్‌కు తెలిసిందే. కచ్-సింధు సరిహద్దు బ్రిటిష్ పరిపాలన కాలంలో స్పష్టంగానిర్వచించబడినదే. దానిలో ఏ సందేహానికి ఆస్కారంలేదు. ఐనా సరే, ఈ విషయంలో పాకిస్తాన్‌ది తప్పనడానికి దానికి నోరు రాలేదు. మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వచ్చింది. [illegible] ప్రతిపాదనలు [illegible] తులకు [illegible]



వుండటంచేత మనం సరే నన్నాం. పాకిస్తాన్ మాత్రం తిరస్కరించింది. ఆ తరవాత పాకిస్తాన్‌కు అనుకూలంగా వాటిని బ్రిటన్ కొద్ది మార్పులు చేసింది.

కచ్ సరిహద్దులో మనం కోరుతున్నదల్లా ఇది: యుద్ధవిరమణ జరగాలంటే పాకిస్తాన్ 1965 జనవరి 1 వ తేదీనాటి పరిస్థితిని తిరిగి నెలకొల్పాలి. ఆ తరవాత ముందు అధికారుల స్థాయిలోను, ఆ తరువాత మంత్రుల స్థాయిలోను సరిహద్దు నిర్ణయం గురించి చర్చలు జరగాలి. పై షరతుకు ఒప్పుకోనంత కాలం మనం యుద్ధ విరమణకుగాని, చర్చలకుగాని అంగీకరించేది లేదు.

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయానికి రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో నిస్తబ్ధత ఏర్పడివుంది. యుద్ధం జరగడమూ లేదు; విరమించడమూ లేదు. బ్రిటన్ మధ్యవర్తిత్వం పేరుతో చేసిన తాత్సారానికి ఫలితం యిది.

● ● ●

అమెరికా ప్రతిష్ఠ మన దేశంలో ఇప్పుడున్నంత అట్టడుగున ఇది వరకెప్పుడూ లేదు. జూన్ మొదటి వారంలో శ్రీ శాస్త్రి అమెరికాలో పర్యటించవలసి వుంది. అమెరికా ప్రభుత్వం ఆయన్ని పనివేళా ఆహ్వానించి చివరికి పర్యటనను వాయిదా వేసుకోమంది. ఇది మనకి సహజంగానే కోప కారణమైంది. ప్రధాని శాస్త్రి తన పర్యటనను పూర్తిగా రద్దు చేసుకున్నానని ప్రకటించారు.


పాకిస్తాన్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ కూడా మే నెలలో అమెరికా పర్యటించవలసి వుంది. ధాన్నికూడా ప్రెసిడెంట్ జాన్సన్ వాయిదా వేసుకోమన్నారు. వియత్నాంలో అమెరికా బాంబు దాడులను ఇండియా, పాకిస్తాన్‌లు విమర్శించినందుకు కోపం వచ్చి జాన్సన్ ఇలా ప్రవర్తించారని కొందరు చెబుతున్నారు. ఇండియామీద కాదు, పాకిస్తాన్‌మీద కోపంతో అయూబ్ ఖాన్ పర్యటనను వాయిదా వేసుకోమన్నారని, అయితే అయన్ని ఒక్కణ్ణి చిన్న బుచ్చడం ఇష్టంలేక ప్రధాని శాస్త్రి పర్యటనను కూడా వాయిదా వేశారని మరికొందరి అభిప్రాయం. ఇండియా, పాకిస్తాన్‌లను యీ విధంగా ఒక గాటన కట్టడం, ఇదికూడా ఒక విధంగా మనకు అవమానకరమే. ఏమైనా ఈ విషయంలో ప్రెసిడెంటు జాన్సన్ ప్రవర్తన హుందాగా, రాజనీతిజ్ఞతకు నిదర్శనంగా లేదని మాత్రం చెప్పక తప్పదు.

దీనికితోడు రాణ్ ఆఫ్ కచ్‌లో పాకిస్తాన్ తన ఆయుధసహాయాన్ని దుర్వినియోగం చేస్తున్నా మాట్లాడక పోవడంతో అమెరికా-ఇండియా సంబంధాలు కొంత ముభావంగా నేతియారైనాయని చెప్పాలి.

● ● ●

షేక్ అబ్దుల్లా ఒక విధంగా అదృష్టవంతుడు. మిగతా దేశం ఎండలకు కుతకుతలాడి పోతున్నా అతడు మాత్రం ఊటీలో దివ్యమైన బంగళాలో కులాసాగా వున్నాడు. మక్కా యాత్ర ముగించుకుని మే 8 వ తేదీన అతడు ఢిల్లీలో విమానం దిగీ దిగ్గానే ప్రభుత్వం అతన్ని అరెస్టుచేసి ఊటీ పంపించింది.

అతడు విదేశాలలో వుండగా ఇండియామీద చేసిన దుష్ప్రచారం అంతా ఇంతా కాదు. కాశ్మీరులో ప్లెబిసైట్ జరగాల్సిందేనని, ఇండియా తన పూర్వ వాగ్దానాలను భంగం చేస్తోందని, కాశ్మీరీలను క్రూరంగా అణచివేస్తోందని, ఈ సమస్య శాంతంగా పరిష్కారం కాకపోతే మరొక విధంగానైనా పరిష్కారం కాక తప్పదని—ఒకటికాదు, రకరకాలుగా అతడు ప్రచారం చేశాడు. అల్జీర్స్‌లో చౌ ఎన్-లైను కలుసుకున్నాడు. సరిహద్దు సంధి పేరుతో కాశ్మీర్ భూభాగాన్ని చైనాకు పాకిస్తాన్ ధారాదత్తం చేస్తుంటే అతడు నోరు విప్పలేదు. రాణ్ ఆఫ్ కచ్‌లో పాకిస్తాన్ దురాక్రమణ చేస్తుంటే అతడు ఒక ప్రకటనైనా చెయ్యలేదు. చెయ్యవలసిన అవసరం వుందనికాదు. కాని న్యాయమంతా పాకిస్తాన్



మాస్కోలో సోవియట్ ప్రధానితో ...

పక్షానే వుందని, ఇండియా దే అన్యాయమని అతడు వాదించడమే మనకు ఆగ్రహం కలిగిస్తుంది. భారతీయ పౌరుడైవుండి, ఇండియా ప్యాస్‌పోర్టుతో, విదేశీ మారక ద్రవ్యంతో అతడు ఇతర దేశాలకు వెళ్ళికూడా అక్కడ ఇండియాగురించి దుష్ప్రచారం చేయడం నిజంగా సహించరానిది. అందు కే అతన్ని భారత ప్రభుత్వం అరెస్టు చేసింది. తిరిగి కాశ్మీర్‌లో అడుగు పెట్టనివ్వకుండా దక్షిణాదికి పంపించింది. అతనిపై కొన్ని ఆంక్షలు విధించింది.

● ● ●

అంతర్జాతీయ రాజకీయాలలో ఈ మధ్య దాదాపు ఒంటరై పోయిన ఇండియాకు కొంతలో కొంత ఊరట కలిగించేది రష్యా సానుభూతి, సహకారం. ప్రధాని శాస్త్రి ఇటీవల రష్యాలో పర్యటించి అఖండ స్వాగత సత్కారాలు పొందారు. మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని రష్యన్లు గట్టిగా సమర్థించారు; ఉభయ దేశాల మైత్రీ ఎట్టి పరిస్థితులలోను చెక్కు చెదరబోదని హామీ ఇచ్చారు.

దీనికి నిదర్శనంగా మన చతుర్థ ప్రణాళికకు ఇదివరలో ఇచ్చిన దానికంటె రెట్టింపు సహాయమివ్వగలమని రష్యా తెలియ జేసింది. భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ ఉత్పత్తి పెంచడంలో, బొకారో ఫ్యాక్టరీని నిర్మించడంలో, ఇంకా ఎన్నో భారీ పరిశ్రమల నిర్మాణంలో పూర్తి సహాయం చేయడానికి రష్యా తన సంసిద్ధతను తెలియ జేసింది. చాలా భారీ పెట్టుబడితో రూపొందబోతున్న చతుర్థ ప్రణాళిక విజయానికి రష్యా సహాయంఎంతైనా తోడ్పడ గలదు.

● ● ●

రాజమండ్రివద్ద గోదావరి పై రెండవ రైలువంతెనతో కలిపి రోడ్డు కూడా పడబోతోంది. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనికి కాగల 2 కోట్ల 15 లక్షలలో కోటి రూపాయలు కేంద్రం రాష్ట్రానికి ఋణంగా ఇస్తుంది. మిగతాది రాష్ట్రం పెట్టుకుంటుంది.

రాజమండ్రివద్ద రైలు — రోడ్డు వంతెన నిర్మించాలని ఆంధ్రప్రజలు కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. రెండవ రైలు వంతెనను ఎలాగూ నిర్మిస్తున్నప్పుడు దానితో కలిపి రోడ్డును కూడా నిర్మిస్తే ఖర్చు కలిసి వస్తుందని, రోడ్డు రవాణాకు చాలా సదుపాయంగా వుంటుందని, జాతీయ రహదారిలో 35 మైళ్ళ దూరం తగ్గుతుందని మన వాదన. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించి సగం ఖర్చును భరిస్తానని కూడా కేంద్రానికి తెలిపింది. కాని కేంద్ర ఆర్థికశాఖ ఏ కారణం చేతనో



మాస్కోలో లియోనిడ్ బ్రెజ్నెవ్‌తో ప్రధాని శాస్త్రి

దీనికి అంగీకరించలేదు. తన దగ్గర డబ్బు లేదని, జాతీయ రహదారిని కలుపుతూ ఇంకొక వంతెన పడుతున్నందుచేత ఇది అనవసరమని ఏవేవో సాకులు చెప్పింది.

చివరకు యీ ఆందోళన రాజమండ్రి, కొవ్వూరు మొదలైనచోట్ల ప్రజలు ప్రత్యక్షచర్యకు దిగేవరకు వెళ్ళింది. నిరశనదీక్షలు, రైళ్ళాపివేయడం మొదలైనవి జరిగాయి. ఈ ఆందోళన మరింత తీవ్రరూపం ధరించకుండా ముందుగ్గానే కేంద్రప్రభుత్వం మేల్కొని రోడ్డువంతెనను మంజూరు చేసింది. అది సంతోషించవలసిన సంగతేగాని, వృధాగా రెండేళ్ళపాటు ప్రజలలో అపోహలు, ఆందోళనలు ప్రబలనివ్వడంమాత్రం సమర్థించడానికి వీల్లేనిది.

ఆంధ్రులు సాధారణంగా ఏ చిన్న కోర్కెను సాధించుకోవాలన్నా పెద్ద పెట్టున ఉద్యమాన్ని లేవదీయ వలసి రావడం పరిపాటి అయిపోయింది. ప్రణాళికలలో భాగంగాగాని ఇతరత్రాగాని మనరాష్ట్రానికి జరుగుతున్న ప్రయోజనాలు చాల తక్కువ. పెద్ద పెద్ద సౌకర్యాలు, లాభాలు ఇతర రాష్ట్రాలకే పోతున్నాయి. కేంద్రం స్థాపించే భారీ పరిశ్రమల విషయంలో ఇది మరీ నిజం.

అయితే గుడ్డిలో మెల్లగా విశాఖపట్నంలో జింక్ స్మెల్టర్ ఫ్యాక్టరీని 30 కోట్లపెట్టుబడితో కేంద్రంనిర్మించబోతోందనే వార్తవచ్చింది. ఇలాంటి

వచ్చేసంచికల్లో

కొత్తసీరియల్ ప్రారంభం

మార్గదర్శి

రచన: బి. వి. రమణరావు

◆ ◆ ◆

["సెక్రటరీ" సీరియల్ ప్రారంభించిన కొన్ని నెలల తరువాత నుంచి "జ్యోతి" పాతసంచికలు కావాలని చాలమంది మాకు ఉత్తరాలు వ్రాయడం, మేము పంపలేక పోవడం జరిగింది. తిరిగి అటువంటిది జరగకుండా పాఠకులు మొదటినుంచి కొత్త సీరియల్‌ను చదువుతారని ఆశిస్తున్నాము.]

భారీ పరిశ్రమ ఏదొక్కటి రాష్ట్రంలో స్థాపించబడితేనేగాని ఆర్థికంగా మనం పురోగతి సాధించలేము. మద్రాసు, మైసూరులతో పోల్చిచూస్తే మనం పరిశ్రమలవిషయంలో, తలసరి రాబడి విషయంలో ఎంతో వెనుకబడి వున్నాము. ఈ తారతమ్యం తొలగడానికి రాష్ట్రంలో వున్న ఖనిజ సంపదను వినియోగించుకోగల పరిశ్రమలు బయలు దేరాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయం చేయాలి.

విశాఖపట్నంలో జింక్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఉద్దేశించడం సంతోషించ దగిందే అయినప్పటికి, తెన్నేటి విశ్వనాథంగారు చెప్పినట్టు దీనిపేరుచెప్పి అయిదవ ఉక్కు ఫ్యాక్టరీకి సున్నా చుడతారేమోనని అనుమానించవలసి వస్తోంది. బహుశా దాన్ని ఎగవేయడానికే జింక్ ఫ్యాక్టరీని విశాఖపట్నానికిచ్చారేమోనని అనుమానం కలుగుతున్నది. ఇది జరగకుండా మన రాష్ట్రప్రభుత్వం ప్రజలు కేంద్రంమీద గట్టి వత్తిడి తీసుకు రావాలి.

□□□



కచ్ ప్రాంతపు దృశ్యం : అమెరికా పాకిస్తాన్‌కు సరఫరా చేసిన ఒక ట్యాంకును, ఒక రికాయిల్‌లెస్ తుపాకి (పైన జీపులో) ని చూడవచ్చు.

"రాణ్ ఆఫ్ కచ్"
కథా కమామీషూ

"ఇరిణమ్" అనే సంస్కృతం మాటకి ఉప్పు పర్రలని అర్థం. దానిలోంచి వచ్చిన మాటే "రాణ్". అది గుజరాత్ రాష్ట్రంలోని కచ్ జిల్లాలో తొమ్మిదివేల చదరపు మైళ్ళ మేరకు వ్యాపించి వుంది. సముద్రపు మట్టానికి 600 అడుగుల పల్లంగా వుండడంచేత ఏడాదికి ఆర్నెల్లపాటు అరేబియన్ సముద్ర జలాలలో మునిగివుంటుంది. మిగతా ఆర్నెల్లలో అదిచవిటిపర్ర; ఎడారి; ఊషరక్షేత్రం. చెట్టుచేమ తక్కువ. ఏడాదికిపన్నెండు నుంచి పదిహేను అంగుళాల వరకు మాత్రమే వర్షపాతం. జనవాసానికి ఏమాత్రం అనువైనది కాదు.

అంతమాత్రాన జంతు నివాసానికి అనువైనది కాదని అర్థంకాదు. ఈ ప్రాంతం గ్రేట్ రాణ్ అని, లిటిల్ రాణ్ అని రెండు భాగాలుగా వుంది. వర్షఋతువు అంతమయ్యే సమయానికి గ్రేట్ రాణ్ ప్రాంతమంతా ఒకరకం పక్షులతో కలకలలాడుతూ అత్యంత మనోహర దృశ్యంగా భాసిస్తుంది. ఇటు ఆస్ట్రేలియా, అటు సైబీరియాలలోని శీతలప్రాంతాలనుంచి "ఫ్లెమింగో" అనే జాతి పక్షులు బిలబిలలాడుతూ రాణ్‌పై దండయాత్ర చేస్తాయి. ఇవి ఎర్రగా ధగధగ మెరిసిపోతూ వుంటాయి. పొడుగు కాళ్ళు, పొడుగుమెడ కలిగిన ఈ పక్షులు కొంగజాతికి చెందినవి. వాటినే రాజహంసలని కూడా అంటారు. చాలా అందంగా, ఒయ్యారాలొలుకుతూ వుంటాయి. వెచ్చగా నిర్జనంగా వుండే రాణ్ ప్రాంతంచేత ఆకర్షింపబడి వచ్చి అక్కడి లోతులేని నీటిమీద గూళ్ళు కట్టుకుంటాయి. నిప్పచ్చరమైన రాణ్‌కు వీటితో ఎంతో శోభ వస్తుంది.

లిటిల్ రాణ్ అడవి గాడిదలకు ప్రసిద్ధి. ఇవి ప్రపంచంలో మరెక్కడా లేని జాతికి చెందినవి. మిగతా అన్ని చోట్ల అవి నశించి ప్రస్తుతం రాణ్‌లో మాత్రం 800 వరకు మిగిలాయి.

అయితే, ఇవికూడా ఎంతకాలం వుంటాయో చెప్పలేము. రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతాన్ని ఉపయోగంలోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. డైకుల మోస్తరుగా అడ్డుకట్టలు నిర్మించే ప్రయత్నాలు ఫలిస్తే, సముద్ర జలాలు రాకుండా నిరోధిస్తే, కాలువల ద్వారా మంచి నీటిని తీసుకరాగలిగితే రాణ్ చవిటి పర్రలను సారవంతం చేయవచ్చు; సాగు చేయవచ్చు; గుజరాత్ రాష్ట్రానికి కొరతగా వున్న వరి పుష్కలంగా పండించవచ్చు; ఆ ప్రాంతాన్ని జనావాస యోగ్యం చేయవచ్చు.

కాని, ఇక అప్పుడు రాజహంసలకు, అడవి గాడిదలకు చోటు లేకుండా పోతుంది. సృష్టిలో అపురూపమైన ఈ రెండు జీవాలు బహుశా నశించేపోవచ్చు. ఇది విచారించదగిన విషయమే.

రాణ్ ప్రాంతాన్ని సస్యక్షేత్రంగా మార్చడం ఎప్పటికి జరుగుతుందో తెలియదుగాని, ఈ లోగా అది యుద్ధక్షేత్రంగా మాత్రం మారిపోయింది ఇండియాకు చెందిన యీ భూభాగాన్ని పాకిస్తాన్ సగానికిసగం కాజేయాలని ఎత్తువేసింది.

1762 లో ఎప్పుడో సింధుదేశపు రాజు రాణ్‌పై దాడి చేశాడట. అందుచేత అది తమదేనని పాక్ వాదం. నిజానికి ఆ సైంధవుడు ఆ ప్రాంతాన్ని పరిపాలించినపాపాన పోలేదు.

1875లో సింధు రాష్ట్రం అధికారి ఒకడు సింధు సరిహద్దు రాణ్ మధ్యలోవున్న "ధర్మశాల" వద్ద వున్నదని అన్నాడట. అయితే అది పొరపాటని బ్రిటిష్ ప్రభుత్వం అప్పుడే ఖండించింది.

రాణ్ అనేది భూవలయిత సముద్రమో, సరస్సో అని, రెండు దేశాలమధ్య సముద్రం వుంటే దాని మధ్యగా సరిహద్దు వుండాలని, కనక దాంట్లోసగభాగం తనకు చెందా

అని పాకిస్తాన్ చేస్తున్న మరో వాదం. కాని, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వపు విదేశాంగ శాఖ ఆ ప్రాంతాన్ని ఎప్పుడూ ఊబి నేలగానే వర్ణించి వ్యవహరించింది. ఏడాదికి ఆరు నెలల పాటు మాత్రమే సముద్ర జలాలతో మునిగివుండే ప్రాంతం సముద్ర మెలా అవుతుంది?

ఇలాంటి కుతర్కాలతోనే పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని వశపరుచుకోవడానికి కుయుక్తులు పన్నింది. అవి సాగక పోగా సైనికంగా దాన్ని కాజేయడానికి యత్నించింది.

ఇటు కచ్ సంస్థానం సరిహద్దు, అటు సింధు రాష్ట్ర సరిహద్దు ఎప్పుడూ వివాద గ్రస్తంగా లేనే లేవు. 1917 లో సింధు రాష్ట్రం దక్షిణపు హద్దు అరేబియన్ సముద్రం, రాణ్ ఆఫ్ కచ్ అని ఆ రాష్ట్రం గజెటీర్ వర్ణించింది.

1909 లో బొంబాయి ప్రెసిడెన్సీ ప్రచురించిన ఇంపీరియల్ గజెటీర్ ఆఫ్ ఇండియా, 1908 లో ఇండియా సెక్రటరీ ఆఫ్ స్టేట్ ప్రచురించిన గజెటీర్ కూడా ఆ సరిహద్దును అదే విధంగా నిర్వచించాయి. అలాగే బ్రిటిష్ ప్రభుత్వం ప్రచురించిన మ్యాపులన్నిటిలోను వుంది.

1914 లో బొంబాయి ప్రభుత్వం ఒక తీర్మానం చేసి స్పష్టంగా సరిహద్దును నిర్దేశించింది.

అమెరికన్ మిలిటరీ మ్యాపులలో కూడా రాణ్ ఆఫ్ కచ్ ఇండియాలో దేనని స్పష్టంగా వుంది.

ఇన్ని దాఖలాలున్నా, పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని వివాదగ్రస్తం చేయడానికి యత్నించిందంటే దాని దౌర్జన్య వైఖరికి అంతకంటె వేరే నిదర్శనమేం కావాలి?





జడ్జిగారు వాది చెప్పిందివిని "పాయింటేనోయ్" అన్నాడు.

ప్రతివాది చెప్పిందివిని "పాయింటేన్మీ" అన్నాడు.

కోర్టు గుమాస్తాలేచి "అయ్యా; ఇద్దరూ ఎలా రైటవుతారండి" అన్నాడు.

జడ్జి "నీదీ పాయింటేనోయ్" అన్నాడు.

"ఇదేమిటోయ్, కాకరకాయ కూరన్నావ్, తియ్యగావుందేం?"

"అది అరటికాయకూరండి"

"అరటికాయైతే చేదుగా తగలడిందేం?"



పూర్వకాలంలో కోసల రాజ్యంలో ఒక గజదొంగ వుండేవాడు. వాడు అద్భుతమైన తెలివి తేటలు కలవాడు. పదేళ్ళుగా ఎన్నో దొంగతనాలు చేసి అతి చాకచాక్యంతో పట్టుబడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. చివరి కెలాగైతేనేం రాజభటులు వాణ్ణి పట్టుకున్నారు. రాజుగారి దగ్గిరకి తీసుకు వచ్చారు.

వాడు దొంగతనంలోలాగే, మాటల్లోనూ నేర్పరి అని రాజుగారు చాలాసార్లు విన్నాడు. అయితే, మాటల్లో తనను మించిన నేర్పరి లేడని రాజుగారి వుద్దేశం. అందుచేత వీడే మాత్రం తెలివిగలవాడో చూద్దామని, దొంగతో ఇలా అన్నాడు:

"ఆఖరిసారిగా నీకు అవకాశ మిస్తున్నాను. నాతో ఏదన్నా చెప్పదలచుకుంటే చెప్పుకోవచ్చు. నువ్వు చెప్పింది నిజమైతే నిన్ను కొరత వేయిస్తాను; అబద్ధమైతే ఉరితీయిస్తాను."

గజదొంగ తొణుకు బెణుకు లేకుండా సమాధాన మిచ్చాడు:

"నన్ను ఉరితీయ బోతున్నారు."



సుబ్బలక్ష్మి పెళ్ళి

సుబ్బలక్ష్మికి ఇంకా జ్ఞాపకం వుంది. పెద్దక్కయ్య అనసూయ పెళ్ళిలో తను యెడ్చి పల్లకీలో కూర్చోడం. ముందు పెద్దాపురం బ్యాండువాళ్ళు "అభియ మిలాకే" పాట వాయించడం, తను కళ్ళెత్తి అక్కయ్యవైపు చూస్తున్న కొత్త పెళ్ళికొడుకనే బావవైపు చూ[illegible]. [illegible] గంధం గిన్నెలో చందనం తనమీద జల్లడం...

ఉత్సాహాన్ని యే యితర వ్యాపకాలూ జయించలేని రోజులవి. తరువాత తనకు పద్నాలుగేళ్ళప్పుడు చిన్నక్క విశాలాక్షి పెళ్ళయింది. ఈసారి పెద్దక్క పెళ్ళంత ఆర్భాటం జరగలేదు యింట్లో. అదీ తనకు తెలుసు. కానీ కారణాలు తెలుసుకుందుకు వుత్సాహ పడలేదు. ఉత్సాహం చూపించనందుకు అత్తయ్య వెటకారం చేసింది.

"నీకూ అవుతుంది లేవే పెళ్ళి... తోటి పెళ్ళి కూతురిలా పల్లకీ ఎక్కనవసరం లేదని..."

అసలు తను పల్లకీ యెక్కుతానందా? ఎక్కాలనుకుందా! ఏవీ అనుకోలేదు.

అమ్మా నాన్నా ఇంట్లో అందరూ రెండు పెళ్ళిళ్ళూ కలిపి చెయ్యాలని తహతహ లాడ్డం, ఆపైన 'దాని దురదృష్టం మళ్ళీ ఖర్చు తప్పదు' అనుకోవడం జరిగింది. ఆ దురదృష్టం అనే పదం కింద నలిగేది తనేనని తెలిసినా మనసు చివుక్కుమనలేదు. వీళ్ళు ప్రతీదీ కొండంతలు చేసుకుని బాధపడతారంటే అనుకుంది. కొత్త బట్టలు కట్టుకుని పెళ్ళి రెండు రోజులు హాయిగా తిరిగింది.

అవన్నీ యెదగని వయస్సులో జరిగినవి. రెండేళ్ళు గిర్రున తిరిగాయి. తను స్కూల్ ఫైనల్ ప్యాసయింది. కాలేజీలో జేరాలని లోపల అనుకుని ఆపైన తల్లి ముందు ప్రాధేయపడితే యెన్నో సమస్యలు తనకు తెలిసినవీ, తెలియనివీ బయటు పడ్డాయి.

తండ్రికి వయస్సు వస్తోంది. రాబడి తగ్గుతోంది. అక్కల పెళ్ళిళ్ళకు కొండ గుర్తులుగా యింకా అప్పులు మిగిలే వున్నాయి. ఆపైన వాటికి జతపడుతూ అన్నయ్య చదువు. అన్నీ చెప్పింది తల్లి.

"రేపు నీ పెళ్ళి యెలా అని మేం బాధ పడుతూంటే మధ్య యీ చదువొకటా, మళ్ళీ" అంది.

"చదువుకుని నేను వుద్యోగం చేస్తానే"

జానకమ్మగారు నమ్మలేదు... నవ్వింది, ఆనవ్వు వెనుక హేళన లేదు. అసంభవం సుమా అన్న సూచన వుందనిపించింది.

అయితే, తనకేం వ్యాపకాలు లేవు... తలగడ గలేబులు కుడుతుంది. డోర్ కర్టెన్స్ అల్లుతుంది; నావెల్స్ చదువుకుంటుంది. ఉదయం కాఫీ కలుపుతుంది. తల్లి వంట్లో బాగాలేని రోజు వంట చేస్తుంది — అంతే.

చదువుకోలేక పోయానన్న జ్ఞాపకం సుబ్బలక్ష్మిని కొంతకాలం మాత్రమే బాధ పెట్టింది. అందని వాటి గురించి ఆలోచించి ఆపైన నిర్దిష్టమైన నిర్ధారణలో అప్రయత్నం నిరమించ ... పోవడం మనసు వికాసాన్ని పెంపొందిస్తుంది. అందుకే ఆర్థిక పరిస్థితులతో ముడిపడి చదువాగిపోతే సుబ్బలక్ష్మి బాధపడలేదు.

ఆమెను మొదట 'పోనివ్వు' అనిపించి ఆ తరువాత ఆశ్చర్యంలోకి

నెంటి, ఆపైన నిరాశనుంచి విరక్తిలోకి నెంటింది తన పెళ్ళి సమస్య.

'దీని పెళ్ళి కానిచ్చెయ్యరా... యెన్నేళ్ళని?' బామ్మ కంఠం దుగ్ధపడుతోంది.

"ఏదో సంబంధం చేసెయ్యాలనే అనుకుంటున్నాం... ఘటన వుండాలి" తల్లి చాలామందితో చెబుతూ వుంటుంది. ఓరాత్రి నిద్రపట్టక ఆలోచిస్తూంటే పడగ్గదిలోంచి తండ్రి తల్లితో అంటున్న మాటలు సుబ్బలక్ష్మి చెవిన పడ్డాయి.

"డబ్బుతో దీని పెళ్ళి కానిచ్చేద్దామా అంటే అదీ కుదరదు. అలాగని దాని అందం చూసి ముచ్చటపడే వాడు వస్తాడా అంటే..."

"అందం ఎవరికి కావాలండీ... ... డబ్బుగాని" ఆ తరువాత రాత్రినుంచి ప్రతీ రాత్రీ తన పెళ్ళి వాయిదా పడ్డానికి కాదు, ఆలస్యం కావడానికి రెండే రెండు కారణాలు కన్పించాయి సుబ్బలక్ష్మికి. మొదటిది ఆర్థికసమస్య. రెండోది తన రూపం.

ఆర్థిక సమస్యలు తీరి యింటికి తన బరువు తగ్గడం అంత త్వరగా జరిగే పనికాదు. ఏ అదృష్టం వల్లనో డబ్బొచ్చి—ఇల్లంతా సిరిపూసి వేల కట్నంతో తన పెళ్ళి జరగడం కలలో కూడా అసంభవమే. ఇక రెండోది తన అందం... తను అందగత్తెనా? అసలు అందానికి కొలమానంగానీ, కొలతబద్దలుగానీ వున్నాయా? ఉంటే ఎక్కడ? చుట్టూ వాసననూనెలు, పౌడర్లు, శరీరంలో వంపులుచూపించే బట్టలు, నీడను కన్పించేటట్టు చేసే నగలు—వాటిమీద తనకు నమ్మకం లేదు—రవివర్మ చిత్రాల్లోలాగా, వీనస్ విగ్రహంలా అందమైనదా తను? కాదు. కాకపోతే తన పెళ్ళి కాదా?

ఐతే తల్లీ దండ్రీ మాటలప్రకారం —ఈ లోకంలో పెళ్ళిళ్ళు జరిగేది డబ్బున్నవాళ్ళకీ, అందగత్తెలకేనా? ఊహూఁ! వాళ్ళకు తెలియదు...

మనిషికి తెలియని మరోశక్తి మనిషిచుట్టూ తిరుగుతూ వుంటుందనీ, కర్మ, లేకపోతే దేవుడనేవాడో ఈ మనిషికి మంచో చెడో చేస్తూవుంటాడనీ—అది గీసిన గీటు దాటడం మనుష్యులన్నవాళ్ళకి అసాధ్యమనీ అనుకుని సుబ్బలక్ష్మి కొన్ని రోజులు వూరట పొందింది.

• • •

ఎంతటి ఆస్తికుడైనా తనకు దేవుడొచ్చి భోజనం తినిపిస్తాడని అన్నం ముందు కళ్ళుమూసుకుని కూర్చోడు. దానికి కారణం, ఎదటివాళ్ళ శక్తి మీదకన్నా కొంతలో కొంత తన స్వశక్తి ప్రతీ పనికీ అవసరమని తెలుసుండడం మూలంగానే అయ్యుంటుంది.

ఈలోపున సుబ్బలక్ష్మిని యిద్దరు ముగ్గురు పెళ్ళి కొడుకులు చూసి వెళ్ళ

పోయారు. వెళ్ళేముందు పెళ్ళివారు, వెంటనే జవాబు వ్రాస్తామనేవారు. నారాయణగారూ, జానకమ్మగార్ల మాటయేమోగాని సుబ్బలక్ష్మి మాత్రం ఆ జాబులు కోసం పడిగాపులు పడి యెదురు చూసేది. ఒకటి రెండు జవాబులు చదివి జీర్ణం చేసుకుంది. కొన్నిటిలో యింకా కట్నం కావాలని, మరికొన్నిటిలో మావాడు యిప్పట్లో పెళ్ళి వద్దంటున్నాడనీ వుండేవి.

'వాళ్ళు ఆగమన్నంతకాలం ఆగుతాం అని వ్రాయండి' అనేదితల్లి.

'ఇది నచ్చలేదేమో... బాగుందని అలా రాసి వుంటారు' తండ్రి జవాబు.

తండ్రి అలా అనగానే ఆయన్ని మింగెయ్యాలన్నంత కోపం వచ్చేది సుబ్బలక్ష్మికి. వాళ్ళు వ్రాయనిదానికి అర్థాలు తీస్తారేం అని.

తండ్రిమీద కోపం తగ్గిన తరువాత ఆమెకు తెలియకుండానే ఆ కోపం తనమీద విరుచుకుపడేది. అద్దం ముందు నిలబడ్డా వంటరిగా ఆలోచించుకుంటున్నా, పడుకున్నా ఏదో చీదర తన శరీరాన్ని కాలే సేది. కట్టుకున్న ప్రింటెడ్ వాయిల్ చీర, లాన్‌క్లాత్ జాకెట్టు, తల్లి తన కోసం మిగిల్చిన వంటిపేట గొలుసు, యెదిగిన శరీరం, ఆశలూ మెదడును గిరగిర తిప్పేవి. తనకిప్పుడు యిరవై యేళ్ళు. తనతోటివారు పద్మ, లలితా పెళ్ళయి కాపురాలు చేసుకుంటున్నారు. వసంత మెడిసిన్ చదువుతోంది. మాలతి రిసెర్చి చేస్తోంది.

వాళ్ళందరూ తనలా ఆలోచిస్తారా? వాళ్ళ మెదళ్ళు తన మెదడులా చిత్తుకాగితంలా తయారయ్యాయా? తనకు లేనివి-వాళ్ళకు వున్నవి యేమిటి? ఒక్క పేదరికం మూలంగానే తను వెనక పడుతోందా? లేక తనలో కొన్ని శక్తులు లేవా? తనకు తెలుసున్నంత వరకూ పెళ్ళయిన పద్మా - లలితా యేమంత అందగత్తెలు కారు. అయితే వాళ్ళకు పెళ్ళిళ్ళెలా అయ్యాయి? అర్థం కాలేదు. తన భయాల్ని జతచేసి ప్రాణంలో ప్రాణం అయిన పద్మకు వుత్తరం వ్రాసింది. పద్మ జవాబు వ్రాసింది దానికి:

'సుబ్బులూ,

నీ వుత్తరం నాకాశ్చర్యంకలిగించలేదు. భయపడ్డాను. ఎందుకంటావేమో. చాలామంది ఆడపిల్లలకు నువ్వు ప్రతినిధిగా పెళ్ళి అనే వ్యవస్థతో వొకచేత్తో లేమినీ, మరోచేత్తో అంతంతమాత్రం అందాన్ని పుచ్చుకుని పోటీపడ్డం చూసి. డబ్బులేక నీ పెళ్ళి ఆగిపోతూంటే దానికి బాధ్యులం నువ్వూ, నేనూ, మనం కాదు. మన సంఘం. తత్ కారణంగా యేదైనా విప్లవం నువ్వు తీసుకు రాగల్గితే, నీకు జరిగేది నష్టమయినా, ముందు తరం ఆడపిల్లలకు నీ వల్ల మేలు జరుగుతుంది. అది మాత్రం నిజం. కానీ అంతటి విప్లవం లేవనెత్తే శక్తి మనకు లేదేమో. ఇక రెండోది. నువ్వు అందగత్తెవు కానని బాధపడ్డావు ... అందం ... ఇది చాలా ఘాటైన పదం. ఇద్దరు పిల్లలు పుట్టగంతోనే అమ్మమ్మలయిపోతున్న యీ దేశం ఆడపిల్లల అందంమీద అత్యాశ పెట్టుకునే మగవాళ్ళ బుర్ర మీద నాకు నమ్మకంలేదు. అందం దైవ ప్రసాదం. కావాలంటే వచ్చేది కాదు. అయినా నీ మీద నీకు నమ్మకం వుండాలి. నేను అందగత్తెననీ, అందువల్లే నన్ను మా ఆయన పెళ్ళాడారనీ, ఆయన అనగా నే నెప్పుడూ వినలేదు. ఓసారి మాటల్లో అన్నట్టు గుర్తు— నా కళ్ళో, లేకపోతే మెత్తని వొత్తయిన జడో ఆయన్ని ఆకర్షించిందట. మగాళ్ళు పిచ్చివాళ్ళంటాను నేను. వాళ్ళకు కావలసింది వాళ్ళకు తెలియదని, మనకు తెలుసుండీ తిరిగి వాళ్ళకు యివ్వాల్సిందేమిటా అని మధన పడతాం మనం. ఇరవై యేళ్ళ వయస్సేమీ భయపడాల్సింది కాదు. మా కన్నా, ముందు ముందు నీ అనుభవమే నీకు వెలుగవుతుంది—పద్మ'

సుబ్బలక్ష్మి ఆ వుత్తరం పదిసార్లు చదివింది. తనకు కావలసింది ఆ వుత్తరంలో వుందో లేదో తేల్చుకోలేక పోయింది ఆఖర్ని.

ఇప్పటికి తనని చూసినవాళ్ళు యెంతమందో సంఖ్యల వారీగా, పేర్ల వారీగా తనకు తెలుసు. నిజంగా తననా క్షణంలో అడిగితే ఫలానా వెంకట్రావుకు మెల్ల కన్ను అని, మరో రామారావుకు బట్టతలనీ, వంకర నడకనీ రకరకాల వ్యాఖ్యలు చెయ్యగలదు. అయినా, తనెందుకు చెయ్యలేక పోయింది? ఎందుకు చెయ్యలేదు? మగవాడిలో కూడా ఆడది చాలా కావాలనుకుంటుందే, చూడాలనుకుంటుందే? మగవాడేనా మన్ననకు అర్హుడు?

తనకు సమాధానం ఎవరినుంచి రాదనుకుందో అక్కడినుంచేవచ్చింది. అరవైయేళ్ళ బామ్మగారు సుబ్బలక్ష్మి అదోలా వుండడం చాలారోజులుగా గమనిస్తూనేవుంది. అందుకే ఆ రాత్రి పదిగంటలవేళ కదిలించి, ఆశా నిరాశలమధ్య ఆకులా అల్లల్లాడే మనవరాలి అంతర్యంలో బీటలుచూసి ఆక్రోశించి, ఆపైన అతికించాలని, ఏవేవో

- హైస్కూలు వార్షికోత్సవానికి రాజకీయ నాయకుడిని అధ్యక్షుడుగా పిలిచారు. ఆయన అధ్యక్షోపన్యాస మిస్తూ యిలా చెప్పాడు :

'బాలబాలికలారా! విద్య అంత మంచివస్తువు ప్రపంచంలో మరొకటి లేదు. విద్య ప్రతివాడికి అవసరం. మాటవరసకి గణితశాస్త్రం తీసుకోండి. ఈ శాస్త్రంవల్లనే మనకి తెలుస్తుంది. రెండు రెళ్ళు నాలుగని, నాలుగు నాలుగులు ఎనిమిదని, ఎనిమి దెనిమిదులు—ఊ—ఊ—ఊ— అలాగే భూగోళం చూడండి ... ...'

ఓదార్పుమాటలు చెప్పింది. అంతా విన్న సుబ్బలక్ష్మి కన్నీటిమడుగైంది. ఇరవైయేళ్ళవ్యక్తిత్వం, ఇరవైరోజుల పసితనంగా మారి బామ్మగారి అక్కున అంటుకుపోయింది.

"ఓసి పిల్లా, ఏడవకు, తప్పు. డబ్బు ఎక్కువకావాలని అడగలేక కొందరు డొంకతిరుగుడుగా వ్రాస్తారంతే. నువ్వేం అనాకారివా? ఎవరు చెప్పారు?"

"నన్నేడిపించడానికి కాకపోతే సూటిగా వ్రాయకూడదా బామ్మా!"

"నీ కొడుకు పెళ్ళికి నువ్వలా చేద్దువుగాని లే" అంది.

బామ్మ తనని ఓదారుస్తోందని తెలుసు. వీపు నిమురుతోందనీ తెలుసు. ఆ వడిలిన చెయ్యి తన వంటిమీద శీతలవాయువులు ప్రసరించగలదనీ తెలుసు. ఆ క్షణంలో ప్రపంచాన్నీ తననీ మర్చిపోయింది సుబ్బలక్ష్మి.

ఇటు కూతురుకన్నా అటు తల్లిదండ్రులు సుబ్బలక్ష్మి పెళ్ళి గురించి తహ తహ లాడి పోతున్నారు. మనవరాల్ని ఓదార్చినా, కార్యసాఫల్యం జరిగేది యెలా అని బామ్మగారు ఆలోచిస్తూనేవుంది.

"ఈ సారి వున్న ఆ ఎకరం అమ్మి పారేసేనా దీని పెళ్ళి చెయ్యాలి, ఆ తరువాత మగవాళ్ళు ముష్టెత్తుకోనీ" అనుకున్నారు నారాయణగారు.

"దీని పెళ్ళయితే ఏడుకొండలెక్కుతాం" అని దణ్ణం పెట్టుకుని, వెండి రూపాయి మీద కట్టిందిజానకమ్మ.

● ● ●

"మధ్యాహ్నం పెళ్ళివారొస్తారు... ఇంకా నిద్రేమిటి, లే, సుబ్బులూ" బామ్మగారు మనవరాల్ని లేపుతోంది......

"పదేళ్ళనుంచి వస్తున్నారు, రానివ్వు బామ్మా. నాకూ వాళ్ళకీ కొత్తేముంది?" అంది సుబ్బలక్ష్మి.

"ఛా పెంకి ఘటం" బామ్మగారు సుబ్బలక్ష్మికి కితకితలు పెట్టింది ... నవ్వుతూ వంకరలు తిరిగి పోయింది. సుబ్బలక్ష్మి లేచి తలంటి పోసుకుంది. పక్క పాపిడి తీసుకుని జడ అల్లుకుంది. తెల్లచీర నీలం బోర్డరుది కట్టుకుంది. గుండ్రంగా తిలకం అద్దుకుంది ... తనలో తనకే కొత్త సుబ్బలక్ష్మి కన్పిస్తోంది.

"ఈసారి... ఈ సారి" అనుకుంటోంది పెళ్ళి కాని, పాతికేళ్ళకు దగ్గరవబోతున్న సుబ్బలక్ష్మి.

మామూలు ప్రకారం పెళ్ళివారి వొప్పుదల కోసం యింటిల్లి పాదీ యెదురు చూస్తున్నారు. సుబ్బలక్ష్మికి మరీ ఆత్రుతగావుంది. పద్మ వ్రాసిన వుత్తరం మనసులో పలుకుతోనేవుంది. తను అనవసరంగా తపన పడకూడదు. ఉన్నదానితో ఉత్సాహపడ్డం నేర్చుకోవాలి. ఉత్తరం పోస్ట్‌మన్ నుంచి సరాసరి తనే అందుకోవాలని నిర్ధారణ చేసుకుంది. అలాగే జరిగింది.

చదివిన తరువాత – చదవబోయే ముందటి సుబ్బలక్ష్మి కాలేకపోయింది. పాతకథే. గుండెల్నిపిండే వ్యథే. "అమ్మాయి మావాడికి నచ్చలేదట" క్రింద పెళ్ళి కొడుకు తండ్రి సంతకం. "కారణం?" అనిగట్టిగా అరిచింది సుబ్బలక్ష్మి. ఆ అరుపు యెవరూ వినలేదు. లేకపోతే ఆ అమ్మాయికిపిచ్చెక్కిందనుకునేవారు. మరీ మనసెరిగిన వాళ్ళయితే ఆ కన్నీటిని – తమ కన్నీటితో కప్పి వోదార్చేవారు. అంతలా మారిపోయింది సుబ్బలక్ష్మి.

● ● ●

నిజానికి సుబ్బలక్ష్మికి పిచ్చెక్కలేదు... ఆలోచనలతో మెదడు పదును దేరింది. మొదట కొంత ఆవేశం కలిగింది. ఆ తరువాత తన మీద తనకే అసహ్యం పుట్టింది. అఖర్న విరక్తి కలిగింది. ఆ విరక్తి యెక్కడకు తీసుకు వెళ్ళి వదులుతుందో ఆమెకు అవసరం లేకపోయింది. తుది మెట్టుగా తెగింపు మెదడులో విజయ ధ్వజం నాటింది.

"నువ్వెళ్ళి రారా, రాజమండ్రీ వోసారి... మరో వెయ్యి యిస్తామంటే వొప్పుకోకపోరు" బామ్మ తండ్రిని పోరుతోంది.

సుబ్బలక్ష్మికి యేడు పొచ్చినంత పనైంది. ఆ రాత్రంతా ఆలోచించి వో నిర్ణయానికి వచ్చి, వచ్చిన నిర్ణయాన్ని ఆచరణలో పెట్టాలంటే చేతులూ కాళ్లు ఆడలేదు. తను తొందర పడుతున్నానా అని కలవరపడింది. కానీ తనకు కావలసింది తనమీద నమ్మకం. తన విలువ యెంతో, మనిషి విలువ యెంతటిదో అంచనా కట్టి చూపించాలంటే అంతకుమించి మార్గంతోచలేదు. లేచి నెమ్మదిగా లైటు వెలిగించి ఉత్తరం మొదలుపెట్టి, పూర్తిచేసి నాలికచివర తడితో కవరు అంటించింది. ఉత్తరం ముగించి... "ఔను ... తెలిసిరావాలి ...ఎంతకాలం నేనీ నరకాన్నిభరించగలను? అందుకే చేశాను..." అనుకుంది. వెళ్ళి నిద్రపోడానికి మంచం మీద కూర్చుంటే "ఏం చేస్తున్నావే యింకా" అంటూ బామ్మ పలకరించింది......

"ఏం లేదు......"

"మీ నాన్న రేపు రాజమండ్రీ వెడతాట్ట."

"ఎందుకు?" కొంచెం భయంగానే అడిగింది.

"నీ మొహంలా వుంది... పెళ్ళి ముహూర్తం స్థిరపర్చడానికి."

"నేను నచ్చలేదని వ్రాశారుగా... ఇంకెందుకు దండగ?" అనేసింది.

"నచ్చకపోవడమేం లేదు......అంతా డబ్బు... డబ్బుతో వుంది..."

డబ్బుతో కానిది లేదా... మరి మనిషి మాటేమిటి? అంగం మాటేమిటి? ఆకర్షణమాటేమిటి? తక్కినవన్నీ మొదటిదానిముందు పీగపోతాయా? లేక మిగతావి [illegible] నెగ్గుతాయా? తన అనుమానాలు బామ్మనుంచి తీర్చుకోవాలనిపించలేదు, ఆ రాత్రివేళ సుబ్బలక్ష్మికి.

రాజమండ్రి [illegible]

గారు రెండు రోజుల తరువాత నవ్వు మొహంతో తిరిగొచ్చారు. ఆ తరువాత ఎకరం పొలం అమ్మేశారు... మగపెళ్ళివారు కోరిన కట్నంకన్నా తక్కువకే ఒప్పుకోవడం జానకమ్మగారికి ఆనందం కలిగించింది. బామ్మగారు పెళ్ళి పనుల హడావిడిలో ప్రపంచంమాట మరిచిపోయింది.

ఇంట్లో యిన్ని జరుగుతున్నా, పెళ్ళి కుదిరిన సుబ్బలక్ష్మి మానసికంగా ఆనందించలేకపోతోంది. తనకు పెళ్ళి జరిగి పెద్ద సమస్య తీరుతోంది. పాతికేళ్ళ తన కన్నెచెర వదుల్తోంది— తెలిసిన స్నేహితురాళ్లు సంబరపడుతూ పలకరించారు. అటు అందం తక్కువనీ, ఆ తరువాత కట్నంకావాలనీ అన్న పెళ్ళివారు, కొన్ని మెట్లు కిందకేదిగారు. తండ్రి పరంగా, యింటి పరంగా అది ఆనందించాల్సిన విషయం. కానీ ... తను యేమని ఆనందిస్తుంది? ఏం పొందిందని సంబరపడాలి అనుకుంది పెళ్ళికూతురు సుబ్బలక్ష్మి. ఇంతలో పద్మ వుత్తరం వ్రాసింది. అందులో సారాంశం 'ఇంతకాలం నీలో అందం లేదనీ ఆకర్షణ లేదనీ వొట్టి డబ్బుకే విలువున్న రోజులని వాపోయావుకదా ... నీ మటుకు చెప్పు... మరిది బావుంటారని వ్రాశావు. అంతో యింతో చదువుకున్నవాడు. అలాంటి మగవాడు అతిసాధారణ కట్నంతో నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాడంటే ఆ నిర్ధారణ వెనక డబ్బు ఆశ వుందనగలవా యింకా ... యింకో విషయం. మా శ్రీవారికి మీవారు బాగా తెలుసుట ...' అని.

సుబ్బలక్ష్మి పెళ్ళయ్యింది. కాపురానికి వెళ్ళింది. భర్తతో పరిచయం అనురాగంగా మారి విడలేనిదిగా అవుతోంది. అయినా అప్పుడప్పుడు సుబ్బలక్ష్మి తన ప్రశ్నకు దొరకని జవాబు కోసమే యెదురుచూస్తోంది. భర్తను అడిగే అవకాశం రాలేదు. తను తొందరపడో కావాలనో కాబోయే భర్తకు ముందుగానే వుత్తరం వ్రాసింది ... అందులో విషయాలు ఆయన తనముందు ప్రస్తావిస్తారని – అందుకు జవాబులు ఆలోచించే పెట్టుకుంది. కానీ అతను కదపక పోవడం ఆమెను మరింత యిరుకున పడేశాయి.

ఆడది వో మొగవాణ్ణి స్వంతం చేసుకుంటుంది. స్వంతం చేసుకునేది యే ఆయుధంతో? అందరిమాటూ యెలావున్నా తనపెళ్ళి యెలా జరిగింది? డబ్బుతో తను భర్తను కొనుక్కోలేదు. మరి అందగత్తె కాదని మొదట తిరస్కరించిన భర్త పెళ్ళి చేసుకుని అభిమానిస్తున్నాడంటే అది నటనా ... నిజమా ... వొక్కొక్క రాత్రి పక్కనున్న భర్త అమాయకంగా అల్లరి చేసినా ఆప్యాయత చవి చూపిస్తున్నా నమ్మలేకా, అటు అనుభవశాలిగా కిమ్మనలేకా విలవిల్లాడిపోతోంది. మనసులో బాధ నంతా పద్మకు వుత్తరం వ్రాసింది ... పద్మ వెంటనే జవాబు వ్రాసింది.

'నీ ఉత్తరం అందింది ... ... కానీ పూర్వపు నీ అనుమానాలు నిన్ను వదిలిపెట్టనందుకు ఆశ్చర్యపోతున్నాను సుబ్బులూ. నువ్వు అమాయకురాలివే ... ... హనుమంతుడికి తన బలం తనకు తెలిసేదికాదుట. ఎవరో చెబితే గాని తెలుసుకోలేకపోయేవాట్ట. అలావుంది నీ కథ.

ఏమీ లేనివాడు, కటికదరిద్రుడు, లంకెల బిందెలు దొరికితే ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరవుతాడు తప్ప ఆనందించలేడంటారు.

మనల్ని హామేషా దూషించే శత్రువులకన్నా— మనకోసం ప్రాణం పెట్టే స్నేహితుల్నే యెక్కువ అనుమానిస్తాం. ఇదంతా ఆలోచిస్తే మనిషి అతీతంగా జరిగేవాటిని నమ్మేటంతగా ఎదగలేదనిపిస్తుంది. లేకపోతే నీ భవిష్యత్ మీద నమ్మకం లేక, నువ్వు మరిది మధుసూదనానికి పెళ్ళిముందు ఉత్తరం వ్రాయవు.

అతను మావారికి ఆ ఉత్తరం చూపించాడు ... నేనూ చదివానులే. నువ్వు వ్రాశావు గుర్తుందా ... 'కట్నం మరీ ఎక్కువ కావాలన్న మీ ఆశయం చెడ్డదైనా నేను భరించగలనుగానీ— నేను నచ్చలేదనే అబద్ధంతో నామీద నాకున్న నమ్మకాన్ని చిత్రవధ చెయ్యకండి. పెళ్ళి చేసుకునే వ్యక్తిగా మీ నిజమైన అభిప్రాయాన్ని మీరు వ్రాయండి, ఇప్పుడైనా' అని వ్రాశావు. అంతకుముందు చాలామంది అలా చేసి ఉత్తరాలు వ్రాసిన మూలంగా ... నిజానికి మధుసూదనం అయినవాళ్ళ ఒత్తిడికి తలొగ్గి మీ యింటికి పెళ్ళి చూపులకు వచ్చాట్ట. అంతంతమాత్రంగానే నిన్ను చూశాట్ట. చాలాకాలం చెరగనిముద్ర వెయ్యడానికి నువ్వు అప్సరసవి కాని మూలంగా అప్పుడే మర్చిపోయాట్ట ... కానీ నీ ఉత్తరం ఛెళ్ళున తగిలేసరికి —ఎందుకో నిన్నే పెళ్ళి చేసుకోవాలనిపించిందిట. అప్పుడే, నువ్వు ఎంతో ముచ్చటగా నడుస్తూ హాలులోకి రావడం, అడిగిన ప్రశ్నలకు మంచి ముత్యాల జవాబులు వెదజల్లడం, పలకడం అన్నీ ఆకర్షణలై గుర్తుకు వచ్చాయట... ఆపైన అన్ని

● మద్రాసులో చాలా మందికి అస్తమానం తమలపాకులు నమలడం అలవాటు. కిళ్ళీకొట్లో తమలపాకులు, వక్కపొడి కొనుక్కుని రోడ్డుమీద నడుస్తూనే ఆకులకి సున్నం రాసుకుని నముల్తూ వుంటారు. చేతికంటిన సున్నం కనపడిన ఎలక్ట్రిక్ స్తంభానికల్లా రాస్తూ పోతూ వుంటారు. మద్రాసులో ఏ స్తంభాన్ని చూసినా సున్నం మరకలే కనిపిస్తాయి.

వీళ్ళకోసం ఒక బాబ్జీ ఒకకొత్త రకం నరకం ఊహించాడు. అక్కడ స్తంభాలు, గోడలు వుండవు.

తీసిమించి అంతధైర్యంగా ఉత్తరం వ్రాసిన ఆడపిల్లను భార్యగా కాదన లేకపోయాడట... ... ... నీ మాటలు చెబుతూ అతను నవ్వుతూంటే అతని కనుపాపల్లో నాకు నువ్వే కన్పించావు.

ఇప్పుడు చెప్పు. మధుసూదనానికి నీలో ఏం కన్పించింది? నీ డబ్బా? అందమా... మనిషికి యేంకావాలో ఏది అక్కరలేదో తెలియదని వప్పుకో. ప్రతిమనిషి తన జీవితాన్ని వెదికి చూసుకుంటే - యేవొకటి రెండు క్షణాల్లోనో ఆకర్షవంతంగా హర్షవంతంగా బ్రతికిన అనవాళ్ళు కన్పిస్తాయి. అవే మనిషిని మరో మనిషికి జతచేసి వీడని ముళ్ళు వేస్తాయి ... పద్మ...'

సుబ్బలక్ష్మి నివ్వెరపోయింది... తనమీద నమ్మకం కొత్త దుస్తులతో నాట్యంచెయ్యడం కన్పించింది. అద్దంలో చూసుకుంటే తనరూపం బదులు భర్త రూపం కన్పించింది. వెనక్కి చూసింది - యెవరూ కన్పించకపోతే మరీ సిగ్గుపడి పోయింది...

ఆ రాత్రి భర్తను ధైర్యంచేసి అడిగేసింది. అనుమానం తీరక 'ఆ రోజు నా వుత్తరం చదివి యేమనుకున్నారు...' అని.

'ఏ వుత్తరం' అన్నాడు పరాకుగా మధుసూదనం...

సుబ్బలక్ష్మి దగ్గర అంతకుమించి మరో ప్రశ్నకు చోటు లేకపోయింది. అరక్షణంలో ఆలోచించి నవ్వుతూ సుబ్బలక్ష్మి దగ్గరకు వచ్చి హటాత్తుగా గుండెలకు హత్తుకున్నాడు మధుసూదనం ...

సుబ్బలక్ష్మి తప్పించుకోలేక రెండు చేతులమధ్య వుండిపోయి... 'ఇదేమిటి' అంది ... చిన్నగా ...

'నీ ప్రశ్నకు నేనిచ్చే జవాబులో మొదటి ...'

'ఛీ' అంది సుబ్బలక్ష్మి నవ్వుకోడానికి అవకాశం లేక ...

□□□

నవ్వాలి నవ్వాలి

- సినిమాల్లో చిన్న వేషాలువేసే ఒక యాక్టరు హోటల్లో కూర్చుని కాఫీ తాగుతున్నాడు.

  అతన్ని చాల సేపటినుంచి పరకాయించి చూస్తున్న సర్వరు 'మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందండి' అన్నాడు.

  యాక్టరు కాలరు సర్దుకుని చిరునవ్వుతో 'సినిమాల్లోనేమో' అన్నాడు.

  సర్వరు 'అయ్యుండచ్చు. నేను వారానికి రెండు మూడుసార్లు సినిమా కెడతాగా. ఏ హాల్లోనో చూసుంటాను' అన్నాడు.

- భర్త: 'ఇవ్వాల్టికి మన పెళ్ళయి సరిగ్గా పాతికేళ్ళయింది. నమ్ముతావో లేదోగాని, అచ్చు మన పెళ్ళిరోజు నెలా వున్నావో ఇవ్వాళా అలాగే వున్నావు.'
  భార్య: 'ఎందు కుండనూ? అవాళ కట్టుకున్న చీరేగా ఇది?'

- కవి భార్య: 'మా ఆయన రామాయణం మళ్ళీ రాస్తున్నారు.'
  పక్కింటావిడ: 'కొనుక్కుంటే పోదుటమ్మా! మళ్ళీ రాయడం దేనికి?'

- ఋణగ్రస్తుడు: డబ్బు బాకీ పడ్డవాడు.
  ఋణదాత: బాకీ డబ్బు తిరిగి వస్తుం దనుకునేవాడు.

- 'డబ్బో డబ్బో అంటావుగాని డబ్బు మరీ ఎక్కువగా వున్నా బాధే అనుకో.'
  'బాధేగాని, డబ్బుంటుంది గనక ఎలాగో భరించవచ్చు.'

దేవుడు కరుణించాలి...



జగన్నాథం గదినుండి బైటపడే సరికి తొమ్మిదైంది. మెట్లు దిగి పర్సు చూచుకున్నాడు. పధ్నాలుగు రూపాయిలమీద కొంత చిల్లర పైకముంది. "జీతం రావడానికింకా ఇరవై ఏడు రోజులుంది" అనుకున్నాడు. ఆ తర్వాత కొంచెం భయమూ వేసింది.

నెమ్మదిగా గాంధీనగరం చేరుకున్నాడు. హొటల్‌కి వెళదామా వొద్దా అనుకుంటూనే హొటల్లోకి వెళ్ళిపోయాడు. సర్వర్ని చూచిన తర్వాత మళ్ళా భయపడ్డాడు. కేవలం కాఫీకే ఆర్డరిచ్చేడు.

సిగరెట్టు తీసి ముట్టించేడు. బుర్రంతా గందరగోళంగా వుంది. చేతుల్తో మొహం తుడుచుకున్నాడు. కాఫీ వొచ్చింది. తాగేడు. మళ్ళా ఆలోచనల్లో పడిపోయేడు.

'ఈ జీవితానికి సుఖం లేదు' అని చాలా తడవ లనుకున్నాడు. అలా అనుకున్నప్పుడల్లా అతని గుండెల నిండా భయం నిండుకుంటుంది. అంత భయంకరమైన ఆలోచన

ఆరోగ్యానికి మంచిది కాదని గుర్తు కొచ్చినప్పుడు గాలిమేడలు కట్టేస్తాడు. అతను కట్టే గాలిమేడలు తమాషాగా వుంటాయి. భవిష్యత్తులో ఒకానొక రోజుని బ్రహ్మాండంగా వూహిస్తాడు. దానికి కొన్ని రంగులు పులుముకుంటాడు. కాసేపు వాటితో ఆడుకుంటాడు. తెలుసు – ఆ రంగులు కాసేపటిలో కరిగిపోతాయనీ, ఆ మేడలు కూలిపోతాయనీను.

ఏవిధమైన ఆలోచనలూ రాకూడదని అతను చేస్తోన్న ప్రయత్నం ఇంతా అంతాకాదు. ఎంత కమ్మటి ఆలోచనైనా కాసేపట్లో అతి భయంకరంగా మారిపోవడం అతని దురదృష్టమే.

హెూటల్లో జనం రద్దీగా వున్నారు. గజిబిజిగా మాటలూ వినిపిస్తున్నాయి. ఐనా అతను అన్నింటికీ అతీతుడైనట్టు యీ వాస్తవ ప్రపంచానికి దూరంగా వెళ్ళి అతనికై నియమింపబడ్డ విషవలయంలో యిరుక్కుపోతున్నాడు. ఇదే... ... ఇదే అతనికి నచ్చనిది, అతను ద్వేషించేదీని.

చప్పున లేచాడు. కౌంటర్‌దగ్గర కొచ్చి బిల్లు చెల్లించాడు. బైటకు రాబోతూండగా అతనో మనిషిని చూచి బ్రేక్‌వేసినట్టు ఆగిపోయేడు. కాసేపు ఆశ్చర్యపోయేడు.

కనిపించింది చిదంబరం!

బక్కగా ఎర్రగా ఎత్తుగావుండే చిదంబరం రెండేళ్ళక్రితం బి. ఎ. లో అతనిక్లాసుమేటు. గోళ్ళుగిల్లుకుంటూ క్లాసుబైటనున్న రావిచెట్టు అకులు లెక్కపెడుతూ పాఠాలువినే చిదంబరం యిప్పుడు గొప్ప వ్యక్తి అయ్యాడని ఎవరో చెప్పగా విన్నాడు. ప్రయోజకులంతా మొదట్లో పిచ్చాళ్ళలానే కన్పిస్తార్త!

సూటులో ముచ్చటగా వున్న చిదంబరం నల్లకారులోంచి దిగి ఆ హెూటల్‌తాలూకు "లాడ్జింగ్‌కి దారి" తాలూకు మెట్లెక్కాడు.

వెళ్ళేప్పుడు జగన్నాధాన్ని చూశాడుగానీ, ఎంచేతో పలుకరించలేదు. చిదంబరం వెనక ఇద్దరు ఘరానా వ్యక్తులు వున్నారు. ముగ్గురూ హడావిడిగా వెళ్ళిపోయారు. వాళ్ళు మేడ మెట్లెక్కిన తర్వాత నల్లకారూ కదిలింది.

పరాకుగా వున్న జగన్నాథం వేలు చురుక్కుమంది. సిగరెట్టు చివరంటావచ్చి వేలు కాలింది.

జగన్నాథం మనసు చివుక్కుమంది.

జగన్నాధానికి అసూయ ఎక్కువని జగన్నాథం అభిప్రాయం. అతని అభిప్రాయాలపైన అతనికి నమ్మకం ఎక్కువ. చిదంబరం బాగుపడ్డాడు. దాన్లో దాగిన రహస్యమేవిటి? అది తెలుస్తే బాగుండి పోను,

కొందరు అదృష్టవంతు లుంటారు.. కొన్నాళ్ళపాటు ఆ అదృష్ట జాతకం కావాలని వాయిదా వేసుక్కూర్చుంటుంది. సమయం వొచ్చినప్పుడు వరదొచ్చిన గోదారిలా ఆ మనిషిని ముంచెత్తేస్తుంది.

చిదంబరం లాటి జాతకం తనకు వుంటే ...

పేలవంగా నవ్వేడు జగన్నాథం. జగన్నాథం సర్వసాధారణంగా నవ్వడు. నవ్వితే అది నవ్వులానూ వుండదు. కొందరు నవ్వితే వెన్నెల చిందినట్టు వుంటుంది. నవ్వుకీ మనసుకీ సంబంధ ముంటుందిట. మనసు నిర్మలంగా నిశ్చింతగా వున్నప్పుడు నవ్వితే ఆ నవ్వు వెన్నెల్లా, మెత్తగా, ఎదటి వాడికి హాయిగా వుంటుంది.

అలా నవ్వాలని అతను చాలా మాట్లు ప్రయత్నించేడు.

— జగన్నాథం రోడ్డు మీద కొచ్చింతర్వాత అనుకున్నాడు — 'ఇప్పుడేం చేయాలి?' వెధవది ప్రతీదీ ఒక సమస్యే అని విసుక్కున్నాడు. మళ్ళా తనపైన తనే జాలి చెందాడు. జగన్నాథం బ్రతుకు తమాషాగా వుంటుంది. అతను యువకుడు. పెళ్ళికానివాడు, నిండా పాతిక సంవత్సరాలు లేనివాడు. అవునా? ఇంత పసివాడికి లక్ష సమస్యలా? మనిషిని చిత్రవధ చేసే భయంకరమైన సమస్యలా?

మూడు ప్రాణాలు తనని నమ్ముకున్నాయి. ఆ మూడు ప్రాణాలూ అతని ప్రాణంకంటె ముఖ్యమైనవి. వాళ్ళ వూళ్ళో అతనికి అమ్మవుంది. ఆవిడ వృద్ధురాలు. ఒక తమ్ముడున్నాడు. వాడు కోరికల కొండ. చదువుకుంటున్న కుర్రాడు. అభివృద్ధికి రావలసిన వంశోద్ధారకుడు. వాడి భవిష్యత్తు జగన్నాథం చేతుల్లో వుంది. ఈ పాయింటుకి జగన్నాథం మరో అప్పుడైతే సంతోషించేవాడు, గర్వించేవాడూను. కానీ – యీ దౌర్భాగ్యుడు మరో ఆశావాదికి ఏ విధంగా సాయపడగలడని ప్రశ్నించుకుంటే దిగులు మాత్రలు మింగినట్టే అవుతుంది.

సుగుణమ్మ అతనికి చెల్లెలు. పెళ్ళీడు కెదిగిన యువతి. అందాల రాశి రతనాల బొమ్మ. కానీ ఆ బొమ్మ నోరులేని ఆడబొమ్మ. మూగపిల్లకి పెళ్ళేమిటి వల్లకాడు అని తీసిపారేసే అనేకమంది మహాతల్లుల మధ్య, తోటి యువతుల మధ్య జీవచ్ఛవంలా బ్రతుకుతున్న అభాగిని.

ఆ అభాగినీ జగన్నాధాన్నే నమ్ముకుంది. ఏ నాటికైనా అన్న నాకో దారి చూపించడా అని గంపెడాశతో, అవమానాన్ని భరించి మరీ కాలం గడుపుతోంది పిచ్చి చెల్లి!

చెప్పాలని వుంది – "ఈ దౌర్భాగ్యుడు నీకు అన్న. నువ్వు మూగపిల్లవు, నీకు సుఖంలేదు చెల్లీ! ఇంత విషంతిని చావు" అని. కానీ, చెప్పలేదు. తన గుండెల్లో తనే కత్తిని దింపుకునేంత సాహసం లేదు.

ఇంటికి పెద్దవాడుగా పుట్టుట.

ఆదివిష్ణు

తల పండి పోయేంత అనుభవం నీ నూనూగు మీసాల వయస్సులోనే రుచి చూడాలి. తట్టుకునే సత్తా వుంటే, జ్యేష్ఠుడివిగా పుట్టి–లేదూ–నీ అసమర్థతని పదిమంది లోనూ వొప్పేసుకుని నీ దారేదో నువ్వు చూసుకో. ఇలా అని జగన్నాథం ఓ మిట్ట మధ్యాహ్నపువేళ ఏమీ తోచక డైరీలో వ్రాసుకున్నాడు. దాని క్రిందే మరో వాక్యం ఎర్ర సిరాతో వ్రాసుకున్నాడు. 'నాకు ఆ సత్తాగానీ, అసమర్థత వొప్పేసుకునేంత చొరవగానీ లేవు. అందుకే నేనింత వెధవనౌతోంది.'

ఈ విషయా లేవీ మేరీకి తెలీవు.

మేరీలాటి ఓ స్త్రీ తన నింతగా గౌరవిస్తున్నదంటే ఆశ్చర్యం అనిపించడం లేదుగానీ విచారంగా వుంది. నిజమే.

నాన్న బ్రతికున్నరోజుల్లో సంసారం గుట్టుగా వుండేది.ఆయన అప్పులు చేసేవారని తెలీనిచ్చేవారుకాదు. అదిగో, అల్లా వుండాలి మనిషన్న తర్వాత. తనని చదివించేరు. అడిగినంతా యిచ్చేవారు.

బి. ఎ. థర్డు యియర్‌లో మేరీతో పరిచయం. అదో బంగారుకల! మేరీ తెలుగులో కవిత్వం వ్రాసేది. జగన్నాథం వ్రాసేవాడుకాదు. మేరీ చక్కగా పాడేది. జగన్నాథం పాడేవాడుకాదు.

చదువులో బ్రిలియంటనబడే జగన్నాథం జీవితంలో దద్దమ్మ అవుతాడని ఎవరనుకున్నారు? మేరీతో చాలాసార్లు చెప్పాలనిప్రయత్నించేడు 'నేను దద్దమ్మని మేరీ!' అని. కాని చెప్పలేదు. చెప్పేందుకు అభిమానం అడ్డువచ్చేది.

మేరీ నవ్వుతే వెన్నెల చిందినట్టే వుంటుందిగానీ ఎందు కలా నవ్వుతుందో ఒక పట్టాన అర్థంకాదు. అర్థం కాకపోయినాసరే హాయిగావుండే ఆ నవ్వుని మళ్ళాచూడాలి.

ఈ రాత్రి మెయిల్‌లో మేరీ వొస్తుందిట. స్టేషన్లో కలుసుకోమని నిన్న వైరిచ్చింది. కలుసుకోవడమా వొద్దా అనే అంశం నిన్నటినుంచీ ఎటూ తేలకుండానే వుండిపోయింది. విషయంగా చూస్తే యిది చిన్న సైజుదే కావచ్చు. లోతుగా ఆలోచిస్తేమాత్రం గుండెదడ ఎక్కువై పోగలదు.

నాన్నగారు మూడు నెలల్లో స్వర్గస్థు లౌతారనగా ఓ వెన్నెల రాత్రి మనసు పరవశం చెందుతూండగా మేరీకో మాట ఇచ్చాడు– 'పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే పెళ్ళాడుతాను' అని. తర్వాత పరిస్థితులన్నీ తారుమా రయ్యాయి.

కులాలకే తల పగల కొట్టుకునేంత ప్రాముఖ్యం ఇచ్చే యీ రోజుల్లో మతాంతర వివాహం ఆ వెన్నెల రాత్రి తను చేసిన శపథమంత తేలికైన పని కాదు. ఇంటికీ, వంశానికీ 'పెద్ద దిక్కు' జగన్నాథం. జగన్నాథమే తప్పటడుగు వేస్తే, రేపొద్దున రెండు నిండు ప్రాణుల

ఉసురు తను కట్టుకోవలసి వస్తుంది. అందులో తండ్రి లేడు. ఆయనుంటే, తన బ్రతుకేదో తను చూచుకుని మిగతావాళ్ళ బాధ్యత ఆయన కప్పగించేవాడు.

అయితే - జగన్నాథం యీ పెళ్ళికో ఉపాయం ఆలోచించి పెట్టేడు. ఆచరించడం కొంచెం కష్టమే అయినా ఫలితం మాత్రం శ్రేయస్కరం. తనని నమ్ముకున్న ఇద్దరి బ్రతుకులూ ఓ దారికి తీసుకొచ్చిన పిదప మేరీని పెళ్ళాడేస్తే భయపెడుతూన్న 'వివాహ' సమస్య తీరినట్టవుతుందని అతని ఉద్దేశం. అందుకే నోటి కొచ్చినట్టు వాయిదా వేస్తూ వొచ్చాడు అతని పెళ్ళికి. ఈ ఉపాయం మేరీకి చెప్పాలని వుందిగానీ, చెబుతే తన మొహం ముందే తన అసమర్థతని ఎద్దేవా చేస్తుందని భయం. పైగా, బాగా డబ్బున్న ఆసామి కూతురు మేరీ. కొంచెం తలతిక్క మనిషని గూడాజగన్నాథం అభిప్రాయం.

— వెనగ్గా వొచ్చిన కారు హారనువిని ఉలిక్కిపడి పక్కకి తప్పుకున్నాడు జగన్నాథం. కారుదూసుకుపోయింది. ఓ ముసలాయన జగన్నాథం పరాకుని హెచ్చరించాడు హేళనగా. సిగ్గుపడి పోయేడు జగన్నాథం.

తనునించున్న వీధిని గమనించిన తర్వాత తను చేయవలసిన మహత్తరమైన కార్యం గుర్తుకొచ్చింది. ఇప్పటి వరకూ ఆ విషయమై ఆలోచించనందుకు అతను బాధపడ్డాడు. ఇప్పటికైనా గుర్తు కొచ్చినందుకు తననీ, హడలుగొట్టిన కారాయన్నీ హెచ్చరించిన ముసలాయన్నీ అభినందించేడు.

ఆ వీధిలోంచి ఓ మనిషి వొస్తుంటే ఆయన్ను ఆపి అడిగేడు —

'ఇక్కడ రంగారావు గారిల్లెక్కడండీ?'

ఆ మనిషి ఓ తడవ జగన్నాథాన్ని ఎగాదిగా చూచి అడిగేడు :

'ఆయన్తో మీకేం పని బాబూ!'

'ఇది తిక్క ప్రశ్నగా అనిపించినా జవాబు చెప్పక తప్పలేదు.

'ఆయన మా బంధువు.'

'అలాగా. అదిగో ఆ చివరంటూ వున్నదే పెంకుటిల్లు, అదే. నేనిప్పుడు అక్కడ్నుంచే వొస్తున్నాను. రంగారావు యింట్లోనే వున్నాడు.'

ఆ పెంకుటింటికి వెళ్ళేడు జగన్నాథం. ఆ యింటి ప్రహారీగోడ తలుపు ఓరగా తీసివుంది. అక్కడ నిలబడి లోపలకి తొంగిచూశాడు. ఇంట్లో మనుషు లెవ్వరో వున్నట్టే వుంది. నెమ్మదిగా 'రంగారావుగారూ' అని పిలిచేడు.

లోపలనుంచి ఎవరో పలికేరు.

జగన్నాథం ఇంట్లోకి వొచ్చాడు. వచ్చినవెంటనే అతను చూచినదృశ్యం అతన్ని కలవరపెట్టింది. నలుగురు మనుషులు చీట్లాట ఆడుతున్నారు. వాళ్ళముందు డబ్బులగుట్టలున్నాయి. మరోమనిషి చింకిచాపమీద బోర్లా

పడుకున్నాడు. సిగరెట్టు పీకలూ, పెట్టెలూ గదినిండా చిందరవందరగా పడివున్నాయి.

"ఎవరండీ మీరు?" అన్నాడో వ్యక్తి నోటికి గుడ్డ అడ్డుపెట్టుకుని.

తాగడం నేరమన్నది నిజమేగానీ, తాగినతర్వాత తాగలేదని చెప్పుకుందికి తీసుకునే శ్రద్ధమాత్రం సహించడం కష్టం. జగన్నాధానికి అలా అనిపించింది.

జగన్నాధం తనని తను పరిచయం చేసుకున్నాడు. అది విన్న తర్వాత ఓ నలభై ఏళ్ళ నల్లటి వ్యక్తి—

"ఓ, మీరా! రండి. అలా కూర్చోండి" అన్నాడు మరో చింకి చాపని చూపిస్తూ.జగన్నాధం కూర్చోలేదు. మళ్ళా నల్లటివ్యక్తే అన్నాడు—

"నా పేరే రంగారావు."

అతను గళ్ళలుంగీ, చిరిగిన బనీనుతో వున్నాడు. అతని కళ్ళుఎర్రగా వున్నాయి. అతని మొహంనిండా గంట్లు పెట్టినట్టు మచ్చలూను. చూడగానే అనిపిస్తుంది వొట్టి రాక్షసుడని. జగన్నాధం చప్పగా చల్లారిపోయాడు. లోలోపల దేవుడితో నిష్ఠూరాలు పలుక్కున్నాడు.

మళ్ళా రంగారావే చెప్పాడు.

"మూడ్రోజుల క్రితం మీ వూరెళ్ళాను. పిల్లను చూచాను. నాకు నచ్చింది, మరి నేను నచ్చడం నచ్చకపోడం మీరు నిర్ణయించాలిట. నేనే మీ అఫీసుకి వొద్దామనుకుంటున్నాను. మీరే వొచ్చారు."

సుగుణ నచ్చిందని వినడం యిదే ప్రధమం. చాలా ఆనందించతగ్గ విషయమే కానీ రంగారావుకి నచ్చిందని వినగానే వొళ్ళు మండుకొచ్చింది. మూగపిల్లకి రెండో సమ్మంధమంటే గుడ్డికాని మెల్ల అనుకున్నాడేగానీ కేవలం గుడ్డి సంబంధమని యిప్పుడే తెలుసుకున్నాడు. అతనికింకా అక్కడ నించో బుద్ధి కాలేదు. కదలబోయాడు కానీ రంగారావు వొదిలేట్టు కనువించలేదు.

"మంగమ్మా! మా బావగారికి కొంచెం మజ్జిగ పట్రా" అన్నాడు.

ఈ వరసతో మరింత కుళ్ళిపోయాడు జగన్నాధం. మంగమ్మ మజ్జిగ పట్టుకొచ్చింది. తాగ బుద్ధి కాలేదు. కానీ గ్లాసు తీసుకోక తప్పిందికాదు.

"ఇంటిది వున్నప్పుడూ మంగమ్మే పనిమనిషి" అన్నాడు రంగారావు.

మంగమ్మని చూడగానే పనిమనిషని కొత్త వాళ్ళు చెప్పలేరు. కట్టూ బొట్టూ అన్నీ లక్షణంగా, దివ్యంగా వున్నాయి. చీట్లాట రాయళ్ళకి విసుగనిపించింది. మిగిలిన ముగ్గురూ నిట్టూర్చారు. వాళ్ళ అవస్థ గమనించి తొరగా వెళ్ళిపోవాలనే ఉద్దేశంతో మజ్జిగ తాగబోయాడు జగన్నాధం. ఏదో తమాషా వాసన ఆ గ్లాసునుంచి రాగానే కడుపులో దేవినట్టయింది. కళ్ళు మూసుకుని విషం తాగినట్టు

తాగేశాడు. ఆపైన వొస్తానంటూ కదిలాడు.

"మరి మీ నిర్ణయ మేమిటో చెప్పారుగాదు." అన్నాడు రంగారావు.

"నేనీ వూళ్ళోనే వుంటాను. మరోనాడు చెప్తాను." అనేసి గది నుంచి బైటకొచ్చాడు. బైటకొచ్చిం తర్వాత గట్టిగా నిట్టూర్చాడు.

ఇప్పుడతనికి ఏడవాలనిపించింది. సుగుణని చూస్తూ చూస్తూ ఈ నరకంలో తోసేయడం తన కిష్టం లేదు. అమ్మా వాళ్ళు ఎలా యిష్టపడ్డారో మరి. మూగదైతే మాత్రం సుగుణ మన సెంత నవనీతం? తనకి గుర్తు-మనసు బాగుండక భోం చేయకపోతే నోరు తెరుచుకు అడగలేక కళ్ళనీళ్ళు పెట్టుకునేది సుగుణ. ఉదయమే తన కోసం వేన్నీళ్ళూ, కాఫీ వగైరాలూ అన్నీ అమర్చిపెట్టేది. తనెప్పుడైనా సుగుణకోసం యేదైనా పట్టుకొస్తే అమితానందంతో లేడిపిల్లలాగంతులేసేది నోరుంటే?- నోరుంటే చెప్పేది"మా అన్న దేవుడు, మా అన్న దేవుడూ" అని. అలాంటి పిచ్చితల్లికా యింత అన్యాయం చేయడం—వొద్దు.

మరి మూగపిల్లకి మొగుడెలా వొస్తాడోయ్ బడుద్దాయ్ అని ఎవరో ఎందుకు, తన మనసే అడుగుతోంది. జవాబు చెప్పాలి. ఏమని చెప్పాలి? ఏది చెప్పాలి?

"చెల్లీ! నువ్వెందుకు పుట్టావసలు?"

గభగబా మెయిన్‌రోడ్డువెంట నడిచేడు. కృష్ణానదివేపు నడక సాగించేడు. బరాజ్ మధ్యగా వొచ్చి నదివేపు తొంగిచూచేడు. గంభీరంగా వుంది;పరవళ్ళు తొక్కుతోంది. గలగల శబ్దమూ చేస్తోంది. ఉన్నపళంగా యీ నదిలో కళ్ళుమూసుకు దూకేస్తే— దూకొచ్చు. తన కెవరూ లేకపోతే, తను ఎవరికీ కాకుండాపోగల ధైర్యముంటే దూకేయవచ్చు. ఒట్టిది. అప్పుడిహ దూకమన్నా దూకడు. అస లలాంటి కోరికా కలగదు.

వెనక్కి తిరిగాడు. వెళ్ళిపోతూ వెంగగా ఓ తడవ నదివేపు చూచేడు.

"పాపం! నిష్కారణంగా కృష్ణవేణమ్మకి ఆశపెట్టాను. ఏమనుకుంటుందో!" వేదాంతిలా నవ్వేశాడు.

నదికి దూరంగా వొచ్చేసిన తర్వాత అతనికో వెర్రి ఆవేశం కలిగింది. చప్పున రిక్షాని పిలిచేడు.

● డాక్టరు : "మీరేం భయపడద్దు. ఇదివరకు నాకూ ఇలాంటి జబ్బే వచ్చింది."

రోగి : "నిజమే కావచ్చు గానండి, మీరు మంచి డాక్టరు దగ్గిరి కెళ్ళివుంటారు."

ఎస్కిమో హోటల్‌కి తీసుకెళ్ళమని చెప్పాడు. ఆ హోటల్లో తృప్తిగా భోంచేశాడు. బైటకొచ్చి కిళ్ళీ వేసుకున్నాడు. రెండు గోల్డ్‌ఫ్లేకు సిగరెట్టు పెట్టెలు కొనుక్కున్నాడు. మళ్ళా రిక్షా ఎక్కి రూమ్‌కెళ్ళి పోయాడు.

బట్టలు మార్చుకుని నడుం వాల్చే సమయానికి మధ్యాన్నం పన్నెండు గంటలయ్యింది. జీవితంలో తృప్తిని సాధించేద్దామన్న అతని ఊహకి నవ్వొచ్చింది. నవ్వేసుకున్నాడు. రెండు గంటల ప్రాంతాల నిద్రకి కళ్ళు మూతలు పడ్డాయి.

● ● ●

సాయంత్రం నాల్గు గంటలకి మెలుకువ వొచ్చినా కావాలని చెప్పి మరో గంటసేపు పక్కమీద అల్లాగే పడుకున్నాడు. మెయిల్ బెజవాడ ప్లాట్‌ఫారమ్‌ని ఏడున్నర గంటలకి గాని వొదలదు. జగన్నాథం ఎనిమిది గంటలకి స్టేషన్ కెళ్ళాలని నిశ్చయించుకున్నాడు. ఆ వేళకి మేరీ వెళ్ళిపోయి వుంటుంది. రేపో ఉత్తరం రాసి పారేస్తే మరో రెండు మూడు నెలలవరకూ పెళ్ళి ప్రసక్తి రావడానికి వీలుండదు. కనీసం ఆ కొంత కాలమైనా ఏ విధమైన అలజడీ లేకుండా గడిపేయవొచ్చు. ఈలోగా చెల్లెలు పెళ్ళి జరిగిపోతే...

రంగారావు గుర్తు కొచ్చేడు. అతని చిరిగిన బనీను, గళ్ళ లుంగీ, చీట్లాట నేస్తాలూ, మంగమ్మ, అసహ్యమైన యిల్లూ, భయంకరమైన వాతావరణం – అన్నీ ఒక తడవ తన కళ్ళ ముందు తిరిగేయి. జగన్నాథం వొణికిపోయేడు. 'భగవంతుడనే వాడుంటే యీ సంబంధాన్ని తప్పించి మరో యోగ్యమైన సంబంధం చూపించ కూడదూ?'

ఇదే ఆలోచనలతో అతను పక్కమీంచి లేచాడు. స్నానం ముగించాడు. గదికి తాళంవసి పార్కు వేపు నడిచేడు. పార్కులో ఓ మూల పచ్చగడ్డిమీద కూర్చుండి పోయేడు.

ఎనిమిది గంటలగ్గాని అతను అక్కడ్నుంచి లేవలేదు. హోటల్లో భోంచేసిన తర్వాత స్టేషన్ రోడ్డు వేపు మెల్లిగా నడక ప్రారంభించాడు.

జీతం తాలూకు డబ్బులు ఇంకా ఆట్టేరోజు లొచ్చేట్టు లేవు. దానికి తోడు ఉదయం పిచ్చెత్తినట్టు డబ్బులు ఖర్చు పెట్టేశాడు. జాగ్రత్త పడితే ఆ ఖర్చుతో మూడు రోజుల వరకూ గడపవచ్చు.

జగన్నాథం యిలాటి పిచ్చిపనులు చాలా చేస్తాడు. చేసిన పిదప చింతిస్తాడు. ఈ ఆలోచన ముందే వుంటే ఎంత బాగుండి పోను అని దిగులు పడతాడు.

ఈ నెల్లో యింటికి యాభై రూపాయిలు పంపేడు. ఏం సర్దుకుంటారో ఎలా సర్దుకుంటారో. డబ్బుకోసం చాలా యిబ్బంది పడి పోతూన్నారు. ఈ మేరీతో పెళ్ళవుతే రేపొద్దున యీ ఉద్యోగం చేయక్కర్లేదసలు. వాళ్ళకున్న ఆస్తితో నాలుగు తరాల వరకూ జరుపుకోవచ్చు. కానీ, మేరీతో పెళ్ళి యింత త్వరలో అవకాశానికి వీల్లేదు. దురదృష్టవశాత్తూ మేరీ పరాయి మతస్థుల పిల్లైపోయింది! ప్చ్.

జగన్నాధానికి స్వార్థంలేకపోలేదు. కానీ—'నే నింత స్వార్థపరుడినైపోతున్నానేమిటీ' అనిపించిన మరుక్షణంలోనే చప్పున మారిపోతాడు. 'నేను నిస్వార్థుడిని. త్యాగజీవిని. కాదనడానికి ఎన్నిగుండెలుండాలి! నేను చేస్తున్నదంతా త్యాగం కాదూ' అని కోప్పడేస్తాడు.

స్టేషన్ దగ్గరపడుతూండగా అతని గుండె దడ ఎక్కువైంది. పాపం! అమాయకురాలిని మోసం చేశాను. ఏడున్నరకి వెళ్ళిపోయే మెయిల్ నా కోసం ఎనిమిది గంటలవరకూ వుంటుందా? రేపు ఉత్తరం వ్రాయాలి. 'జ్వరంతో పీడింపబడుతూన్న నేను ఎలాగో వీలు చేసుకుని స్టేషన్ కొచ్చేను. కానీ నీ రైలు వెళ్ళిపోయింది.'

ఆపద సమయములందు, అసత్య ప్రయోగం ఏమంత నేరం కాదుట. లేకపోతే మేరీ యెదుట నిలబడి, ఆమె అమాయకమైన కళ్ళల్లోకి చూస్తో తమ పెళ్ళి వాయిదాకి ఏమని కారణం చెప్పేది? చెల్లి పెళ్ళీ, తమ్ముడి చదువూ అయిన తర్వాత నిన్ను చేసుకుంటాను, అలా కాకుండా నిన్ను అర్జంటుగా పెళ్ళాడేస్తే మా అందరిగతీ అధోగతి అవుతుంది మేరీ! అని ఎంత జాలిగా చెప్పినా ఏం బాగుంటుంది? ఏమీ బాగోదు.

మేరీ తనకి కావాలి. ఇది మాత్రం నిజం. మేరీతో కాని పెళ్ళి పెళ్ళికాదు. ఇదీ నిజమే. అయితే యింత గట్టి నిజాన్ని, అభీష్టాన్ని పరిస్థితుల దృష్ట్యా కొన్నాళ్ళపాటు చంపుకోడం త్యాగం కాదూ?

ఈ ఆలోచన రాగానే అతని మనసు తేలిక పడింది. వీధి దీపం వెలుగుల్లో తన నీడ గంభీరంగా నడుస్తున్నట్టు చూచి ముచ్చట పడిపోయేడు. ఓమాటు తన ఉంగరాల జుత్తుని తమాషాగా వొత్తుకున్నాడు.

జగన్నాథం అందగాడని జగన్నాథం అభిప్రాయమే కాదు – మేరీ కూడా వొప్పేసుకుంది. ఇంత అందగాడు నిత్యం వ్యథలమధ్య, నిట్టూర్పుల మధ్య నలిగి పోడం ఆ భగవంతుడికి సరదా కాబోలు!

జగన్నాథం భగవంతుడిని తిట్టడు. కానీ – నిష్ఠూరాలు వేయడం అలవాటై పోయింది.

ప్లాట్‌ఫారమ్ టిక్కెట్టు తీసుకున్నాడు. ప్లాట్‌ఫారమంతా గాలించి తిరిగి వొచ్చేస్తూండగా మెయిల్ వొస్తున్నట్టు మైక్‌లో ఎనౌన్స్ చేయబడింది. ఉలిక్కి పడ్డాడు జగన్నాథం. తన ఖర్మకాలి యీ రోజు మెయిల్ గంట లేటుట. నవ్వుకున్నాడు జాలిగా.

వందల జనంలోనైనా మేరీని గుర్తుపట్టడం అతి తేలిక. మేరీ హంసలా నడుస్తో జగన్నాథం

నుంచున్న చోటికే వొచ్చింది. వచ్చి అన్నది–

'తెలుసు. నువ్వు నా కోసం తప్పని సరిగా వొస్తావని.'

ఇంతగా అభిమానించే మేరీనా మభ్యపరచడం అనుకున్నాడు జగన్నాథం.

'కులాసానా ?' మళ్ళా ఆమే అడిగింది.

అతను తలూపాడు.

'ప్రమోషన్ గట్రా...'

'వూహు... అంతా మామూలే.'

మళ్లా మెయిల్ కదిలేంత వరకూ యిలా కుశల ప్రశ్నలు వేస్తే ఎంత బాగుంటుంది – అనుకున్నాడు.

'పెళ్ళెప్పుడు చేసుకుంటావ్ ?' మేరీ అడిగింది.

ఆమెకళ్ళల్లోకి తిన్నగాచూశాడు. ఆ కళ్ళూ అదే అడుగుతున్నాయి. చూపుమార్చి జేబులో చేయిపెట్టి ప్లాట్‌ఫారమ్ చివర వరకూ చూస్తూ నించున్నాడు. అతని చూపుకి ఓ యువకుడు కనిపించేడు. అతను నవ్వుతూ విసురుగా తమ వేపే వొస్తూన్నాడు. అంతలో అన్నది మేరీ.

'వారే మా శ్రీవారు.'

జగన్నాథం నెత్తిమీద పిడుగు పడినట్లయింది. భయంగా మేరీవేపు చూసేడు.

'ఆయన్తో పిచ్చిగా మాటాడకు. ఒట్టి సెన్సిటివ్! చాలా గుంభనగా వుండు. విచారించకు. నీకూ నాకూ పొత్తుకుదరదు. ఈ జన్మ కింతేనని సరిపెట్టుకో. ఇప్పుడు గొడవమాత్రం చేయకు.'

జగన్నాథం ఏమీ వినిపించుకునే స్థితిలో లేడు. తన క్రింద భూమి రెండు చీలికలై తనని కిందికి లాక్కుపోతున్నట్టుంది.

మేరీ భర్త వొచ్చాడు. తనతో కరచాలనం చేస్తూ ఇంగ్లీషులో అన్నాడు—

'మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషంగా వుంది. మేరీ మీ గురించి చాలా చెప్పింది. మిమ్మల్నిక్కడ చూచి రైలాక్కమునుపే పరుగెత్తుకొచ్చింది.'

జగన్నాథం సభ్యతకోసమైనా నవ్వక తప్పిందికాదు. మేరీభర్త రైలు కదిలేంతవరకు తమ సంసారం గురించే చెప్పాడు. మేరీ ఓ మూలగా స్తంభాన్ని ఆనుకుని జగన్నాథంవంక, ఆమె భర్తవంక శ్రద్ధగా చూస్తో నించుంది.

రైలు కదిలింది. జగన్నాథం చేయూపుతూనే వున్నాడు. మేరీభర్త తలుపుదగ్గర నవ్వుతూ నించూనే వున్నాడు.

రైలు కనుమరుగయ్యింది.

జగన్నాథం అనుకున్నాడు– 'ఆడదాన్ని నమ్మరాదు' అని.

బరువుగా నడచి స్టేషను బైటకొచ్చాడు. తలంతా దిమ్మెక్కాగా వుంది. ఏదో అజ్ఞాతశక్తి తన పీకని నులిమేస్తున్నట్టూ, వొంటిని కోసి నెత్తురు

తాగుతున్నట్టూ వుంది. తూలుతూ నడిచేడు. జేబురుమాల్తో మొహాన్ని కసిగా రుద్దేసుకున్నాడు.

ఉదయం కృష్ణవేణమ్మకి ఆశపెట్టిన సంగతి గుర్తుకొచ్చింది. ఆవేశంతో నదివేపు పరుగెత్తబోయాడు. కానీ కదిలేముందు తన నీడ భయంకరంగా కనిపించడంతో ఉలిక్కిపడి ఆగిపోయాడు. సరిగ్గా ఆ సమయానికి తనముందు ఓ రిక్షా ఆగివుంది. రిక్షాలోని చిధంబరం తనని చూచి పలుకరింపుగా నవ్వేడు.

మరొప్పుడైతే అతనిస్నేహభావానికి ముగ్ధుడై కృతజ్ఞత తెలుపుకునేవాడేను. కానీ యిప్పుడు జగన్నాథానికి మనసు స్వాధీనంలో లేదు. గడిచిపోయిన కథకీ, గడవబోయే జీవితానికీ సరిహద్దయిన 'వంచన' అనే పదాన్ని తర్కిస్తోంది.

'కమాన్ మై డియర్ బాయ్! హేవ్ ఎ లిఫ్ట్' అన్నాడు రిక్షాలోని చిదంబరం.

అన్యమనస్కంగా రిక్షా ఎక్కాడు జగన్నాథం. రిక్షా కదిలింది.

'ఇప్పుడు చెప్పు నీకథ' అడిగడు చిదంబరం.

జగన్నాథం బేలగా అతనివేపు చూసేడు.

'నువ్వు నన్ను క్షమించాలి. ఉదయం పెద్దమనుషుల్తో బిజీగా వున్నాను. పలుకరించి నిన్ను అవమానపరచే దానికంటే చూడకుండా వున్నట్టు నటించడమే మంచిదనుకున్నాను. కాని అనుకున్నంతగా నటించలేకపోయాను. టేకిట్ ఈజీ'. మళ్ళా చిదంబరమే అన్నాడు.

'నిన్నర్థం చేసుకున్నా' జగన్నాథం నోరు తడిచేసుకున్నాడు.

'దెన్ థేంక్స్. ఊఁ... ...ఈ వూళ్ళో వుద్యోగం వెలగబెడుతున్నావన్నమాట.'

తలూపాడు జగన్నాథం.

'పెళ్ళయిందా ?'

'లేదు.'

'ఎవర్నైనా ప్రేమించావా ?'

'నే నెవర్నీ ప్రేమించను.'

నవ్వేశాడు చిదంబరం. తర్వాత అడిగేడు.

'భోంచేశావా ?'

ఏమన్నట్టు చూశాడు జగన్నాథం.

'ఏం లేదు. వాలకం చూస్తుంటే నిరాహారదీక్ష పూనినట్టుంది.'

'మరే. పుట్టెడు దిగుల్తో చచ్చేవాడు అలాగే కనిపిస్తాడు.'

'నిక్షేపంలాటి కుర్రాడివి. నీకు దిగులేమిటోయ్!'

'నన్ను విసిగించకు చిదంబరం.

● వైద్యంలో అమెరికావాళ్ళు చాలా గట్టివాళ్ళు. ఈ మధ్య పెన్సిలిన్‌కి కూడా మందు కనిపెట్టారట.

ఇంత దూరం తీసుకొచ్చావ్. థేంక్స్. ఇంక మా రూమ్‌కి పోతాను. రిక్షా ఆపించు.'

'వీల్లేదు. కలవక కలవక కలిశాం. నువ్విప్పుడే వెళ్ళిపోతానంటే నే నొప్పేది లేదు. నువ్వు మీ రూమ్‌కి ఆహ్వానించక పోయినా—ఈ ఒక్కరాత్రి మా లాడ్జింగ్‌లో గడుపు. మరెన్నాళ్ళకు కలుస్తామో.'

'కాదు. నన్ను పోనివ్వు.'

'ప్లీజ్. నా మాట తీసేయకు. ప్రాణ మిత్రులం గాకపోయినా కలిసి చదువుకున్నాం. ఉదయం నిన్ను నిర్లక్ష్యం చేసినందుకు నే నెంత పశ్చాత్తాప పడుతున్నానో తెలుసా?' అన్నాడు బాధగా చిదంబరం.

వెనక బెంచీలో గోళ్ళు గిల్లుకుంటో కూర్చునే చిదంబరం ఈ నాడింత మాటకారి అయ్యాడని తెలిసిన తర్వాత జగన్నాథం ఆశ్చర్య పోయేడు.

'జవాబు కావాలి జగన్నాథం. నువ్వు నన్ను క్షమించినట్టు భావిస్తే నువ్వీ రాత్రి నాతో గడపాలి. తప్పదు.' అన్నాడు.

జగన్నాథం ఏం మాటాడలేక పోయాడు.

— హొటల్ గదిలో చాలా హాయిగా వుంది. అయినా జగన్నాథం మదిలో కావల్సినంత 'గొడవ' వుంది.

'భోం చేశానన్నావ్. పోనీ యీ యాపిల్సయినా తీసుకో జగన్నాథం.' ప్రాధేయ పడుతూ అడిగేడు చిదంబరం.

'వొద్దు. నా మనసేం బాగో లేదు.'

'అవుతే నా దగ్గరో మందుంది. అది వాడు. వొంటికి మనసుకి మహా మంచిది.'

జగన్నాథం తలెత్తి నిజమా అన్నట్టు చిదంబరం వేపు చూసేడు. చిదంబరం మేధావిలా నవ్వేశాడు. నవ్వు పూర్తయిన తర్వాత సూట్కేసులోంచి ఓ సీసా తీశాడు. దాని ఆకారం చూస్తూనే జగన్నాథం కలవరపాటు చెందేడు.

'భయపడకు తమ్ముడూ! రుచి చూడు' తలుపుదగ్గరగా వేసి వొచ్చి కూర్చున్నాడు చిదంబరం.

జగన్నాథం తాగడం ప్రారంభించేడు. చిదంబరం తాగుతూ మాటాడుతున్నాడు. తనెలా పెద్దవాడైందీ ఎన్ని తమాషాలు చేసి యింతప్రయోజకుడైందీ చెప్పేడు. మాయ చేసి బ్రతకడం తెలుస్తే లోకం సలామ్ చేస్తుందిట!

అలా అని చెప్పి నవ్వేడు. ఆ గ్లాసులో మరో తడవ మందు పోశాడు.—

'నాలుగేళ్ళ క్రితం ఓ దిక్కుమాలిన థియేటర్ తాలూకు గేట్‌మాన్ కొడుకుని. ఇప్పుడు గ్రేట్‌మాన్‌ని. ది గ్రేట్. నాలుగేళ్ళలో నువ్వు పొడిచిందేమీ లేదు. కారణం నీకు మాయచేయడం తెలీదు. చాతకాదు. తెలుగు సినిమారంగంలో నా పేరు వెలిగి పోతోంది. ప్రొడ్యూసర్ దగ్గర్నుంచీ ఎక్‌స్ట్రా వరకూ నా సలహాలు అడుగుతారు. పూర్ ఫెలోస్, వాళ్ళకి తెలీదు మానాన్న వట్టి గేట్‌మాన్ అని' అని నవ్వబోయి ఆగిపోయేడు.

చిదంబరం మాటలు జగన్నాథం వినిపించుకోడంలేదు. తను ఎక్కడికో తేలిపోతున్నట్టుంది. నరాలన్నీ జివ్వున లాగుతున్నట్టుంది. గుండెల్లో ఓ మూల ఆకాశమంత ఖాళీ ఏర్పడినట్టుంది. శరీరం యావత్తూ స్వాధీనం తప్పుతున్నట్టుంది.

సరిగ్గా ఆ వేళకి తలుపు శబ్దమైంది. చిదంబరం తలుపు తెరిచాడు. తెరిచిన వెంటనే—

'ఓ నువ్వా! ఎవరో అనుకుని మావాడు అదిరిపోయాడు. రా... లోపలికి.'

చిదంబరం వెంట ఓ యువతిలోపలికొచ్చింది. జగన్నాథాన్ని చూచి ఎవరన్నట్టు కళ్ళతో అడిగింది.

'ఈవిడ మిస్ కుసుమ. చక్కగా పాడుతుంది. ఇతను జగన్నాథమని మా క్లాసుమేట్. గొప్ప యాక్టర్.'

ఇద్దరికీ పరిచయం చేశాడు చిదంబరం.

కుసుమకి అమందుతో బాగా పరిచయమున్నట్టు—తనే స్వయంగా గ్లాసులో వొంచుకుని గుటగుటా తాగింది. తర్వాత గ్లాసులో మరి కొంచెం పోసుకుని అరగా అరగా తాగడం మొదలెట్టింది. జగన్నాథం ఆమెను అనుసరించేడు.

ముగ్గురూ చాలాసేపు చాలా విషయాలు మాటాడుకున్నారు. జగన్నాధానికి ఎలుగెత్తి ఎవర్నో పిలవా

లన్నంత వుత్సాహం వొచ్చిందిగానీ చిదంబరం వారించడంతో ఆగిపోయాడు.

● ● ●

ఉదయం నాలుగ్గంటలప్రాంతాల్లో జగన్నాధానికి మెలుకువ వొచ్చింది. తన పక్కనే అర్ధ నగ్నంగా పడుకున్న కుసుమని చూచి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అప్పు డతనికి లీలగా, గడిచిన రాత్రి తన అనుభవం గుర్తు కొచ్చింది. గుర్తుకొచ్చిన కాసేపటికి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అక్కడే వున్న కుర్చీలో కూలబడిపోయి మొహాన్ని చేతుల్లో దాచుకుని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడు. ఎక్కడినించి వొచ్చాడో సుడిగాలిలా వొచ్చేడు చిదంబరం. వొచ్చి లైట్ వేసి అన్నాడు—

"గుడ్ మార్నింగ్ బ్రదర్ !"

"... ... ..."

"ఛ. ఏడుస్తున్నా వెందుకోయ్?" దగ్గరిగా వొచ్చి జగన్నాథం భుజం కుదుపుతో అడిగేడు.

అతను మరింతగా కుదించుకుపోయాడు. చిదంబరం మెల్లిగా నవ్వి జోలపాట పాడేడు—

'ఏడవకు ఏడవకు వెర్రినా తండ్రీ!
ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారు,
నీలాలు కారితే నే చూడలేనూ...
జో... జో.'

జగన్నాథం చివాలున లేచి నిలబడ్డాడు. గట్టిగా అరిచేడు.


"నామీద నీ కెందుకింత కసి? బాధల్లో ఛస్తున్నా నీతిగా బ్రతుకుతున్నాను. రాత్రి ఆ నీతికి స్వస్తి చెప్పించావ్. ఇది నీవల్ల జరిగింది. నువ్వే దీనిక్కారణం. నువ్వే చిదంబరం. నువ్వే."

ఈ అలజడికి కుసుమ కళ్ళు విప్పింది. భయంతో లేచి నిలబడింది. కుసుమని ఓదార్చాలనే ఉద్దేశంతో చిదంబరం అన్నాడు—

"దేరీజ్ నథింగ్ టు ఫియర్ మిస్ కుసుమా! జస్ట్ మిసండర్ స్టాండింగ్. ఇలాంటి మనిషిని బాగు చేయడం నావల్లకాదు. నిన్న ఉదయం ఈ మంచివాడ్ని అవమానించాననే బాధ కొద్దీ చేరదీసి చక్కటి ఆతిథ్యమిచ్చి క్షమించమని కోరేను. నోటి కొచ్చినట్టు పేలేస్తూన్నాడు. మై డియర్ జగన్నాథం, గెటవే ఫ్రం హియర్. క్విక్. చాతకాని తనం చావనంత వరకూ నువ్వు బాగుపడవు. వెళ్ళు" అన్నాడు చిదంబరం గుమ్మంవేపు చేయిచూపుతూ.

— ఆ ఉదయం నుంచీ జగన్నాథానికి నీతి నియమాలపట్ల కొత్తరకమైన ఆలోచనలు ప్రారంభమయ్యాయి. అతని ఆలోచనల కుచ్చుల టోపీలో యిదో ముచ్చటైన రంగుటీక.

□□□



అసలైన ఆత్మహత్య

కోఆపరేటివ్ స్టోర్సు సెక్రటరీ పదవినుంచి రంగనాధంగారు విరమణ చేసినట్లు రూఢి అవగానే - మంచివాళ్లు కాకపోయినా, మంచివాళ్ళమీద మంచి అభిప్రాయమున్న మనుషులందరూ హోరని ఏడ్చారు.

"ఒక రకం ప్రజా హృదయానికి ఒకడే నాయకుడు. ఒక యుగంలో ఒక సంఘానికి ఒకడే సంస్కర్త. ఇక ఈ సంఘానికి వైధవ్యం తప్పదు" అనుకుంటున్న ప్రజల మాట విని రంగనాథంగారు చికాకు పడ్డారు.

"ఈ రకం వ్యక్తిపూజ యిప్పుడున్న మహోపద్రవాలలో ముఖ్యమైనది. బానిసతనానికి ప్రథమ చిహ్నం—ఒక్క వ్యక్తి తొలగిపోతే, ఒక్క కెరటం విరిగిపోతే కాల సముద్రం ఆగిపోతుందా? మరొక మహత్తర వ్యక్తి రావచ్చు. ఇంతకు మించి కష్టపడవచ్చు. ముసిలివాణ్ణి. కాళ్ళున్నంత వరకు నడిచి వచ్చాను. కళ్ళున్నంత వరకు లెక్కలుచూశాను.

అశక్తుణ్ణి, నన్ను క్షమించండి. అయినా నేను బతికే ఉన్నాను. బతికి ఉన్నన్నాళ్ళూ మన సొసైటీ మంచి చెడ్డల గురించి నా ప్రాణం కొట్టుకుంటూనే ఉంటుంది. నా సలహా ఏం కావాలన్నా మీరు ఎప్పుడు పడితే అప్పుడు మా యింటికి రావొచ్చు. నా అనుభవం అంతా రంగరించి ఒక్క విషయంలో ప్రజలకు మార్గదర్శకుణ్ణి అయినా అంతకన్న నేను కోరేది ఉండదు. నాకు శ్రమ అని అనుకోవద్దు. పనికన్న నాకు బ్రతుకులేదు!"

రిక్షా ఎక్కి అది కదులుతూండగా వెనక్కి తిరిగి మూడు గదుల పాత పెంకుటిల్లులా ఉన్న స్టోర్సుని చూసి కళ్ళనీళ్ళు తుడుచుకున్నారు రంగనాథంగారు. నెలకి వెయ్యి రూపాయిలు గడిస్తున్న పాతికేళ్ళ కొడుకు కారు కిందపడి చచ్చిపోయినప్పుడు కూడా ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు. పాతిక కాసుల బంగారు నగ, భార్యది దొంగలు దోచుకున్నప్పుడు ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు. వీధిగది కట్టడానికి అడ్డొచ్చిందని తను ఆరేళ్లు ప్రతిరోజూ నీళ్ళుపోసి పెంచిన సువర్ణరేఖ మామిడిచెట్టు కొట్టించినప్పుడు ఆయనకి కళ్ళమ్మట నీళ్ళు రాలేదు.

"ఆయన మనిషా. మరగాని!" అంది రెండోకూతురు.

"అది మనసా, శిలగాని!" అంది భార్య.

"సరిగ్గానే పోల్చుకున్నార్రా!" అని రంగనాథంగారు నవ్వుకున్నారు

ఈ విమర్శలు విని. మూన్నాళ్ళబతుకు నిజంగా మనిషిలా బతికి, విధి నిర్వహణలో సార్థకత సంపాదించాలంటే మనిషి మర కావాలి. మనస్సు శిల కావాలి. తప్పదు అనుకున్నారు.

కాని ఈమరకూడా చెమురుస్తుందనీ, ఈ శిలకూడా ద్రవిస్తుందనీ — మొదటిసారి తెల్సుకుని ఎప్పుడూ లేనంతగా చలించి పోయారాయన.

రెండో కొడుకు అంటాడు.

"అప్పగారూ. పెద్దవారైపోయారు. ఇంకా ఎన్నాళ్ళు యీ యింటినీ యీ ఊరినీ పట్టుకు వేళ్ళాడతారు? ఈ ఊరేదో మంచి దనుకుంటున్నారు. మొన్న మీకు జబ్బుచేసి నెల్లాళ్ళు ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఎంతమంది వచ్చి తొంగి చూశారు? ఏ మంత్రి పంచె గోచీయో ఊడిపోతే అది నేను పెడతానంటే నేను పెడతానని పందేలు వేసుకుని ముందుకొచ్చే మందభాగ్యులు, ఒక్క నిజం చెప్పడానికీ ఒక్క మంచి పని చెయ్యడానికీ వాళ్ళకి టైమేదీ? ఇలాంటి హృదయంలేని లౌక్యం మధ్య రేపొద్దున్న మంచాన పడితే మీ కెలా వెడుతుంది? రెండు తలుపులూ తెరిచి పిలుస్తున్నాను. రెండు చేతులూ జాపి అడుగుతున్నాను. మా యింటికి, నా దగ్గరికి, వచ్చెయ్యండి. మీ అంత మంచివాళ్ళం కాకపోయినా, మీ కొడుకులం, దుర్మార్గులం కాము. నా దగ్గిర విసుగెత్తిపోతే తమ్ముడి దగ్గిరా, వాడి తర్వాత నా దగ్గిరా వుందురుగాని.

మా పెళ్ళాలు మిమ్మల్ని సరిగ్గా చూస్తారో చూడరో అని అనుమానమా? అనుమానం దేనికి? చూడరు. రక్తంలోలేని అభిమానం వాళ్ళు మాత్రం వ్యక్తం చెయ్యగలరా? మహా అయితే చూసినట్టు నటిస్తారు. మాకు బుద్ధుంటే వాళ్ళని నమ్మం. మీ బాధ్యత వాళ్ళమీద వెయ్యం. మేమే వెయ్యికళ్ళతో మిమ్మల్ని చూసుకుంటాం. అప్పగారూ, అప్పగారూ, ఒప్పుకోరా, మాతో వచ్చెయ్యరా?"

"నేన్రానాలేన్రానా... ...నన్ను చంపకురా నానీ... ..."

ఇన్ని మాటలకు ఒక్క జవాబు! అదేనా అదోలా. అవతలివైపు మొహం పెట్టి.

"సరేలెండి. తమ్ముడికి వైరిస్తాను. ఇద్దరం వుద్యోగాలు రిజైన్ చేసి కుటుంబాలతో ఇక్కడికే వచ్చేస్తాం. మీ ఎదురుగుండానే యీ వూళ్ళోనే అడుక్కుతింటాం. అక్కడికిగాని మీకు తృప్తివుండదు!"

"అబ్బబ్బ! నన్ను బాధపెట్టకురా నానీ."

జగన్నాథం అక్కణ్ణించి విసుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"అవును. మిమ్మల్ని బాధపెట్టడానికి మాత్రం యిప్పుడెవరున్నారు అప్పగారూ? అమ్మ అల్పాయుష్మంతురాలు. అల్పాయుష్మంతురాలేం, మీ లాంటి మనిషితో ముప్పైయేళ్ళు కాపురంచేసి బతికిందంటే చాలా గట్టి ప్రాణమే... ..." అనుకున్నాడు.

బరువైన హృదయంతో రిక్షాలో కూలబడ్డ రంగనాథంగారు అనుకున్నారు "వెర్రివాళ్ళు ... ఈ వూరితో నాకు ముడి ఎక్కడో తెలుస్తుంది గనకనా వీళ్ళకి! నాకు మాత్రం యిన్నాళ్ళూ తెలిసివచ్చింది గనకనా! అనుకున్నారు మరోసారి ఆ పాత యింటివైపు చూసి. నిజమే. ఇది ఒకనాటి రెణ్ణాళ్ళ బాంధవ్యమా! మూడు ముళ్ళకన్న మోహనకరమైన ముడి యిది. ఆ ముడి పరస్పరాశ్రయమైనది. స్వార్థంతో కూడుకున్నది. గాలి ఎటువీస్తే అటు కెరటాలు లేచే— నాలుగుగట్లమధ్య కట్టుబడ్డ చెరువులాంటిది. ఇది? వన్ వే ట్రాఫిక్ లాంటిది. చల్లని వెన్నెలలాంటిది. జీవనది లాంటిది. నిర్హేతుకమైన కరుణా, నిస్వార్థమైన సేవా అలాంటివే.

రంగనాథంగారు తన ఏభై అయిదవ ఏట జడ్జీగా రిటైరయారు. తర్వాత ఎన్నోసార్లు ఎంతోమంది ఆయనకి మళ్ళీ ఉద్యోగం చెయ్యమని సలహా లిచ్చారు. అసలు ఆ ఉద్యోగంలోనే యింకా పొడిగిస్తామన్నారు.

అవసరాల రామకృష్ణారావు

'బాబూ, ఉద్యోగంలో చేరడానికే గాని విరమించడానికి వయసు నిబంధన లేదా యేం? ప్రతీదానికీ ఒక వయసంటూ మనవాళ్ళు పెట్టేరు. దాన్ని అలా పాటించడం మనధర్మం. నాలాంటి ముసలివాళ్ళు చచ్చేదాకా ఉద్యోగాలు చేస్తూ కూచుంటే నిరుద్యోగం ఒక భయంకర సమస్యగా మారుతున్న యీ కాలపు కుర్రవాళ్ళ ఆశలు ఏంకావాలి నాయనా!'

'ఉద్యోగం చేస్తున్నంత కాలమూ పదిగంటల ముందూ, అయిదు గంటల తర్వాతా నాప్రాణాలు తీసేసేవారు. ఇప్పుడు ఇరవై నాలుగ్గంటలూ నన్ను కాల్చుకు తింటారు కాబోలు, యింతకన్న యీయనకిఉద్యోగం ఏముంది!' అనేవి సూరమ్మగారు. కాని ఆవిడ పొరపాటు పడింది. మునుపు తొమ్మిదింటికి తయారైతే యిప్పుడు ఆయన ఆరున్నరకే రెడీ అయిపోయేవారు.

సరిగ్గా ఆయింటి గేటు వైపే చూడండి. పొద్దుటిపూట గేటు కిర్రుమందంటే అప్పుడే గడియారం సరిగ్గా ఆరున్నర కొట్టినట్లు గుర్తు. పందలపాక నూలు పంచె, పొడుగు చేతుల కళ్ళీలాల్చీ, పాతబడిపోతున్నా పనిచేస్తున్న గొడుగు, చప్పుడు అయినా చెప్పినట్లు నడిచే చెప్పులు, అన్నట్లు లాల్చీమీద కండువా మడత, నెరిసినా మెరిసే మీసం, ఒడిలినా నవ్వే మొహం, తలబట్ట ఏదీలేని బట్టతల, తిన్నని స్వభావం సూచించే ముక్కు, జోడు కళ్ళమీదా కళ్ళజోడు- ఇన్నీ యింకొన్నీ కలిపిన దానిపేరు రంగనాధంగారు. నడుస్తున్నపుడు అయే ఆ చప్పుడు యిహా సొసైటీ పెంకుటింటి ముందే ఆగడం. దారిలో ఎవరైనా తెలిసిన వాళ్ళు కనపడితే దంతాల సంఖ్య తగ్గుతున్న నోరు మరింత విశాలం కావొచ్చు. నరాలు పైకి తేలుతున్న పదివేళ్లూ ఒకటి కావచ్చు. కాళ్ళు మాత్రం ఆగవు.

'వయస్సు మళ్ళినా యింకా యీ ముసిలాడికి ఎంత కాపీనమో, ఓ రిక్షా అయినా కట్టించుకోడు' అనుకుంటారు బేరం దొరకని రిక్షావాళ్ళు. ఆ మాటలు విన్నా - తనకి కాపీనం లెదని ఏ అణావో బేడో వాళ్ళ చేతిలో పెట్టవలసిన అవసరం ఆయనకేం లేదు. ఆయనకి ఎలాంటి కాపీనమూ లేదనడానికీ ఆధారం లేదుమరి!

'పంక్చు వాలిటీ'లోనూ 'సిన్సియరిటీ'లోనూ 'ఎబిలిటీ'లోనూ బ్రిటిషర్సుని మెప్పించిన దిట్ట అది. రూళ్ళకర్రలాంటి విగ్రహం, జీవితం ఆయనది. ఎవరి దగ్గర నుంచేనా ఉత్తరం వస్తే వెంటనే జవాబు రాసెయ్యడం మరీ విశేషమేం కాదు గాని - ఏ ఉత్తరానికైనా జవాబు ఆయనా, పెళ్ళామూ కలిసి రాయాలి. కార్డుమీదే రాయాలి. అది రూలు. అంతేకాదు. కార్డులో పెద్ద పక్క తనదీ. రెండో పక్క ఆవిడదీ. దానికి తిరుగుండ కూడదు. భార్యంటే అర్ధాంగి అని ఆయన కంటె గ్రహించిన వాళ్ళెవరు!

కో అపరేటివ్ స్టోర్సు దగ్గర ఆగుతారని చెప్పేను కదూ... అంటే అప్పటికి పావు తక్కువ ఏడవుతుంది. అప్పటికి గుమాస్తాలూ నౌకర్లూ అందరూ అక్కడ ఉండాలి. ఎవరైనా ఒకటి రెండు నిమిషా లాలస్యమైతే రంగనాధంగారు మొహం ఎత్తి, కనుగుడ్డెత్తి, రెప్పెత్తి వాడివైపు చూస్తారు. పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాలయినా టీచరువైపు అలా చూసి ఉండదు. ప్రపంచంలో వందమంది మోసగాళ్ళని తప్పించుకోగలం. నిజమైన నిశ్చలమైన నిప్పులాంటి చూపు నిలవొక్కుకోడం మన తరం కాదు. అంతకంటె శిక్షా స్మృతి లేదు.

ఆయన తెప్పించుకునే న్యూస్ పేపరు అక్కడికే వస్తుంది. అది కొంతసేపు చూస్తారు. తరవాత ఎకౌంట్స్ చూస్తారు. రావలసిన స్టాకు వచ్చిందో లేదో, అందులో ఎంత సేల్ అయిందో కనుక్కుంటారు. కస్టమర్స్ కష్టసుఖాలన్నీ దగ్గిరుండి కనుక్కుంటారు. మళ్ళీ తొమ్మిదిన్నరా అయేసరికి ఆ గొడుగు విడుతుంది. ఆ జోడు చప్పుడు వినబడుతుంది. ఇలా ఎన్నాళ్ళు? రోజులలెక్క నేను చెప్పలేను, పదిహేనేళ్ళు — ఒక్కరోజు నాగాలేకుండా జరిగింది. ఇది నిజం, ప్రపంచంలో నిజమన్నది యింకా బతికుందని నమ్మకమున్న వాళ్ళు ఇది నమ్మండి. ఇంతేకాదు, ఇంకా నమ్మలేని సత్యం మరొకటుంది. అది— ఆయన కానీ పుచ్చుకోలేదన్నది! నమ్మలేరా, మీ ఖర్మం. మీ యోగ్యత అంతేనన్నమాట. డబ్బే పుచ్చుకోవాలా ఏమిటి? 'నగదు నానారూపస్వరూపిణి' అంటూరా! ఇంట్లో ఆ పూటకి ఆ వస్తువు లేకపోయినాసరే డబ్బివ్వందే ఆ స్టోర్స్‌లో ఒక్కవస్తువు కొని ఎరగరు. ఇంట్లో ప్రాణంపోతున్నా స్టోర్స్ బంట్రోతును సొంత పనిమీద పంపి ఎరుగరు! ఆయన నిస్వార్ధ సేవకి ఋజువు ఏమిటి అని మీ రడగొచ్చు.... అదృష్టవశాత్తూ ఇక్కడ దాఖలా వుంది! ఈ స్టోర్స్‌కి ఎదురుగుండా మిడిల్ స్కూల్ వుంది చూడండి. అందులో మేష్టర్లు ఎలకలు. ఆ హెడ్మాష్టరు ఒకపందికొక్కు.

● మొదటిసారిగా ఒక పెద్దమనిషి మధువు సేవిస్తున్నాడు. మొదటి గ్లాసుతోనే ఇరవైయేళ్ళ యువకునికుండే ఉత్సాహం వచ్చేసింది. రెండో గ్లాసు పుచ్చుకున్నాడోలేదో మూడేళ్ళ పిల్లవాడిలా కల్ల, గుల్లము అని ముద్దమాటలు ముద్దు ముద్దుగా ప్రారంభించాడు. మూడో గ్లాసు ఖాళీ అయ్యేసరికి ఆరు నెలల పాపాయంత చిన్నవాడైపోయి, ఇంటిదాకా పాకుతూ వెళ్ళిపోయాడు. 'టిప్' దాబాద్!

ఆయన ఆ పదవి అలంకరించేసరికి స్కూలుపేర యాభైవేలు నిలవ వుండేది. ఆయన విరమించేనాటికి కొన్ని వందలు అప్పు మిగిలింది! ఇక పక్కసందులో ధర్మాసుపత్రి వుంది చూడండి. సింహం గుహలోకి వెళ్ళే మృగాల్లా లోపలికి వెళ్ళే రోగుల సంఖ్యే అక్కడ కనబడేది. ఇవతలికి యీ శరీరంతో మాత్రం రారు! కొంచెం అలా వెడితే సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ వుంటుంది... ఇలా మిమ్మల్ని ఆ వూరంతా తిప్పడం నాకు యిష్టం లేదు... ...ఐనా యివన్నీ మీరు ఎరగరా ఏమిటి? ఈ నాయకుల పరిపాలన మీకు వేరే చెప్పాలా? పూర్వం మనుషులు మొదట దొంగతనం చేసి తర్వాత జైలుకు వెళ్ళేవారు, ఇప్పుడు మన నాయకులంతా మొదట జైల్లో వుండి తర్వాత దొంగతనాలు చేస్తున్నారు, అంతే తేడా!

ఒకమాట చెప్పబోయి ఇంకోదాంట్లో పడ్డాను. రంగనాథంగారి నిస్వార్థ సేవకు రుజువు కాదూ మీకు కావలసింది? ఆయన కోపరేటివ్ స్టోర్సు ప్రెసిడెంటుగా ఎన్నికయిన నాడు ఎంతుందో చూడండి. సెక్రటరీగా విరమించిన నాడు ఎంతుందో చూడండి. ఆయన వచ్చిం తర్వాత చూపించిన లాభం ఎంత? డబ్భై అయిదువేలు! కల్మష ప్రధానమైన ఊరినంతా ఒక్క మంచిపనితో పరమ పావనం చేసిన కర్మయోగి ధర్మ సంపాదన! ఒక్కరోజైనా ఒక్క పైసా ఐనా తేడా లేకుండా - పంచేంద్రియాలూ పని చేసేంత వరకూ పాటుబడి, సహకార సంఘం సత్ఫలితం చాటి చెప్పిన సత్యసాధన! ఒకణ్ణి పొగిడితే నాకు ఒళ్ళు తెలీదు. తిట్టినా అంతే. అదికూడా వింటారా? ఆమాటకొస్తే యీ పేరుగల కథ ప్రారంభం ఇక్కడే మరి.

రంగనాథంగారు స్టోర్సు వదిలినా స్టోర్సు మనుషులు ఆయన్ని వదల్లేదు. ముఖ్యంగా పెద్దగుమస్తా గోవిందమూర్తికి ఆయనంటే చెప్పలేనంత గురి. అందుకే ఆయన యిల్లు యితనింటికి దూరమైనా రెండ్రోజుల కోమారు వచ్చి కనపడకుండా ఉండలేడు. కొడుకుల్లాగే యితనూ ఆయన్ని "అప్పగారూ" అని పిలుస్తాడు.

"రేపు డైరెక్టర్సు మీటింగులో కొత్త సెక్రటరీని ఎవర్నో ఒకర్ని ఎంచుకోవాలనుకుంటున్నారు అప్పగారూ! ఇన్నాళ్ళూ ట్రై చేశారు. ఆనరరీ చెయ్యడానికి ఎవరైనా వస్తారేమోనని ... నా బొందో అని ప్రైవేటు సంస్థలకి వ్యక్తిగతాన్ని మించి మీలా ఎవరు చీమూ రక్తమూ ధారపోస్తారు? నెలజీతం అని నిర్ణయించి ఎవర్నో ఒకర్ని వేసుకుంటారట... ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యడానికి ఏ ప్రబుద్ధుడు ముందుకొస్తాడు..."

"అలా అనుకోవద్దనే చెప్పేను గోవిందమూర్తీ! ఒకరి కోసం కాలచక్రం ఎప్పుడూ ఆగిపోదు. మన స్టోర్సుకి మరింత మంచి రోజులు ముందున్నాయేమో!" అన్నాడు రంగనాథంగారు.

ఆ సంగతి కొద్దిరోజుల్లోనే అందరికీ విస్పష్టమైంది. నెలకి నూర్రూపాయిల ఆనరరీ పే మీద తమ అమూల్యమైన కాలాన్ని ఖర్చు పెట్టడానికి ఒప్పుకున్న యాజులు గారు, వెనక ఓసారి దేశమాత కోసం జైలుకెళ్ళి, ప్రస్తుతం రాజకీయ వీరుడుగా చెలామణీ అయి ప్రభుత్వం యిచ్చిన రెండెకరాల మాగాణీ అనుభవిస్తున్న పుణ్యమూర్తి. ప్లీడరు గుమాస్తాగా అనేక సంవత్సరాలు అనుభవం ఉన్నవారు గనక నదిని పైనుంచి చూసే లోతుపాతులు కనిపెట్టగల దిట్ట.

ఆయన పనిలో చేరగానే మొట్టమొదట సంకల్పించిన మంచిపని రంగనాథంగారి ప్రజాసేవకు గుర్తుగా కోఆపరేటివ్ స్టోర్సులో ఒక కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడం. ఆయనతో చెప్పకుండానే ఈ పని జరిగి ఉండేదిగాని ఆయన రూలు మనిషీ, ఫూల్ ప్రూఫ్ మనిషీ కావడం చేత చెవిని వెయ్యక తప్పిందికాదు. ఆ కబురు వినగానే ఆయన మొహం అతి అసహ్యంగా మారిపోయింది.

"మనిషిని మనిషిగా కాక జీవంలేని రాతి బొమ్మలాగో, లోహ విగ్రహంలాగో చూడ్డం మనవాళ్ళు ఎప్పుడు నేర్చుకున్నారు బాబూ? అసలైన స్మృతి హృదయానికి సంబంధించింది. దానికి బాహ్య రూపం యివ్వగలమా? ఇస్తే దాన్ని అగౌరవపరచకుండా ఉంచే సంస్కారం మనకుందా? అయినా నీ బొమ్మా నా బొమ్మా అక్కడ నిలబెట్టడానికి ఇది మన బాబుగారి సొమ్మా? నా మీద మీ అభిమానానికి కృతజ్ఞుణ్ణి నిజంగా నా దీవనలు మీరు అందుకోవాలంటే కలలోనైనా 'రాజకీయం' ప్రవేశించకుండా కల్మశాంశం జొరబడకుండా ప్రజల కోసమే మీ శేష జీవితం అంకితం చెయ్యండి. మీకు ఏ సలహా కావలసినా నేను యిక్కడే వున్నాను."

యాజులుగారి నుదుట ముడతలు పడ్డాయి. ఆయన మొదటి యత్నమే విఫలమైనందుకు మనసా బాధపడ్డాడు. "ఆహా, లోకం ఇంతే కదా!" అనుకున్నాడు. ఆయన ఈ దేశపు బిడ్డ. ఈ నాయకులు ఆయన గురువులు. వారు చూపుతున్న నడవడి ఆయనకి మంచి వరవడి. వాళ్ళు ఏం చేస్తున్నారు? ఒక మహా నాయకుడు మరణిస్తాడు. మహా నాయకుడు కూడా మనిషే అనీ దేవుడు కాదనీ ఎవరికీ తోచదు. అవసరమూ లేదు. ప్రజల్నందర్నీ చదువుకోని, సదసద్వివేక విహీనులుగా తయారు చేయగలిగినంత కాలం వాళ్ళను కనుగప్పగలిగించడం సులువు. మహనీయుడి పేరు చెప్పుకుని తమ మనుగడలు ధృవపరుచుకోవడం, మహాత్ముణ్ణి చాటువేసుకుని మహా...

ర్యాలు చేస్తున్నట్టు భ్రమింపజేయడం — చెట్టుపేరు చెప్పుకొని కుక్కమూతి పిందెలు జాతి ఫలాలలా చలామణీ కావడం ప్రస్తుతం నాయకులు చేస్తున్న రాజకీయం. ఆ మూసలో తయారైన యాజులు మరొకలా ఎలా చెయ్యగలడు? రంగనాథంగారి నిలువెత్తు విగ్రహం ఒకటి చేయించి నలుగురికీ కనపడేచోట పెట్టిస్తే దాని నీడన తను ఎన్ని చేసినా అడిగేవాడు వుండడు. అన్నవస్త్రాలు లేక ప్రజలు అల్లల్లాడిపోతూంటే వ్యక్తుల పేర్న నాణేలూ, తపాలాబిళ్ళలూ, ఆల్బంలూ, ప్రత్యేక సంచికలూ, నిలువెత్తు విగ్రహాలూ, నెలలతరబడి వెలుగు జ్యోతులూ—ఇవన్నీ అతి భక్తితో ఆచరిస్తున్న అగ్రశ్రేణి నాయకులు అంత అమాయకులా ఏం?

ఏమైతేనేం, ఇది యాజులికి మొదట అపజయం. విగ్రహస్థాపనకే విరాళార్జనకే ఆ ముసలిఘటం ఒప్పుకుందికాదు. పైగా సలహాలుకూడా యిస్తాడట! నిర్జీవమైన బురఖా కావాలిగాని సజీవమైన సలహా ఎవడికి కావాలి!

కో-ఆపరేటివ్ స్టోర్స్‌ని ఎలా వృద్ధి రించడమా అని యాజులు రెండో సారి ఆలోచించాడు. మూడుగదుల పెంకుటిల్లది. బ్యాంకులో బోలెడన్ని ఫండ్సు మూలుగుతున్నాయి. ఆ యిల్లు పడగొట్టించి కొత్తది కట్టించే ప్రతిపాదన యీ సారి మీటింగులో పెట్టి ఆమోదం పొందగలిగితే? యాజులు జాగా అయితే కొనగలి గాడుగాని సరైన యిల్లే కట్టలేక పోయాడు. స్టోర్స్ కొత్త బిల్డింగుతో పాటు తన యిలూ లేపొచ్చు. రామయ్య పెళ్ళితో భీమయ్య ఒడుగు. ఎవరైనా ఏమైనా అనుకుంటారా? ఏడిశారు. ఖాంగ్రెంచి మీద వుమ్మేసినా ఎందరు పెద్దమనుషులు దులుపుకు తిరగటంలేదు గనక! అతను కార్యవాదుల వర్గానికి చెందినవాడు.

కాని అదేం పాపమో ఆ ప్రతిపాదనా నెగ్గలేదు. గోవిందమూర్తి సమయానికి సైంధవుడిలా అడ్డుపడి పోయాడు.

'కార్యాలయాలు కాపురాలుచేసే కాంతామతల్లులుగా ఉండాలని రంగనాథంగారు అనేవారు. ఉన్నవి చాలకపోతే వెనకపెరట్లో రెండు గోడౌన్లు కట్టించుకుందాం. ఉన్న మూడుగదులూ పూర్వకాలపువైనా కట్టుదిట్టంగాయిన ప్పెట్టెల్లా ఉన్నాయి. వాటిని పడగొట్టడం దేనికి? పని జరగడం ముఖ్యంగాని పై మెరుగులెందుకు?'

ఈసారి యాజులు తనకి అవకాశం ఉన్నంతవరకూ రెండోమనిషి ప్రసక్తి లేకుండా కార్యం సాధించడానికి ప్రయత్నించేవాడు. డైరెక్టర్సులో ఒకరిద్దర్ని రెండు మూడు సార్లు దర్శనం చేసుకుని వాళ్ళకి ప్రశంసల పరవశత్వం ప్రసాదించాడు. కో ఆపరేటివ్ యినస్పెక్టరుని ఒక చిన్నవాణ్ణి - అప్పుడే ట్రైనింగై వచ్చినవాణ్ణి - రూల్సు అన్నీ అడిగి తెలుసుకుని తనకి ఒప్పేలా 'ఇంటర్‌ప్రెట్' చెయ్యడం నేర్చుకున్నాడు బాధ్యతల మాటకేంగాని హక్కులన్నీ స్వాధీన పరుచుకున్నాడు. దక్షిణగల తాంబూలం యివ్వడం పుచ్చుకోడం నేర్చుకున్నాడు. 'ఇన్నాళ్ళూ నా ప్లీడరు గుమస్తా బుద్ధి ఏమైపోయిందీ.' అని నొచ్చుకున్నాడు. 'కానియ్య, దేనికైనా కాలం ఖర్మంకలసి రావాలి గదా!' అని సరిపెట్టుకున్నాడు. 'ఏమందుకయినా డోసు క్రమక్రమంగా హెచ్చించాలి. ఇంతగా రోగపూరితమైన సంస్థని ఒక్కమారు బాగు పరచాలంటే నాతరమా?' అని సమాధాన పరచుకున్నాడు. ఆనాటినుంచీ దీక్షగా శ్రమించాడు.

యాజులు చేసిన మొట్టమొదటి పని ఆమూడుగదుల్లో ఒక గదిని తన ఆఫీసురూంగా ప్రత్యేకించి ఉంచేసుకోడం. 'ఎంతెంత పెద్దవాళ్ళైనా యిక్కడికి వస్తారు. నెలనెలా మీటింగులు జరుగుతాయి. ఓ నాలుగు మంచి కుర్చీలయినా లేకపోతేఎలా?' అని రెండొందల ఏభై పెట్టి రోజ్ ఉడ్ ఫర్నిచరు తెప్పించాడు. ఒక సీలింగు ఫేన్ వేయించాడు. టేబిల్ ఫేన్ ఒకటీ. ఖరీదైన కర్టెన్లు తెప్పించాడు. ఒక డజను కప్పులూ, సాసర్లూ, అరడజను లతలుగల గాజు గ్లాసులూ ... ఒక టేమిటీ, ప్రజాధనం సద్వినియోగం చేసేటప్పుడు వెనకా ముందూ దేనికి?

శలవు తీసుకున్న ఆఖరు రోజున తప్ప రంగనాథంగార్ని ఎవరూ రిక్షామీద చూడలేదు. 'అయనయితే పోతులాంటి మనిషి. మనిషికి పోతుతనం దేన్నిబట్టి వస్తుం దనుకున్నారు? డబ్బునిబట్టి - నెలకి ఆరొందలు పింఛనువస్తే నేనూ ఆడుదును యింత కన్న నాటకాలు! నలుగురూ బలపంత పెడితే కాదనలేక ఒప్పుకున్నానుగాని ఇంత పూచీతో కూడిన పని చెయ్యడానికి నాకేం సత్తువ ఉందని! రానూ, పోనూ రిక్షా ఉంటేగాని నా వల్ల ఔనా?' అని యాజులు భూమ్మీద కాలు పెట్టడం మానుకున్నాడు.

'ఏదో పెద్ద పొడిచేశాం అనుకోడం తప్ప - స్టాఫ్ మెంబర్ను కష్టం సుఖం చూసిం దెవరు? వీళ్ళకి ఒకటి యింగ్లీషూ, ఒకటి తెలుగూ, రెండు దిన పత్రికలు ఉండాలి. వార పత్రికలు నాలుగు ఉంటేగాని తీరిక సమయంలో వీళ్ళకేం తోస్తుంది!' అని ఎక్కడలేని పుస్తకాలూ తెప్పించి పడేసేవాడు.

'కో ఆపరేటివ్ సంఘం తరవున ఒక పాల సరఫరా కేంద్రం కూడా పని చేస్తే బాగుంటుంది. ఊళ్ళో పెద్ద మనుషులు ఖర్చు పెట్టినా మంచి పాలు దొరక్క మా బాధ పడిపోతున్నారు. అవుల్ని గేదెల్ని మనం కొని మేపలేంగాని - పాలు దగ్గిరుండి పితికించి మెంబర్స్‌కి మంచి పాలు పంపించవచ్చు. దీనికి ఇద్దరు సర్వెంట్సుని వేసుకోవాలి. ఒక సైకిలు కొనాల. కొన్ని సామాన్లు కావాలి.'

ఈ విషయం జనరల్ బాడీ మీటిం

గులో పెట్టినప్పుడు ఒక్క ఓటు తేడాతో యాజులుగారు గెలిచారు. 'ఈ మాత్రమైనా, యిప్పటికైనా మనుషులు నా మంచి తనాన్ని గుర్తించినందుకు ధన్యవాదాలు. ఇక నా శేషజీవితాన్ని యిలాగే అర్పించడానికి నిశ్చయించాను!' అంటూంటే ఆయన స్వరం గద్గదమైంది. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి.

ఒక దేశంగాని ఒక సంఘంగాని ఎల్లకాలం ఒకలాంటివారి ఏలుబడి కింద వుండదు. మంచీ వాళ్ళూ వుంటారు, చెడ్డవాళ్ళూ వుంటారు. కొందరు ప్రవేశించడం, మరికొందరు విరమించడం చిత్రంగావుండి చరిత్ర సృష్టింపబడుతూ వుంటుంది. అది మీ ముందు కళ్ళకు కట్టేటట్టు వుంచగలిగితే నేను కృతకృత్యుణ్ణే

'నాకు రోజు రోజుకీ అనారోగ్యం ఎక్కువైపోతోంది, ఈ చాకిరీ నా వల్లగాదు!' అనడం మొదలుపెట్టేడు కొన్నాళ్ళకు యాజులు.

'ఎవరూ మాట్లాడరేం, నే నిక్కణ్ణుంచి వైదొలగడమే అందరికీ యిష్టంలా వుంది!' అన్నాడు మళ్ళీ ఆయనే. దానికి ఎవరూ జవాబు చెప్పి వుండకపోదురుగాని—ఆయన అనేకవిధాల 'దుర్వి' అంతవాణ్ణి చేసిన రంగభాష్యం దొంగసాక్ష్యం చెప్పక తప్పలేదు.

'ఏమిటమాట శలవిచ్చారు పంతులుగారూ! మీరు అలా అనొచ్చునా... మానవసేవే మాధవసేవ అని నిరూపించిన నిండు హృదయులు మీరు. ఈ కరువుకాలంలో సరుకులన్నీ సకాలంలో సరైన ధరకు యిప్పించడానికి మీరు పడుతున్నపాట్లు ఎవరికి తెలియవు గనకనా?'

తెలియకేం, ఎవరికి తెలిసినా తెలీకపోయినా హెడ్‌గుమాస్తాకి ఆ పడుతున్న పాట్లు ప్రతిదీ తెలుసు. అమోనియాపిండీ, సూపర్ ఫాస్ఫేట్ రైతులకి ఏ రేటున ఏ తీరున ముట్టుతున్నాయో తెలుసు. ధాన్యం దంపిస్తే వచ్చే చిట్టు, తౌడు యిలాంటివాటికి కూడా ఏ వ్యక్తి ఎవరి సాయంతో కక్కుర్తిపడుతున్నాడో తెలుసు. బేళ్ళకి బేళ్ళు బట్టలు కంట్రోలు రేటుకి ఎంత బాగా అమ్ముడవుతున్నాయో ... కొలతలు చదువుకోని పల్లెటూరివారి ముందు ఎంత శ్రద్ధగా సవరించ బడుతున్నాయో స్పష్టంగా తెలుసు. ఉన్నసరకు లేదని చెప్పి, పంచదారా, గోధుమపిండీ బస్తాలకి బస్తాలు మారురేటున మారు రూటున వులిసి ఉన్నవాళ్ళ దొంగ అటకల మీదికి ఎలా చేరుతున్నదీ తెలుసు. అన్నీ తెలిసిన గోవిందమూర్తి ఎందుకు పైవాళ్ళకు రిపోర్టు చెయ్యడూ అంటే దానికి నాకుతెలిసినంత వరకూ రెండు కారణాలున్నాయి. ఒకటి యాజులుగారు పైకి రుజువుకి దొరికేలా ఏదీ కాగితం మీద కనిపించ నియ్యకుండా జాగర్త పడడమూ, రంగభాష్యం స్వామిభక్తిని రెండవది సరుకులూకరుకులూ సమర్పించి పైఆఫీసర్ల మూతి కట్టెయ్యడంలో యాజులుగారికి ఉన్న అసాధారణమైన నేర్పు. ఈ సంగతులన్నీ రంగనాథంగారికి వివరించి నివారణోపాయం అడుగుదామని గోవిందమూర్తికి అనిపించక పోలేదుగాని డబ్భైఏళ్లు పైబడిన ఆయన మనశ్శాంతిని భంగపరచడం అతనికి యిష్టంలేక పోయింది. వీరివల్లా వారివల్లా స్టోర్సు సంగతులు చెవినిబడి ఆయన విచారించి ఒక్కమాట అనేవారు. 'సంస్కరింప బడవలసింది ప్రభువులు కాదు. ప్రజలు ... భగవంతుడా! నేను అవధ్యుణ్ణి అయిపోయాను. నీ బిడ్డల్ని చెడ్డవాళ్ళను చేసి వినోదించకు. ఇదే నాప్రార్థన'.

అనేక ఆఫీసుల్లో లంచగొండితనం సర్వసాధారణమై పోయింది. ఆ ఉద్యోగస్థుల్లో కొందరు మంచివాళ్ళూ, నిజాయితీ పరులూ ఉండకపోరు. కళ్లముందే జరుగుతున్న 'కరప్షన్'చూసి వాళ్ళ హృదయం కరగకపోదు. కాని వాళ్ళు ఏం చెయ్యగలరు? జీతంతో జీవితం ముడిపడి ఉన్న మధ్యతరగతి మనుషులు వాళ్ళు. మంచి పని చెయ్యాలని కోరిక ఉంది. చెడ్డ జరిగితే భరించలేరు. కాని ఏం లాభం? డబ్బూ లేదు, ధైర్యమూ చాలదు. పాలక వర్గంలోని పాపాలు చూసి మంచికి మంచే జరుగుతుందనే ప్రోత్సాహమూ వారికి లేదు. అలాంటి వాడే గోవిందమూర్తి. సమయంకోసం మాత్రం ఎదురు చూడకపోలేదు, అంతే.

రంగభాష్యం మాటలు విని యాజులు ఎంత మాత్రం ఊరట చెందలేక పోయాడు.

'ఎంత పాటుపడితే ఏముందోయ్ భాష్యం, ఒకరికి ఉపకారం చెయ్యడానికైనా కనీస ఆరోగ్యం ఉండాలా? కనీసపు అవసరాలు తీరాలా? ముష్టి జీతం ఈ వంద రూపాయలతో నేను ఎలా 'గెటాన్' అవనోయ్? వెధవది, ఆ తాలూకా కచేరీలో కూచుని నాలుగు దస్తావేజులు గీకి పెడితే రోజుకి పది రూపాయలు కళ్ళజూడ నటోయ్? ప్రజాసేవ కోసం రక్తమాంసాలు ఖర్చు పెడుతున్న మన మంత్రివర్యులే తమ తమ నెలభత్యం ఎక్కువ చేసుకోవడం తప్పదని అంగీకరించారంటే – ఇక నాలాటి వాడు కనీసం రెండొందలయినా ఉంటే గాని...'

గోవిందమూర్తి పళ్ళు పటపట కొరికాడు. ఆ రాత్రి అతనికి ఏ మాత్రమూ నిద్ర పట్టలేదు. రంగనాథంగారి జోళ్ళ చప్పుడు – అతనికి అత్యంత ఆత్మీయమైన ఆ శబ్దం–అదే పనిగా అతి సమీపంలో ఉన్నట్టు వినిపించ సాగింది. తెలియకుండా అతని కళ్ళమ్మట నీటిధారలు స్రవించాయి. ఒక రోజా రెండ్రోజులూ కాదు. పదిహేను సంవత్సరాలు ఆ ధన్యజీవి ఒక్క దమ్మిడీ ప్రతిఫలం ఎరక్కుండా పని చేశాడు! [illegible] అర్నెల్లు దాటలేదు. [illegible] భాష్యం అందరికీ తెలుసు. ప్రతిఫలం పెంచాలా? [illegible]

మీటింగులో ఏ రంగభాష్యం చేతో యీ ప్రతిపాదన చేయిస్తాడు. మరో అపభ్రంశంగాడు సెకండు చేస్తాడు. ఎలాగా అది నెగ్గి తీరుతుంది. చూస్తూ వూరుకోవలసిందేనా?

"పనితెలిసినవాళ్ళు, నీతిగలవాళ్ళు. వీళ్ళకి వేతనాలు చాలవు" అని ఒకనాటి మీటింగులో రంగనాథంగారు పదిమందిచేతా ఔననిపించి కో-ఆపరేటివ్ స్టోర్స్ స్టాఫ్ అందరి స్కేళ్లూ పెంచడం గోవిందమూర్తి మరచిపోలేదు. "ఆయనకింద పనిచేసి, వీడికింద పనిచెయ్యడంకన్న తలకొట్టుకు చావడం మంచిది. రేపే రాజీనామా యిస్తాను" అనుకుని కొద్దిసేపు మనశ్శాంతి అనుభవించాడు గోవిందమూర్తి. దానితో తాత్కాలికంగా ఏ అరగంటైనా నిద్ర పట్టిందేమో—అంతే మళ్ళీ తెలివివచ్చి అంతటా అశాంతి అలుముకుంది. ఓటమి ఒప్పుకోడానికి అతని మనసు ఎంతమాత్రం అంగీకరించ లేదు. అలా కాదని ఎదుర్కోవడమెలాగో అర్థమూ కాలేదు. పైనుంచి అతన్ని ఓడించుకు రావడం ఎలాగా సాధ్యంకాదు. ఓ సారి కమిటీ మీటింగులో పాపం డైరెక్టర్స్ అందరూ పెద్దమనుషులు. ఎంతో ముఖ్యమైనవాళ్ళ పనులన్నీ పాడుచేసుకుని జనరల్ బాడీ మీటింగుకని ఎంతో దూరంనుంచి వస్తారు. సెకండు క్లాసు రైలు ఫేర్‌కి సరిపడే దారి భత్యం యిప్పించి—ఒక్కొక్క మీటింగుకి ఓ పదిరూపాయిలేనా యివ్వందీ ఏం న్యాయం? పైగా వాళ్ళు వచ్చినప్పుడు అల్పాహారవిందుకుగాను ఓ పాతిక రూపాయిలు ప్రజాధనం వెచ్చించడం బ్రహ్మహత్యా పాతకమా!" అని ప్రతిపాదించి ఔననిపించి ఏనాడో యాజులు పెద్ద బుర్రల అనుగ్రహం సంపాదించి వున్నాడు. ఇక పోతే కిందనుంచే అతన్ని ఎదిరించుకు రావాలి.

నిజానికి యాజులుగారు వచ్చి సెక్రటరీగా చేరిన యీ ఆరు నెలల్లోనూ కో-ఆపరేటివ్ స్టోర్స్‌వర్కర్స్ పొందుతున్న అసంతృప్తి యింతా అంతా కాదు. స్టోర్స్ పనిచేసేకాలం ఆయన మాటి మాటికీ తనకి వీలుగా మారుస్తాడు. స్టోర్స్ బంట్రోతులు ముగ్గురిలోనూ ఒకడు యెప్పుడూ యాజులుగారింటి దగ్గిర వుండవలసిందే. ఆ నిర్భాగ్యుడికి కనీసం రోజుకి పన్నెండు గంటలు పని ఉంటుంది. మిగిలిన యిద్దర్లో ఒకడు ఆయన బజారు పనిమీదగాని, ఆయన వెనకాల తైనాతీగాగాని తిరుగుతూ ఉండాలి. ఇక పాల సరఫరా కేంద్రం పితికించు కొచ్చిన మొదటి రకం చిక్కటి పాలు యాజులుగారు స్వయంగా ముందు రుచి చూస్తారు. దానికని కొన్న సైకిలూ, నియమించిన గొల్లవాళ్ళూ వాళ్ళెలా ఉంటారో ఎవరూ చూసిన పాపాన పోలేదు! వారం రోజులు దాటేకగాని పత్రికలు ఎలా ఉంటాయో యాజులుగారింటినుంచి ఊడిపడవు. పోనీ చేసిన దానికి మెప్పేమయినా ఉందా అంటే ఆయనకి పనికన్న ప్రాపకమూ, శ్రమించడంకన్న ఆశ్రయించడం ఎక్కువ ఇష్టం.

"రంగనాథంగారు మొట్టమొదట సెక్రటరీగా పని చేశారు. తర్వాత ప్రెసిడెంటుగా చేసినా సెక్రటరీ పనంతా ఏళ్ళ తరబడి చూసేవారు. వేరే సెక్రటరీ అవసరమే లేదనిపించేటట్టు చేశారు. ఇప్పుడాయన రిజైన్ చేశాక సెక్రటరీ తప్పలేదు. సెక్రటరీ 'ఆనరరీ పోస్టు'కాక 'పెయిడ్ పోస్టు' అని ఎప్పుడైతే నిర్ణయించబడిందో యాజులుగారి ప్రజాసేవా తత్పరత పొంగిపొర్లింది. తక్కిన రాబళ్ళు అలా ఉండగా నెల నెలా నూరు కరుకులు మింగుతున్నాడు. అదీ చాలలేదా?"

యాజులుగార్ని స్టాఫ్ అంతా మనసా అసహ్యించుకున్నారు. అయితే నేం? ఎలాంటి వాళ్ళకి అలాంటి దన్ను ఉండకపోదు. అందరికీ సరిపడా ఆయనకి రంగ భాష్యం ఉన్నాడు.

"మీరు కాబట్టి రక్తానికి రక్తం ధారపోస్తున్నారు... శ్రమ ఎక్కువా, ప్రతిఫలం తక్కువా అయితే, ఎవరు మాత్రం ఎన్నాళ్ళని చెయ్యగలరు!" అని పురెక్కించాడు. ఆ రోజు మొదలు యాజులు మరీ మారాం చెయ్యడం ప్రారంభించాడు. ప్రతీ రోజూ అదే పాట మొదలెట్టేడు.

"ఈ రేషనింగ్ మొదలెట్టేక నా బాధ్యత మరీ ఎక్కువైపోయింది. ఊరంతా ఈ స్టోర్సు దగ్గిరేఉంటోంది. దగ్గరుండి సరుకు బట్వాడా చేయించే సరికి నా తలప్రాణంతోక్కి వస్తోంది. తగిన పారితోషికమా ఏమైనానా? ఈఅరువు చాకిరీ నావల్ల కాదు... ఈ బండ చాకిరీ నేను చెయ్యలేను బాబూ..."

"ఎందుకూ నాకేం కిట్టుబాటు అవడంలేదు. ఈవారం అయే మీటింగులో ఇదేదో తేల్చేస్తాను" అని ఒకరోజు యాజులుగారు యథాప్రకారంగా గంతులు వేస్తూంటే గోవిందమూర్తి పుసుక్కుననవ్వేశాడు.

"మతీ సుతీ లేకుండా అనవ్వెందుకూ... ఈసారి ఏంజరుగుతుందో చూద్దువుగాని... రాజీనామా పత్రం తయ్యారు చెయ్యవోయ్ రంగభాష్యం".

"పెద్దలు... మీరలా తొందరపడకూడదు... మీరుకూడా లేకపోతే ఈ ప్రజాసంస్థ ఏంగాను?" అన్నాడు గోవిందమూర్తి వెటకారంగా. కాని అందులో వెటకారం ఆ క్షణమందు అహంకారంతో నిండిపోయిన యాజులు కేమీధ్వనించలేదు. పైగా యిన్నాళ్ళకైనా గోవిందమూర్తి తన తరపున ఒక మాటాడ్డం చిత్రమైనా అసత్యమనిపించలేదు. ఈ అవకాశం వదిలిపెట్టకూడదని యాజులు అనుకున్నాడు.

"మీ నోటమ్మట యిన్నాళ్ళకైనా ఆమాత్రం మాటొచ్చినందుకు సంతోషించ వలసిన విషయమే! ఒకర్ని అనుకోడం మాత్రం దేనికిలెండి, నేను మాత్రం మీ మంచి చెడులు ఏం కనుక్కున్నానని! అయిందేదో"

అయింది ... ఇప్పుడు మాత్రం ఏమయింది? మూర్తిగారూ, యివాళ మీరు ఆరుకేజీల పంచదార పట్టి గెళ్ళండి. అన్నట్టు మంచి లాంగ్‌క్లాత్ వచ్చినట్టుంది, ఒకతాను తీసికెళ్లండి పిల్లలికి చొక్కాలికి బాగుంటుంది ... గోవిందమూర్తి ఒక్కక్షణం చిత్రంగా చూశాడు. అంతలో అది పైకి తెలియనీయకుండా అటువైపు తిరిగిపోయాడు. ఈ అవకాశం వదలిపెట్ట కూడదని అతనూ అనుకున్నాడు.

"చిత్తం" అన్నాడు అతని జీవితంలో మొదటిసారిగా. రంగభాష్యానికి యాజులు కనుసంజ్ఞ చేశాడు. అతను అందుకున్నాడు.

"పైకి తేలడుగాని మా గోవిందమూర్తికి మాత్రం మీమీద భక్తిశ్రద్ధలు లేవనుకున్నారా పంతులుగారూ? వయసుకు మించిన చాకిరీ జీతాన్ని మించిన కష్టమూ మీరు చేస్తున్నారని మనవాడు ఎంతగా కుమిలిపోతున్నాడనుకొన్నారు!"

"నిజమేనా, నిజమేనా గోవిందమూర్తీ?" అన్నాడు అక్కడ నలుగురిలోనూ అమాట నిర్ధారణ చేసేద్దామని.

"చిత్తం - కాదుమరీ?" అన్నాడు గోవిందమూర్తి. యాజులికి అరచేతిలో స్వర్గమన్నట్టు అనిపించింది. రంగనాథంగారు హాయిజన్ చేసి వదిలిపెట్టిన ఈ హెడ్‌గుమస్తాగాణ్ణి తనవైపు తిప్పుకుంటే యింక జరగందేముంది?

అంతే. ఆరోజునుంచి గోవింద మూర్తి స్తోమతే మారిపోయింది. ఆయనకి కాస్త తలనొప్పిగా ఉంటే చాలు యాజులుగారే స్వయంగా వచ్చి "గొడ్డులా చాకిరీ చేస్తే శరీరం తట్టుకోవద్దుటోయ్ - రెండ్రోజులు శలవు చీటీ పంపెయ్యి. మరేం కాలచక్రం ఆగిపోదు" అనేవాడు. "మంచి తెల్ల గోధుమలు వచ్చాయి. ఓయిరవై కేజీలు యింట్లో పడెయ్ - మళ్ళీ దొరకవ్" అనేవాడు. గోవిందమూర్తి అతను చెప్పినట్టు తూ. చ. తప్పక చేసేవాడు. "అప్పగారూ నన్ను క్షమించండి. ఈ నాటకం ఇంక ఒక్క వారం రోజులే" అని మనసులో అనుకున్నాడేమో.

ఆవాళ కమిటీ మీటింగు. ఆరోజు మీటింగులో జరిపించవలసిన పథకం అంతా యాజులు గోవిందమూర్తికి పదేపదే బోధపరిచాడు. ముందు యాజులుగారు రాజీనామా సమర్పించడం. గోవిందమూర్తి ఆయన స్టోర్సుకి చేస్తున్న సేవలను కొనియాడుతూ - ఆయన పనిచేసే కాలాన్ని పొడిగించాల్సిన అత్యావశ్యకత నిరూపిస్తూ - ధరలు ఎక్కువైన కారణంవల్ల అతని జీతం కూడా ఎక్కువ చేస్తామని ఆయన్ని బతిమాలుకుని ఆమోదింప చెయ్యడం. అవసరమైతే ఓటింగుకు పెట్టించి నెగ్గించడం. "ముందు నా జీతం ఎక్కువ చేయిస్తే నీ ఉపకారం ఉంచుకుంటానటోయ్ ... పిల్లలుగల వాడివి, నీ జీతం మాత్రం ఏమంత ఎక్కువనీ!"

అని ముసిముసి నవ్వు నవ్వేరు యాజులుగారు.

ఆ సాయంకాలం మీటింగులో అన్ని విషయాలూ అయాక 'ఎజండా'లో ఆఖరు విషయంగా యాజులుగారి సంగతి వేయించారు. అది కూడా యాజులు ఏర్పాటే. ప్రజాహిత సంబంధమైన మీటింగులు కనుక కమిటీ మీటింగులకి రాడానికి 'దొర'లకి అట్టే తీరుబడి ఉండదు. మీటింగు చివరిదాకా ఉండడానికి మరి అవతలి రాచకార్యాలో ... అందుకని 'మీరంతా ఎలాగంటే అలాగే ... మినిట్సు సంతకం పెడితే చాలుగా?' అని వెళ్ళిపోతారు. ఆఖరికి యాజులూ, గోవిందమూర్తీ అతని స్నేహితులు మరో ముగ్గురూ మిగిలారు. రంగభాష్యం కూడా అక్కడ లేకపోలేదు గాని అతను మెంబరు కాదు.

"ఇంక ఆలస్యం ఎందుకు, కోరమ్ ఉంది గదా! తీర్మానం తీసుకొచ్చి ఆమోదింప చేద్దామా?" అన్నాడు యాజులు రహస్యంగా.

"చిత్తం" అన్నాడు గోవిందమూర్తి గుంభనగా. ఒక పొడిదగ్గు దగ్గి యాజులు తను రాసుకొచ్చింది ఇలా చదివాడు :

"సోదర మణులారా! సోదరీ రమణులారా! ఈనాడు అమూల్యమైన ఈ ప్రజాసేవనుండి వైదొలగుతున్నందుకు నాకు చాలా దుర్భరంగా ఉంది. కోఆపరేటివ్ స్టోర్సు సెక్రటరీ పదవినుండి విరమించడానికి నేను నిశ్చయించానని చెప్పడానికి విచారంగా ఉంది. ఏం చెయ్యను? ఏదో యీడ్చుకొచ్చానుగాని రంగనాథంగారి లాంటి సంఘసేవకుల ముందు నేనెంత నా బతుకెంత? నేనా దుర్బలుడను. కాగా నిర్ధనుడను. నన్ను క్షమించి విశ్రాంతి యిప్పించవలసినదిగా కమిటీ వారికి వినయపూర్వకంగా మనవి చేస్తున్నాను" ఆ కాగితంపై సంతకం చేసి గోవిందమూర్తికిచ్చాడు. అనంతరం ఆ కాగితం గోవిందమూర్తి ఫైల్ చేసి, లేచి యిలా అన్నాడు.


"సోదరులారా! నేడు చాలా దుర్దినం. యాజులువంటివారు మన సంఘాన్ని వదిలిపెట్టి వెళ్ళడం ఎంత దురదృష్టకరమో అనుభవజ్ఞులైన మీకు నేను చెప్పనక్కరలేదు. ఐనా వారు వయసుమళ్ళినవారు. పైసామీద మనసు మళ్ళనివారు, కృష్ణా-రామా అంటూ యింట్లో కూర్చోక, వారు శలవిచ్చినట్టు— నానాటికీ జటిలమైపోతున్న యీ నామకః ప్రజాసంస్థలతో వారికేమి పని? సంఘ క్షేమంకన్న ఏవిధంగా చూసినా నాకు వారి క్షేమమే ముఖ్యంగా కనిపిస్తోంది. వారిని యింకా మొహమాటపెట్టి మనం స్వార్థం చూసుకోడం న్యాయంకాదు. అంతరాంతరాలలో [illegible]


వారి వుద్యోగవిరమణ ఆమోదించడమే భావ్యమని భావిస్తున్నాను. విశ్రాంతికాలంలో వారి సంఘసేవకు ప్రతిఫలంగా భగవంతుడు తగిన ఆయురారోగ్యములు ప్రసాదించుగాక!'

ఇక చెప్పేదేముంది, కోరమ్ వుంది గనక 'యాజులుగారి రాజీనామా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడమైనది!' అని టకటకా సంతకాలు జరిగిపోయాయి!

'గడీవేషానికి గెడ్డం మీసం గీయించాడని యీ నాలుగురోజుల భాగ్యానికి ఈ పటాటోపం దేనికో! రిక్షామీదేతప్ప భూమ్మీద అడుగు పెట్టమని పిల్లలు మొరాయిస్తున్నారు! గానుగనూనెగాని వేసుకోడుట మీ అల్లుడు ... ...దినపత్రిక మూసేగాని యింకా రోజంతా ఏమీ తోచదుట మీ కోడలికి. నూతిలో చేదవేయడం మరచిపోయి ఆర్నెలలయింది కాబోలు మీ చెల్లెలికి. ఇక చిక్కని మల్లెపూడలలాంటి పాలతో ఫిల్టర్ డికాక్షన్‌తో కాఫీ తాగుతేగాని తల ఎగిరిపోతోంది నాకూ! మాటాడకుండా ముంగిలా జారుకుంటారేం, చేతగాని పరుగులు ఎవరు పెట్టమన్నారంట!' అని ఆ పదోనాడు కాబోలు నిలదీసింది యాజులుగార్ని కట్టుకున్న కాంతారత్నం.

□□□





ఏది స్వర్గం

జీవితమంతా తీరని కోరికలతో బాధపడి బాధపడి ఒక నిరుపేదవాడు భూలోకంలో కన్నుమూసి పరలోకంలో ఒక విశాల సుందర మందిరంలోని హంస తూలికా తల్పంమీద కన్ను తెరిచాడు. దగ్గర్లో నిలబడిన సేవకుడిని పిలిచి 'ఆకలిగా వుం' దన్నాడు. 'ఏం తెమ్మంటా'రని సేవకు డడిగాడు.

భూలోకంలో తను తినాలనుకున్నవి, తినలేక పోయినవి రకరకాల పదార్థాలు కోరుకున్నాడు. సేవకుడు క్షణంలో అన్నీ తెచ్చి అమర్చాడు. పేదవాడు వాటిని క్షణంలో సగంలో తినేసి తుష్టిగా త్రేన్చాడు. ఆ తరవాత హాయిగా పడుకుని నిద్రపోయాడు. మళ్ళీ ఆకలేసింది. సేవకుడు తెచ్చిన షడ్రసోపేత భోజనం మళ్ళీ ఆరగించాడు. హాయిగా మళ్ళీ తెల్లారేదాకా నిద్రపోయాడు. భూలోకంలో ఎంత కష్టపడి పనిచేసినా కడుపునిండా తిండి యెరగని పేదవాడికి ఈ జీవితం చాలా బావుందనిపించింది. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒక రోజున వాడికి అస్తమానం తినడం, పడుకోడం, వొళ్ళు విరుచుకుని ఆవులించి మళ్ళీ తినడం, పడుకోడం విసుగనిపించింది. సేవకుణ్ణి పిలిచి 'విసుగ్గా వుందిగాని, ఏదన్నా పని చెప్పు. నేను కూడా చేస్తాను.' అన్నాడు.

సేవకుడు 'ఇక్కడ చెయ్యడానికి పనేమీ వుండదండి' అన్నాడు.

'ఏడిసినట్టుంది; ఇలా ఎంత కాలమని?' అని మానవుడు కోపంగా ప్రశ్నించాడు.

'కొన్ని యుగాలు గడవాలి.'

'ఓహో హె! బాగానే వుందే వ్యవహారం? ఇంతకంటే నరకమే బావుం దేట్టుంది! అక్కడికే పోతాను.' అన్నాడు మానవుడు.

'ఇప్పుడు తమ రున్నది అక్కడే' అని సమాధాన మిచ్చాడు సేవకుడు.

సెక్రటరి



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

అతని గదిలో సెట్టి హోల్డాల్ సర్ది రెడీగా వుంది.

'సాయంత్రం వూరు వెడుతున్నారు' అని చెప్పాడు నాయర్.

'నయం. ఈ ఒక్క రోజు ఆలస్యమైతే—' అనుకుంది.

ఇలా ఈ యింట్లో యీ మంచం మీద పడుకుంటే తృప్తిగా హాయిగా వుంది. అర్ధరాత్రి కొత్తచోట తప్పిపోయి భయంతో తిరిగి తిరిగి అలిసిపోయిన పసిపిల్లలకి హఠాత్తుగా తనవాళ్ళు దొరికి తన యింట్లో వుంటే ఎంత సంతోషం అన్పిస్తుందో అంత నిశ్చింతగా వుంది.

వరసగా కొన్ని రాత్రులు కంటిమీద కునుకు అనేది ఎరుగని జయంతికి కాస్త నిశ్చింత అన్పించగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

చాలాసేపయింతర్వాత వున్నట్టుండి మెలకువ రావటంతో కళ్ళు తెరిచింది. గదిలో లైటు వేసివుంది. శేఖరం కిటికీదగ్గర నిలబడి ఒక చెయ్యి కిటికీ రెక్కమీద వేసి బైటికి చూస్తున్నాడు. అతన్ని అలా చూస్తూంటే చాలాసేపటినుంచి అలా నిలబడి వున్నట్టు అన్పిస్తోంది. ఎంతసేపు నిద్రపోయిందో తెలియదు. తెలిసిందల్లా ఒకటే. మండు టెండలో నడుస్తూ దాహంతో నాలుక పిడచకట్టుకుపోతున్న మనిషికి చల్లటినీళ్ళు దొరికినట్టు—కొన్నిరోజులనుంచి వూహాలో అతన్ని వూహించి వూహించి అలిసిపోయిన కళ్ళకి అతనలా సజీవంగా నిలబడివుండటం హాయిగా ప్రాణం పోస్తున్నట్టుగా వుంది.

జయంతి మంచంమీద లేచి కూర్చుంది. శేఖరం వెనక్కి తిరిగి చూశాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. కాలం నిల్చిపోయింది క్షణాలు దొర్లిపోయినా యిద్దర్లో ఎవరికీ చూపులు విడదీసుకునేధ్యాసే లేదు.

చూస్తుండగానే జయంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక్కసారి అతని దగ్గిరికి పరుగెత్తి మెడచుట్టూ చేతులు

ఏది స్వర్గం

జీవితమంతా తీరని కోరికలతో బాధపడి బాధపడి ఒక నిరుపేదవాడు భూలోకంలో కన్నుమూసి పరలోకంలో ఒక విశాల సుందర మందిరంలోని హంస తూలికా తల్పంమీద కన్ను తెరిచాడు. దగ్గర్లో నిలబడిన సేవకుడిని పిలిచి "ఆకలిగా వుం" దన్నాడు. "ఏం తెమ్మంటా"రని సేవకు డడిగాడు.

భూ లోకంలో తను తినాలనుకున్నవి, తినలేక పోయినవి రకరకాల పదార్థాలు కోరుకున్నాడు. సేవకుడు క్షణంలో అన్నీ తెచ్చి అమర్చాడు. పేదవాడు వాటిని క్షణంలో సగంలో తినేసి తుష్టిగా త్రేన్చాడు. ఆ తరవాత హాయిగా పడుకుని నిద్రపోయాడు. మళ్ళీ ఆక లేసింది. సేవకుడు తెచ్చిన షడ్రసోపేత భోజనం మళ్ళీ అరగించాడు. హాయిగా మళ్ళీ తెల్లారేదాకా నిద్రపోయాడు. భూలోకంలో ఎంత కష్టపడి పనిచేసినా కడుపునిండా తిండి యెరగని పేదవాడికి ఈ జీవితం చాలా బావుందనిపించింది. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒక రోజున వాడికి అస్తమానం తినడం, పడుకోడం, వొళ్ళు విరుచుకుని ఆవులించి మళ్ళీ తినడం, పడుకోడం విసుగనిపించింది. సేవకుణ్ణి పిలిచి "విసుగ్గా వుందిగాని, ఏదన్నా పని చెప్పు. నేను కూడా చేస్తాను." అన్నాడు.

సేవకుడు 'ఇక్కడ చెయ్యడానికి పనేమీ వుండదండి' అన్నాడు.

"ఏడిసినట్టుంది; ఇలా ఎంత కాలమని?" అని మానవుడు కోపంగా ప్రశ్నించాడు.

"కొన్ని యుగాలు గడవాలి."

"ఓహో హో! బాగానే వుందే వ్యవహారం? ఇంతకంటే నరకమే బావుండేట్టుంది! అక్కడికే పోతాను." అన్నాడు మానవుడు.

'ఇప్పుడు తమరున్నది అక్కడే' అని సమాధాన మిచ్చాడు సేవకుడు.

సెక్రటరీ



యద్దనపూడి సులోచనారాణి

(గతసంచిక తరువాయి)

అతని గదిలో శెట్టి హోల్డాల్ సర్ది రెడీగా వుంది.

"సాయంత్రం వూరు వెడ్తున్నారు" అని చెప్పాడు నాయర్.

"నయం. ఈ ఒక్క రోజు ఆలస్యమైతే—" అనుకుంది.

ఇలా ఈ ఇంట్లో యీ మంచం మీద పడుకుంటే తృప్తిగా హాయిగా వుంది. అర్ధరాత్రి కొత్తచోటు తప్పిపోయి భయంతో తిరిగి తిరిగి అలిసిపోయిన పసిపిల్లలకి హఠాత్తుగా తనవాళ్ళు దొరికి తన యింట్లో వుంటే ఎంత సంతోషం అన్పిస్తుందో అంత నిశ్చింతగా వుంది.

వరసగా కొన్ని రాత్రులు కంటి మీద కునుకు అనేది ఎరుగని జయంతికి కాస్త నిశ్చింత అన్పించగానే నిద్ర ముంచుకొచ్చేసింది.

చాలా సేపయింతర్వాత వున్నట్టుండి మెలకువ రావటంతో కళ్ళు తెరిచింది. గదిలో లైటు వేసివుంది. శేఖరం కిటికీదగ్గర నిలబడి ఒక చెయ్యి కిటికీ రెక్కమీద వేసి బైటకి చూస్తున్నాడు. అతన్ని అలా చూస్తూంటే చాలా సేపటినుంచి అలా నిలబడి వున్నట్టు అన్పిస్తోంది. ఎంతసేపు నిద్రపోయిందో తెలియదు. తెలిసిందల్లా ఒకటే. మండు టెండలో నడుస్తూ దాహంతో నాలుక పిడచకట్టుకుపోతున్న మనిషికి చల్లటినీళ్ళు దొరికినట్టు—కొన్నిరోజులనుంచి వూహాలో అతన్ని వూహించి వూహించి అలిసిపోయిన కళ్ళకి అతనలా సజీవంగా నిలబడివుండటం హాయిగా ప్రాణం పోస్తున్నట్టుగా వుంది.

జయంతి మంచంమీద లేచి కూర్చుంది. శేఖరం వెనక్కి తిరిగి చూశాడు. ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. కాలం నిల్చిపోయింది క్షణాలు దొర్లిపోయినా యిద్దర్లో ఎవరికీ చూపులు విడదీసుకునేధ్యాసే లేదు.

చూస్తుండగానే జయంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక్కసారి అతని దగ్గిరకి పరుగెత్తి మెదమ్మట్లో చేతులు

పెనవేసి "నేను వచ్చేశాను. వచ్చేశాను" అని చెప్పాలనిపించింది. తన తృప్తి, హాయి, మనశ్శాంతి ఎవరి దగ్గర వున్నాయో ఇప్పుడు స్పష్టంగా తెలిసింది.

"ఎప్పుడొచ్చావు జయంతీ!" కిటికీ దగ్గరనుంచి కదిలి గదిలోకివస్తూ అడిగాడు. అతని కంఠం ఎంత మామూలుగావుంది. తనిలా అనుకోకుండా కన్పిస్తే అతని కేమీ అన్పించడంలేదూ! సంతోషంతో తన గుండెలు పొంగుతున్నట్టు అతనికి పొంగటం లేదు. ఎంతో మామూలుగా "యెప్పుడొచ్చావు జయంతీ!" అని అడుగుతున్నాడు!

"పోన్లే మంచిపని చేశావు. నేనిలా వెళ్ళిపోయేముందు మళ్ళీ నిన్ను ఓసారి కళ్ళారా చూడగలిగాను." టేబిల్ దగ్గరకెళ్ళి కాగితాలు సర్దుతూ అన్నాడు.

"అంటే?—" అర్థం కానట్టు అడిగింది.

"ఉత్తరంలో వ్రాశానుగా! యేం? పూర్తిగా చదవ లేదా?—"

"ఉత్తరమా? యేం వుత్తరం?—"

శేఖరం చివ్వున వెనక్కు తిరిగి చూశాడు. "నా వుత్తరం చూడకపోతే నువ్విప్పుడు యిక్కడెందుకున్నట్టు?—"

జయంతి కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగింది. అతను మాట్లాడే ధోరణీ, ఆ కళ్ళలో అభావం జయంతి మనసులో కలిగిన సంతోషాన్ని ఆవిరిలా మాయం చేశాయి.

"నిజంగా నాకు తెలియదు. నిన్న అంతా విజయలక్ష్మికి చెప్పేశాను. నేను చేసిందంతా తప్పే— నాదిపొరపాటే—"

"ఇప్పుడవన్నీ నేను అడగలేదు. నువ్వు మాట్లాడద్దు—" మళ్ళీ వెనక్కి తిరిగి పుస్తకాలు సర్దుతూ అన్నాడు. అతని కంఠం ఆజ్ఞాపించి నట్టుంది.

"మీరడక్కపోయినా చెప్పాల్సిన బాధ్యత నాకుంది. ఆ రోజసలు మీరు నన్ను చూసికూడా చూడనట్టు వెళ్ళిపోకపోతే—"

"అంత క్రితం నన్ను చూడగానే నువ్వెందుకు పారిపోయావు?—"

"అంటే?— అంటే ఆరోజు మీరు నన్ను చూశారన్నమాట—"

"చూడలేదు. ప్రసాద్ చేతుల్లో నువ్వు మూర్ఛపోయిం తర్వాత వూహించాను. అంత భయపడాల్సిన అవసరం యేమొచ్చింది? నువ్వంత బెదిరి పారిపోవాల్సినంత భయంకరమైన పని నేనేం చేశాను!—"

"ఓ! మీరు నన్నేం చెప్పనివ్వరు కదూ!—" మంచందిగినిలబడుతూ అంది.

"చెప్పాల్సిన అవసరం నీకులేదు."

"అంతకంటె వినాల్సిన అవసరం నాకేం లేదంటే సరిపోతుందిగా!—"

శేఖరం మళ్ళీ వెనక్కు తిరిగి చూశాడు. అతని కళ్ళలో బాధ, కోపం అన్నీ కన్పిస్తున్నాయి. వెంటనే

కుర్చీలో కూలబడుతూ "వద్దు జయంతీ! వద్దు ఎంతో ప్రయత్నం మీద ఒంట్లోవున్న శక్తిఅంతా కూడదీసుకుని యిప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. వెళ్ళిపోయేముందు కూడుకుంటున్న నా మనశ్శాంతిని మళ్ళీ ముక్కలుచెయ్యకు. నాకిక ఓపికలేదు. భరించే శక్తి లేదు. నాకు

"సెక్రటరీ" సీరియల్ - జరిగిన కథ

అనగనగా ఒక జయంతి. ఆమెకొక బామ్మ. జయంతికి వనితా విహార్లో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. కాని అక్కడి సభ్యురాంద్ర ప్రవర్తన గిట్టక రాజీనామా యిస్తుంది. ఆమెకు రాజశేఖరం అనే ధనిక యువకుడు తన వద్ద ఉద్యోగమిస్తాడు. అతడు అవివాహితుడు, మంచివాడు. అతని వద్ద ఉద్యోగం మొదటు బాగానే వుంటుందిగాని, కొన్ని విచిత్రసంఘటనలుజరిగి ఆమె అతన్ని ఏవగించుకొనడం ప్రారంభిస్తుంది. రాజీనామా ఇస్తుందిగాని ఆనాడే ఆమెకు పెద్దజబ్బుచేస్తుంది. ఆ జబ్బులో రాజశేఖరమే జయంతిని, ఆమె బామ్మను తన ఇంటికి తీసుకువెళ్ళి ఆదరిస్తాడు. జబ్బు తగ్గాక అతని ఇంటినుంచి వెళ్ళిపోవాలనుకుంటుంది. ఇంతలో ఆమె బామ్మ హఠాత్తుగా గుండెజబ్బు వచ్చి చనిపోతుంది. ఇక చేసేదిలేక ఆమె రాజశేఖరం ఇంట్లోనే వుండిపోతుంది.

కాని ఎన్నాళ్ళని అతని దగ్గర వుంటుంది. లోకు లేమనుకుంటూరు. ఏమైనా, ఆమానసిక సంఘర్షణభరించలేక అతనినుంచి దూరంగా పోవాలనుకుంది. ఆమెను తీసుకుపోవడానికి ప్రకాశం అనే పరిచితుడొకడు తటస్థపడ్డాడు.

అతనితో కలిసి ఆమె బెంగుళూరు వెడుతుంది. అతనికి హఠాత్తుగా కలరా సోకి చనిపోతాడు. ఆమెను ప్రసాద్ అనే డాక్టరు ఆదుకుంటాడు. అతడు జయంతి నిస్సహాయతకు జాలిపడి మద్రాసులో వున్న తన అక్కగారింటికి ఆమెను పంపించి వేస్తాడు. ఆమె అక్కడ తాత్కాలికంగా స్థిరపడుతుంది.

ప్రసాద్ ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. కాని, ఆమె, శేఖరం పరస్పరం ప్రేమించుకున్నారన్న సంగతి తెలిసి ప్రసాద్ అక్కగారు ఆమెను శేఖరం దగ్గిరికి పంపించేస్తుంది. జయంతి వెళ్ళేసరికి శేఖరం యింట్లో లేడు.

చేతకాదు—' అన్నాడు.

జయంతి దగరగా వచ్చింది. అతను వినసీ వినకపోనీ! తను చెప్పి తీరాలి. చేసిన పొరపాటు తెలుసుకుని పశ్చాత్తాప్పడుతున్నట్టు తెలియజేయాలి.

'నా యీ ఒక్కమాట వినండి. ప్రకాశంతో నేను వెళ్ళినమాట నిజమే! కాని నాకూ అతనికి—'

'నాకంతా తెలుసు. నువ్వేం చెప్పనవసరం లేదు. ప్రసాద్ అంతా చెప్పాడు. మొదలిది చెప్పు. నువ్విలా రావడం ప్రసాద్‌కి తెలుసా? చెప్పి వచ్చావా?—'

'ప్రసాద్ కెందుకు చెప్పాలి—'

'ఎందుకి చెప్పాలి! నాలుగైదు రోజుల్లో కాబోయే భర్తకి ఎందుకు చప్పాలా! ఇలాగే నువ్వు. జీవితం అంతా సమస్యల మయం చేసుకుంటావు జయంతీ! నీ కేది చెప్పక పోయినా యిది ఒక్కటి మాత్రం గట్టిగా చెప్తున్నా! ప్రసాద్ యోగ్యుడు. అతను భర్తగా లభించడం ఓ విధంగా నీ అదృష్టం. నీ చిన్నతనపు చేష్టలతో అతన్ని బాధపెట్టడం, రెచ్చగొట్టడం మంచిది కాదు. మగవాడి మనసు నువ్వెప్పటికి అర్థం చేసుకుంటావో తెలియదు.'

'దయవుంచి మీరు చెప్పబోయే దేమిటో కాస్త సూటిగా చెప్తారా!'

'నీ కాబోయే భర్త మనసు నొప్పించకు—'

'అతను నాకు భర్త కావటం లేదు. అది మొదట మీరు గ్రహిస్తారా?—'

'అంటే—'

'నా కతన్ని చేసుకోవటం ఇష్టం లేదు—'

'నీ వుద్దేశం నా కర్థమైంది. నీ కిష్టం కాకుండా వాళ్ళు బలవంతంగా కట్టుతున్నారని నాకు చెప్పాలని నీ ప్రయత్నం అయితే వృథా. అది నేను నమ్మను. వాళ్ళు అలాటి వాళ్ళు కాదు.' శేఖరం కళ్ళు కోపంతో, అసహనంతో ప్రజ్వరిల్లాయి.

'అవును అంతా మంచివాళ్ళే! నే నొక్కదాన్ని చెడ్డదాన్ని – అబద్దాలాడేదాన్ని—నేనే—'

'జయంతీ!—'

'మీ రెప్పుడూ యింతే. నా మనసులో మాట యెప్పుడు చెప్పనివ్వారు! అధికారం చెలాయించటం తప్ప ఆత్మీయతని యెప్పుడు చూపించారు.

'జయంతీ!—' శేఖరం లేచి నిలబడ్డాడు.

'మీరు కోపంగా జయంతీ అని అరిస్తే నేనేం భయపడ దల్చుకోలేదు. ఆ రోజు – ఆ రోజు మీరు పెళ్ళి చేసుకుంటాను అని చెప్పి బైటి కెళ్ళగానే రేఖారాణి వచ్చి యెన్ని వుపన్యాసాలు యిచ్చింది!

అసలే మీరు అందరితో చనువుగా వుంటారని అపోహలో వున్నాను నేను—' గొంతు జీరపోవటంతో క్షణంసేపు ఆగి 'మీరు ఆడపిల్లయితే మీకు తెలిసేది.' అంది.

'నువ్వు మగపిల్లాడివై నీ క్కూడా ఓ పొగరుమోతు దొరికి నీ జీవితం అంతా నానా చిందర వందర చేస్తే నీకూ తెలిసేది.' నిదానంగా అన్నాడు.

'అవును. పొగరు కాకపోతే యింకేం వుంచుకోవాలి! ఆ రోజు బెంగుళూరు నుంచి యెంత ఆదుర్దాగా వుత్తరం వ్రాశాను! ఎంత ఆశతో క్షణ క్షణం యెదురు చూశాను.'

'నా కప్పుడు ఒంట్లో బాగాలేదు జయంతీ! ఆ వుత్తరం నాకు సరైన టైమ్‌కి అందలేదు. అందిం తర్వాత వెళ్ళి చూస్తే నువ్వక్కడ లేవు. నీ గురించి సరైన సమాచారమే యివ్వలేక పోయారు వాళ్ళు—'

జయంతికి హఠాత్తుగా అతని దగ్గరకి వెళ్ళి 'అంతా నాకు తెలుసు. శివరామ్ చెప్పాడు. నేను నిజంగా మూర్ఖురాలిని. క్షమించండి' అని అడగా లనిపించింది. కాని శేఖరం చూపులు అంత దూరాన నిలబెడుతున్నాయి. దగ్గరకి రానివ్వటం లేదు.

'నాకేం తెలుసు. నేనూ హఠాత్తుగా వెళ్ళిపోయాననే కోపంతో, కసిగా నా ఖర్మానికి నన్ను అనుభవించమని వదిలేశారనుకున్నాను.'

'నీ మీద నా కెప్పుడూ కోపం లేదు. ఉన్న బాధల్లా ఒక్కటే! ఒకసారి జీవితంలో దెబ్బ తిని కూడా గుణపాఠం నేర్చుకోకుండా మరో సారి ప్రయత్నించి ఓడిపోయానని. అంతే—'

ఇద్దరి మధ్యా మౌనం ఆవరించింది.

'ఆరోజు నేను వెళ్ళి పోయింది కూడా ప్రకాశంతో వెళ్ళాలనికాదు. ఆ వుద్దేశం నాకెప్పుడూ లేదు. కొద్ది రోజులు మీకు కన్పించకపోతే – మీరు ప్రమీలని పెళ్ళిచేసు కుంటారని—'

'ఎంత ఫూల్‌వి!–' పళ్ళ బిగువున అన్నాడు.

'నామూలంగా మీకెలాటి నష్టం రాకూడదని అనుకున్నాను. నన్ను మీరు పెళ్ళి చేసుకుంటే మిగతా అందరూ వ్యాపారంలోంచి తప్పుకుంటారని–ఆర్థికంగా మీరు చాలా దెబ్బతింటారని—'

'నేను బీదవాడినై పోతానని – అందరిలా నాకో ప్రత్యేకత వుండదని అలాటప్పుడు నన్ను పెళ్ళిచేసుకోవడం అనవసరం అని అనుకున్నావు అంతేనా?– అబ్బ! మీ ఆడవాళ్ళు నిజంగా—'

జయంతికి చాచి చెంప మీద కొట్టాలన్నంత కోపం వచ్చింది.

'ప్రపంచంలో ఆడవాళ్ళంతా ఒకరకంగా వుండరు. కొంతమంది పెళ్ళి చేసుకున్నవాడు కటిక దరిద్రు

డైనాసరే కంటికి రెప్పలా చూసుకుని తన ప్రేమతో స్వర్గం చూపించగలవాడైతే చాలు అనుకొంటారు. ఇంకా కొంతమంది డబ్బుంటేచాలు మిగతాఅన్నీ అనవసరంఅనుకుంటారు. ఆరోజు రేఖారాణి నేను మీ సర్వనాశనానికి కారణం కాబోతున్నానని బెదిరిస్తే—'

'నువ్వు నమ్మావు. అంతేనా ?–' కోపంగా చూస్తూ అడిగాడు.

'నమ్మక యేం చేయాలి! మీ రెప్పనైనా నాకేదయినా చెప్పారా ?– కనీసం నామీద చూపు తోంది కేవలం జాలో – లేక—'

'నీకు బుద్ధి లేదు–'

'ఉంది కాబట్టే – నాకింత సహాయం చేసిన మీకు సర్వనాశనం జరుగుతుంది అంటే భరించ లేక భయంతో పారిపోయాను—'

'అబద్ధాలాడకు! నన్నెందుకు అడగలేదు ?–' చటుక్కున జయంతి భుజం గుచ్చి పట్టుకుంటూ అడిగాడు.

'మీరు నాకు చనువు యెక్కడిచ్చారు?–' రోషంగా అడిగింది.

'ఇవ్వలేదూ ?—'

'ఉహు.'

క్షణంసేపు శేఖరం జయంతి బాధతో కెవ్వు మనబోయేంతగట్టిగా భుజం గుచ్చిపట్టుకుని కళ్ళలోకి చూశాడు.

'ఇవ్వలేదూ ?—' రెట్టించాడు.

'ఇవ్వలేదు.' ఖచ్చితంగా వచ్చింది సమాధానం.

'ఛీ !—' వున్నట్టుండి అవుకోలేని కోపంతో విసురుగా తోసేశాడు.

యథాలాపంగావున్న జయంతి వెళ్ళి మంచంమీద పడటంతో, తల నుదుటికి కొట్టుకుంది.

క్షణంసేపు గదిలో భయంకరమైన నిశ్శబ్దం ఏర్పడింది. అంతవరకూ శక్తి అంతా వుపయోగించి బిగబట్టుకుంటున్న జయంతికి ఏడుపు ఒక్కసారి వుప్పెనలా పొంగింది.

అనుకోకుండా తను చేసిన యీ పనికి శేఖరం నిరుత్తరుడైపోయాడు.

జయంతి మొహం చేతుల్తో కప్పుకుంటూ 'నాకు తెలుసు. మీ కోపం– మీ నిర్లక్ష్యం–భగవాన్ ! అసలు నే నెందుకువచ్చా నిక్కడికి—' అస్పష్టంగా వెలువడుతున్న మాటల్ని ఏడుపు పూర్తిగా మింగేసింది.

శేఖరం చాలా సేపు అలా హృదయవిదారకంగా ఏడుస్తున్న జయంతిని చూస్తూ నిలబడిపోయాడు.

తర్వాత మెల్లగా దగ్గర కెళ్ళి 'ఏదీ ! దెబ్బ తగిలిందా ? చూడనా–' అన్నాడు.

జయంతి మొహం తిప్పేసుకుంది.

'చూడనా !—'

'వద్దు. చూడద్దు. మీ రంటే నా కసహ్యం. నన్ను ముట్టుకోవద్దు—'

శేఖరం మంచంమీద కూర్చున్నాడు. 'వద్దు–ఒట్టు–నే చెబ్తున్నా.'

జయంతి బలవంతంగా ఎంత పెనుగులాడినా లాభంలేకపోయింది. శేఖరం రెండు చేతుల్లోకి జయంతి మొహం తీసుకుని చూశాడు. నుదుటిమీద బొప్పికట్టింది. కొద్దిగా చిట్లి రక్తం కన్పిస్తోంది.

'నే వెళ్ళిపోతా—'

'ఎక్కడికి ?—'

'ఎక్కడికైనా సరే! దిక్కులేని వాళ్ళుండే చోటుకి —'

'పొగరు వీసమైనా కూడా తగ్గలేదు—'

జయంతి తడి కళ్ళు రోషంతో, కోపంతో మెరిశాయి. 'మీ రంటే నా కసహ్యం.'

'ఇంకా ?—'

జయంతి విసురుగా అతని చేతులు తోసెయ్య బోయింది.

'నిజంగా నా వుత్తరం అందలేదా ?—'

'ఇప్పటికి లక్షసార్లు చెప్పాను. ఇంకో లక్షసార్లు చెప్తున్నాను. మీ వుత్తరం గిత్తరం నాకు తెలియదు. నా అంతట నేనే వచ్చాను.'

'ఎందు కొచ్చావు ?—' శేఖరం కళ్ళలో కఠినత్వం క్రమేపీ కరిగిపోతోంది. కనుబొమల మధ్య ముడి పడిపోయింది.

'[illegible]—'

'నీ నోరిలా మూయించాలో నాకు తెలియదూ !' శేఖరం దగ్గరకి లాక్కుని తన పెదవులతో జయంతి నోరు మూసేశాడు.

ఎంత సేపయిందో తెలియదు. జయంతికి స్పృహ వచ్చేసరికి తన చేతులు రెండూ అతని భుజాలని గట్టిగా పట్టుకుని వున్నాయి. శేఖరం కళ్ళు క్రమేపి కాంతివంతమైనాయి.

జయంతి భయం భయంగా చూసింది.

ఉన్నట్టుండి నవ్వాడతను.

విస్మయంగా చూసింది జయంతి.

'నిజంగా నీ అంతట నువ్వే వచ్చావా ?—'

'భగవంతుడి సాక్షిగా !'

అతని కళ్ళలో లీలగా అరసెకను సేపు అనుమానం తారట్లాడింది. వెంటనే కళ్ళువింతగా మెరిశాయి. జయంతిని దగ్గరకి లాక్కుని గుండెలకి హత్తుకుంటూ 'అదే నిజమైతే – జయంతీ ! నాకీ క్షణం శాశ్వతం కావాలని పిస్తోంది.'

'నా కూ్కడా !'

'మనిద్దరిమధ్యా యింకెలాటి అపార్థాలు రావన్న మాటేగా !—'

'నా వైపునుంచి కల్లోకూడారావు'

'నన్నింత బాధ పెట్టావు. నిన్నేమని పిలవాలి. రాక్షసి అనా దెయ్యమనా ? లేక భూతం అనా ?—'

'ఒట్టి జయా ! అని'

'ఆరోజు ప్రసాద్ నిన్నలా చేతుల్తో పైకి తీసుక పోతుంటే – అబ్బ ! నే నెంత నరకం చూశానో తెలుసా'

'నేను మాత్రం తక్కువ చూశానా ?–' అంటున్న జయంతి హఠాత్తుగా అతని చేతుల్లో మరింత ఒదిగిపోతూ గుండెలకి అంటుకపోయి పసిపిల్లలా 'నన్నెప్పుడూ – ఎప్పుడూ ఒంటరిగా వదిలేయద్దు. భయంకరమైన ఆలోచనలు నన్ను పిచ్చిదాన్ని చేస్తాయి' అంది.

'అలాంటి భయం యింకెప్పుడూ వద్దు. నా నీడలా వెంటే వుంచుకుంటాను–' చెక్కిళ్ళు నిమురుతూ అన్నాడు.

చాలాసేపు యిద్దరూ అలాగే కూర్చుండిపోయారు.

'ఉండు. యిప్పుడే వస్తాను.' వున్నట్టుండి లేవబోయాడు.

'ఎందుకు – యెక్కడికి ?—'

'లక్ష్మికి నువ్వు క్షేమంగా చేరావని టెలిగ్రాం యివ్వద్దూ ?—'

'నాయర్‌ని పిలిచి చెప్పండి –' అతన్ని లేవనీయకుండా ఒళ్ళో తల దాచుకుంటూ అంది.

● ● ●

మర్నాడు సాయంత్రం– జయంతి గదిలో అద్దంముందు కూర్చొని తల దువ్వుకుంటోంది. శేఖరం ప్రయాణం నాలుగు రోజులకి వాయిదా పడింది. ఈ నాలుగు రోజుల్లోనూ ప్రయాణం కోసం కావాల్సిన యేర్పాట్లలో వెంట జయంతినికూడా తీసుకెళ్ళేందుకు అనుగుణంగా మార్పులుచెయ్యడంతో సరిపోయింది. తలదువ్వుకుంటున్న జయంతికి వాసు "ఉత్తరంవచ్చింది" అంటూ కవరు ఒకటి తెచ్చియిచ్చాడు. ఎవరు ? ప్రసాద్ కాదుగదా! క్షణంసేపు గుండెలు కొట్టుకున్నాయి. కవరు తిప్పిచూసింది. అడ్రస్ తనపేరుతో కేరాఫ్ విజయలక్ష్మి వుంది. మద్రాసునుంచి తిరిగి వచ్చింది. కనుబొమలు ముడిచి వుత్తరం తీసిచూసింది. చాలా పెద్దవుత్తరం. ఉత్తరం చివర సంతకంకోసం ఆత్రంగా వెదికింది. శేఖరం అని వుంది. శేఖరం! నా వుత్తరం అందలేదూ—అందలేదూ అని పదిసార్లు అడిగిన శేఖరం. అది యీ వుత్తరమేనా ? ఇందులో ఏముంది?

మంచంమీద వచ్చి కూర్చుంది. ఇంత పెద్దవుత్తరం వ్రాయటానికి శేఖరానికి ఎంత టైమ్ పట్టిందో! అతని తెలుగు దస్తూరి యింతచిన్నగా, యింత అందంగా ప్రింట్ చేసినట్టు ఒకేరీతిగా వుంటుందన్న సంగతి యింతవరకూ తెలియదు.

మంచంమీద వెనక్కివాలి దిండు నానుకుని పూర్తి ఏకాగ్రతతో చదవటం ప్రారంభించింది.

జయంతీ!

నిన్ననే నీ పెళ్ళిశుభలేఖ చేరింది. పెళ్ళినాటికి నేను రాలేకపోవచ్చు. రెండుమూడు రోజుల్లో వూరువెడుతున్నాను. ఎప్పుడు తిరిగివస్తానో కూడా నమ్మకంలేదు. కారణం నాకు తిరిగి రావాలనిలేదు. వచ్చినా రాకపోయినా పట్టించుకునేవారుగాని, బాధపడేవారుగాని యిక్కడెవ్వరూ లేరు.



జయంతీ! నేను వెళ్ళిపోయేముందు, శాశ్వతంగా నీ నుంచి దూరమైపోయేముందు—నీకు కొన్ని విషయాలు చెప్పాలి. అవి చెప్తే– భవిష్యత్‌లో ఏనాడైనా ఏ రూపంగానైనా నీకు నేను గుర్తురావటం తటస్థిస్తే నీ మనసులో సానుభూతితో ఓ నిట్టూర్పు తప్ప—అసహ్యంతో చీదరింపు కలగదని నమ్మకం. అందుకే యీ రోజు యింత ఓపిగ్గా యివన్నీ చెప్పటానికి కూర్చున్నాను.

జయంతీ! చిన్నప్పటినుంచి మానసికంగా చాలా వంటరిగా ఓ విధంగా అందరికీ దూరంగా పెరిగాను నేను. మా అమ్మ నాకు పన్నెండు సంవత్సరాలప్పుడు పోయింది. కారణం తెలియదు. కాని ఒక్క డాక్టరుగారి కుటుంబం తప్ప మాకు ఆత్మీయులుగాని, బంధువులుగాని లేరు. ఒక్క గీత తప్ప నాకు స్నేహితులు లేరు. స్కూల్లో కూడా యెక్కువ మందితో నేను కలిసి

వాడిని కాదు. మా అమ్మ కలవనిచ్చేది కాదు.

అమ్మ పోయిం తర్వాత నా ప్రపంచం మరీ చిన్నబోయింది. దాదాపు శూన్యమై పోయిందని చెప్పొచ్చు. ఆవిడ నలుగురితో నన్నెందుకు కలవనిచ్చేది కాదో నాకప్పుడు అర్థమైంది. ఇంకేవైనా స్నేహాలు దొరికితే ఆవిడకి దూరమై పోతానేమోనని ఆవిడ భయం. ఆవిడ వూహాలు, ఆవిడ ప్రపంచం అంతా నా చుట్టూ వుండేవన్నమాట.

మా అమ్మ పోయిం తర్వాత నాన్నగారు యెలాగో అయిపోయారు. ప్రతి దానిమీదా శ్రద్ధ తగ్గిపోయింది. వ్యాపారంలో క్రమేపి నష్టం రావటం మొదలు పెట్టింది. చదువుకునే రోజుల్లో రేఖారాణి పరిచయం అయింది. చిన్నప్పటినుంచి ఒక రకంగా పెరిగిన నేను, తర్వాత అవకాశం వచ్చినా అందరితో కలువుగోలుగా వుండలేక పోయేవాడిని. కాలేజీలో నా చదువేదో నేను చూసుకుని నా మార్గాన నేను పోయేవాడిని రేఖారాణి బలవంతంగా నా జీవితంలో ప్రవేశించింది. నా ఒంటరి తనాన్నుంచి పట్టుబట్టి యివతలకి లాగి కాలేజీ ఫంక్షన్‌లు, వాటిలో పాల్గొనేలా చేసింది. మా అమ్మ తప్ప యింకోరి చనువు అంత బాగా యెరుగని నేను సహజంగా రేఖారాణివైపు తిరిగాను.

'పైకి కన్పించే నీ గాంభీర్యం అంతా ఒట్టి ముసుగు. ఇది తీసి లోపల చూస్తే నీ అంత వుషారయిన మనిషి – యింకెవరూ లేరు' అనేది రేఖారాణి.

నా చదువు పూర్తయింది. నాన్నగారు తన బిజినెస్ అంతా నా చేతుల్లో వదిలేశారు. నాకు రేఖారాణిని వివాహం చేసుకోవాలని వుండేది. కాని నాన్నగారు, డాక్టరుగారు అంతా గీతను నా భార్యక్రింద చూసేస్తున్నారు, వాళ్ళకి యెదురు చెప్పే సాహసం లేదు. తొలి యవ్వనపు పొంగు అది అది దాచుకోలేను. బైట పెట్టలేను.

ఈ పరిస్థితుల్లో నాన్నగారు పోయారు. నాకున్న బంధం తెగిపోయింది. చాలా అప్పులున్నాయి. వాటినన్నింటిని తీర్చాలి. నాన్నగారి పేరు యెప్పటిలా నిలబెట్టాలి. కొడుకు సమర్థుడు, ప్రయోజకుడు అన్పించుకోవాలి. ఈ ఆశతో రాత్రింబవళ్ళు బిజినెస్‌లో కృషి చేశాను. ఎలాగైతేనేం నేను అనుకున్నది సాధించగలిగాను. అప్పులు మెల్లమెల్లగా తీరుతున్నాయి. పడిపోతుంది అనుకున్న యిల్లు నిలబడింది. దానికి మెరుగులు దిద్దటం ప్రారంభించాను. ఈ లోపల నాలో అనారోగ్యం యెప్పుడు ప్రవేశించిందో నాకే తెలియదు.

రేఖారాణితో హద్దుమీరి అతి చనువుగా ప్రవర్తిస్తున్నాననే కోపంతో డాక్టరుగారు రాకపోకలు నిలిపేశారు. అప్పుడప్పుడు జ్వరం వస్తుండేది. విపరీతంగా, నీరసంగా అన్పించేది. అది యెక్కువగా శ్రమించటం వల్ల అలసట అనుకున్నాను. దగ్గు వచ్చేది. రాత్రిళ్ళు యెక్కువ మేలుకోవటంవల్ల వేడి చేసేమో అనుకున్నాను.

తర్వాత బైటపడింది. టి. బి. అని, ఓ లంగ్ పాడయిపోయిందని, రెండో లంగ్ పాడయిపోవటానికి సిద్ధంగా వుందని. ఇష్టంలేక పోయినా తప్పనిసరిగా మదనపల్లి శానిటోరియమ్‌కి వెళ్ళాల్సి వొచ్చింది. అక్కడ దాదాపు సంవత్సరం పాటు వున్నాను. ఈ సంవత్సరంలో రేఖారాణి ఆప్యాయత, స్నేహం క్రమేపీ అదృశ్యం కాసాగాయి. తనకి చూడాలని రావాలని వుందిగాని వాళ్ళవాళ్ళు ఒప్పుకోటం లేదని వుత్తరాలు వ్రాసేది. కాని నాకు తెలుసు. వాళ్ళింట్లో రేఖారాణి మాటకి యెవరూ యెదురు చెప్పరని.

ఈభయంకరమైన చీకటిరోజుల్లో గీత దగ్గరగా వచ్చింది. డాక్టరుగారు నా నిర్లక్ష్యాన్ని మన్నించి నాకు మళ్ళీ ఆప్తులయ్యారు. ఆ రోజుల్లో గీత ఆత్మీయత, ధైర్యం చెప్పే ఆమాటలు గుర్తొస్తే యిప్పటికికూడా కళ్ళలోనీళ్లు తిరుగుతాయి. అంతవరకూ గీతంటే నాకో విధమైన యిష్టం తప్ప యింకేమీ వుండేది కాదు. గీత క్రమంగా ఆ యిష్టాన్ని క్రమంగా మార్చుకునేలా చేసింది.

జీవితంమీద ఆశ వదులుకుని వెళ్ళిన నేను సంపూర్ణమైన ఆరోగ్యంతో రెట్టింపు హుషారుతో తిరిగి వచ్చాను. తిరిగిరాగానే నాకు మొట్టమొదట తెలిసిన విషయం రేఖారాణికి మరొక డబ్బుగలాయనతో వివాహం ఐపోయిందని. కాని నాకేం బాధనిపించలేదు. తొలి యవ్వనపు పొంగు చల్లారింది. మనిషిగా పరిపూర్ణమైనవ్యక్తిగా నేను రూపొందుతున్న రోజులవి.

గీతంటే నాకు మనసులో పెద్ద ఆకర్షణ లేదు. ఐనాసరే! అభిమానం చాలనిపించింది. గీతని పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకున్నాను. శూన్యమాసం దాటుగానే లగ్నాలు పెట్టించేయటానికి డాక్టరుగారు నిర్ణయించారు. కాని శూన్యమాసం దాటనే లేదు. గీత మరణించింది. కొంతమంది మామూలు జీవితంలో మనకి ఇష్టం లేనట్టు, చాలా అల్పం అన్నట్టు కన్పిస్తారు. కాని వాళ్ళు నిష్క్రమించిన తర్వాత ఏర్పడిన ఖాళీ చూస్తే దిమ్మెరపోతాం. నా విషయంలో కూడా సరిగ్గా అలాగే జరిగింది. గీత

'నే నెప్పటికైనా సుఖపడగలననే ఆశ నాకుంది.'

'అయితే ఇంకెందుకూ దిగులు?'


'నా ఆశ నిజమవుతుందో కాదో అని.'

మరణం నా మనసులో నే నెప్పటికీ పూడ్చుకోలేనేమో అన్నంత వెలితి ఏర్పరచి వెళ్ళిపోయింది.

బిజినెస్ తప్ప నా కింకో ప్రపంచం లేదు. మనసంతా కేంద్రీకరించి ఏకాగ్రతతో రాత్రింబవళ్ళు పనిచేస్తే మనిషి సాధించలేంది యేదీ వుండదు. కొద్ది సంవత్సరాలలోనే నే పట్టిందల్లా బంగారం కావటం ప్రారంభించింది. అనుకోకుండా వరదలా వచ్చి నన్ను ముంచేస్తున్న యీ డబ్బు యేం చేసుకోవాలో, యెలా ఖర్చుపెట్టాలో తెలిసేది కాదు. విపరీతంగా చందా లిచ్చే వాడిని. అదింకో బాధ తెచ్చి పెట్టింది. నలుగురిలో నా పేరు మారుమోగిపోవటం – బలవంతాన అందరూ నన్ను తమ సర్కిల్స్‌లో కలుపుకోవాలనే పోటీ పెరిగింది. ఆడపిల్లలున్న తలిదండ్రులకి నాకు ఆత్మీయులు కావాలనే ఆరాటం హెచ్చింది.

ఎన్ని రకాల వ్యాపకాలున్నా నా ఒంటరితనం నన్ను వదలటం లేదు. అందుకే అందరిని కలుపుకుని అందరు నా వాళ్ళే అని నమ్మటానికి ప్రయత్నిస్తూ మనశ్శాంతికోసం ప్రయత్నించ సాగాను. ఈ గందరగోళంలో రేఖారాణి మళ్ళీ నాకు సన్నిహితంగా వచ్చింది. కేవలం కుటుంబాన్ని అప్పుల నుంచి తప్పించటానికి వివాహం చేసుకున్నానని అంతకంటే యింకేం లేదని ఓ విధంగా జీవితాన్ని త్యాగం చేసానని అది గుర్తించాలని మాట్లాడేది. నేను తనకి తెలుసునని – ఆప్త మిత్రుడినని అందరికీ చెప్పుకునేది. అంతక్రితం మా పరిచయం తెలిసిన కొంతమంది యిది పెద్ద వార్తగా తీసుకునేవాళ్ళు కాదు. కాని తెలియనివాళ్ళు చాలా మంది రేఖారాణికి నాకు పరిచయం కంటే ముఖ్యమైంది యేదో వుందనుకునేవాళ్ళు. నా కిది మరీ విసుగేసేది. చిన్నప్పటి నుంచి నాకు యెవరి మనసు నొప్పించటం అలవాటు లేదు. నే నేనయినా నిష్కర్షగా మాట్లాడితే రేఖారాణి బాధ పడుతుందేమోనని భయం. అలాగని ఆ చనువు సహించ గలనా అంటే అదీ సహించలేను. రేఖారాణి మళ్ళీ నాకు దగ్గరగా రావాలని పాత స్నేహాన్ని పైకి తీయాలని ప్రయత్నిస్తుందని నాకు తెలుసు. ఆ ప్రయత్నంలో యెప్పటికీ విజయం పొందలేదు. కారణం నా మనసులో ఎక్కడా ఆ పరిచయపు ఛాయలు కూడా మిగల్లేదని నాకు ఒక్కడికే తెలుసు.

ఆ పరిస్థితులలో నువ్వు పరిచయమయ్యావు. ఆ రోజు నాకు బాగా గుర్తుంది. జీవితంలో యెర్రసిరాతో అండర్‌లైనుచేసి గుర్తు పెట్టుకోవాల్సిన క్షణాలివి. నా కిప్పటికీ గుర్తుంది. ఆరోజు నేను బెంగుళూరు నుంచి తిరిగి వచ్చాను. రోజు రోజుకి పెరిగి



పోతున్న యీ వ్యాపారపు లాభ నష్టాల బేరీజులతో ఆలోచించి ఆలోచించి విసిగిపోయిన నేను వనితా విహార్‌లో ప్రోగ్రాం జరుగుతుంటే కొద్దిసేపు అలా నలుగురిలో కలిస్తే విశ్రాంతి లభించినట్టుంటుందని అనిపించి బైలుదేరాను.

ప్రోగ్రాం మధ్యలో వచ్చాను. లోపలి కెళ్ళటానికి యిష్టంలేకపోయింది. మొదటి తరగతి ఎంట్రన్స్ దగ్గర నా వెనక కొద్దిగా చీకటివుంటే అక్కడ నిలబడ్డాను. అప్పుడుకూడా నిన్ను సరిగ్గా చూడ లేదు. ప్రోగ్రాం చూస్తుండగా నువ్వున్నట్టుండి వెనక్కి తిరిగి లేచి నిలబడి లోపలికి వెళ్ళండి అన్నావు. చీకటిలో నిలబడివున్న పూర్తి వెలుగులో నిలబడివున్న నీ మొహం స్పష్టంగా కనిపిస్తోంది. నిన్నుచూడగానే వులిక్కిపడ్డాను. గీత పోలికలు యెంత స్పష్టంగా కనిపిస్తున్నాయి! కాని ఆ క్షణం లోనే గీతకంటే యెన్నో పదాల ఎంతో అందంగా అద్భుతంగా వున్నావనిపించింది. నీ కళ్ళలో కనిపించేంత సజీవమైన భావం గీత కళ్ళలో లేదు. నీ ముఖ్క పున్నంగ [illegible]

కొసతేలి గీతముక్కు లేదు. గీత పెదవులు నీపెదవులూ అచ్చు ఒకేలా వున్నా నీపెదిమలమీద మనోహరమైన చిరునవ్వు యిద్దరికీవ్యత్యాసం వుందని చెబుతుంది. గీత మెత్తగా మృదుభాషిణిలా కన్పిస్తుంది. నువ్వు పొగరుగా—ఏమాత్రం అయిష్టాన్ని సర్దుకోలేని విసురు కలదానివిగా కన్పిస్తావు.

నేను లోపలికి వెళ్ళాననటంతో నువ్వు మళ్ళీ కూర్చుని డాన్స్ చూడటంలో మునిగిపోయావు. కాని నా కళ్ళన్నీ నీమీదనే వున్నాయని నీకు తెలియదు. నా శరీరంలో అణువణువు నువ్వెవరో తెలుసుకోవాలని ఆత్రుత పడుతోందని నువ్వు వూహించలేదు. ప్రోగ్రాం అయిపోగానే నిన్నుఅడగాలనుకున్నాను. కాని యింతలో సుమిత్రాదేవి వచ్చి నువ్వు వనితా విహార్ కొత్త సెక్రటరీవి అని పరిచయం చేసింది. ఊపిరి పీల్చటం మర్చిపోయాను నేను. నీ దగ్గర యింకొంచెంసేపు నిలబడాలని—నీతో మాట్లాడాలని ముందుకి వురుకుతున్న మనసుని బలవంతంగా ఆపి నిశ్శబ్దంగా సుమిత్రాదేవితో వెళ్ళిపోయాను.

చివరికి అంతా వెళ్ళిపోయిం తర్వాత సుమిత్రాదేవి నిన్ను వుండి లైట్లూ అవీ తీసేసి ఆపనులన్నీ పూర్తి చేయించి వెళ్ళమంటుంటే నీ మొహంలో కన్పించిన విసుగుదల చూసి జాలేసింది. అప్పటికే నువ్వు చాలా అలిసిపోయావని వాడిపోయిన నీ మొహం చెబుతోంది. అందుకే యెవరేమనుకుంటారోననే భయం వదిలేసి ధైర్యంగా నేను కూడా వుంటానన్నాను.

నిన్ను కూర్చోపెట్టి నేనా పనులన్నీ చేయించటానికి వెళ్ళిపోయాను. కాని అక్కడ నిలబడినంతసేపూ నిన్ను పరీక్షగా చూస్తూనే వున్నాను. గీత పోలికలు చాలా వుండడంవల్ల నువ్వెందుకో నాకంత కొత్త వ్యక్తిలా అన్పించలేదు.

పనంతా పూర్తయిం తర్వాత దగ్గరకి వస్తే కుర్చీలో ప్రక్కకి తలజార్చి నిద్రపోతున్నావు. తట్టి లేపుదామని చేయివేస్తే రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నావు. నీ స్పర్శ నాలో యెలాటి తీయటి భావాన్ని రేకెత్తించిందో నీకెలా తెలుస్తుంది!

నిన్ను దించి వచ్చేసిం తర్వాత నాపేరుచెప్పగానే నీకళ్ళలోకన్పించిన ఆశ్చర్యం – భయం గుర్తుకురాగానే, త్వరపడ్డానేమో – అతి చనువుగా ప్రవర్తించానేమో అన్పించసాగింది. సహజంగా నా గురించి యెలాటి కథలు ప్రచారం అవుతున్నాయో – చూచాయగానేనువూహించ గలను. అవన్నీ అప్పటికే నువ్వు వినివుంటే దానికి తోడు యిలా యీ హద్దుమీరిన ప్రవర్తన చూస్తే నన్ను గురించి నువ్వు యెలాటి అభిప్రాయం యేర్పరుచుకొంటావోనని భయం వేసింది.

ఆ భయంతోనే మర్నాడువచ్చి నిన్ను వనితా విహార్‌లో చూడాలని యెంతగా అన్పించినా నిగ్రహించుకున్నాను. నిన్ను చూస్తే మాట్లాడాలనిపిస్తుంది. మాట్లాడితే తప్పకుండా పరిచయం పెరుగుతుంది. నీమీద ప్రత్యేకమైన ఆసక్తి చూపుతున్నానని తెలిస్తే రేఖారాణి వాళ్ళు ఈర్ష్యతో నిన్ను వుద్యోగంనుంచి తీసెయ్యొచ్చు. ఆ వుద్యోగంనుంచి వెళ్ళిపోతే నిన్ను చూడటంకూడా నాకు సంభవం కాదు.

ఎప్పటికప్పుడు యదాలాపంగా అడిగినట్టు అడిగి రేఖారాణిద్వారా—సుమిత్రాదేవిద్వారా నీ విషయాలు తెలుసుకుంటూనే వున్నాను. దూరంనుంచి నువ్వు వనితావిహార్‌కి వచ్చేటప్పుడు—వెళ్ళేటప్పుడు ఒకటి రెండుసార్లు చూశాను.

రేఖారాణిద్వారా మిసెస్ వర్మయింట్లో నీకు జరిగిన అత్యాచారం తెలిసింది. ఆ జాబ్‌లోవుంటే అలాటివి అప్పుడప్పుడూ తప్పవు. నీకు వెంటనే యింకేదైనా జాబ్ చూపించాలనిపించింది.

ఆ రోజు నీతో మాట్లాడాలని—ఓసారి దగ్గరగా నిన్ను చూడాలని నీకోసమే వస్తున్నాను. కాని నువ్వు గేటుబైటే కన్పించావు.

దోవలో నీ వుద్యోగం పోయిందని తెలిసి నా సెక్రటరీగా రమ్మన్నాను. నాకు తెలుసు. నేను నిన్ను సెక్రటరీగా తీసుకుంటే వనితా విహార్ వాళ్ళంతా యెంత విరుచుకు పడతారో! ముఖ్యంగా రేఖారాణి. కాని నాలో అహంకారం ఆ అనుమానాన్ని తీసేసింది. నా యిష్టమైన ఆ అమ్మాయికి వుద్యోగం యిస్తున్నాను. రేఖారాణి యెవరు! వనితా విహార్ వాళ్ళు యెవరు, కాదనటానికి!

నా కప్పటికే లభించిన పుష్కలమైన పేరు ప్రతిష్టలు నన్ను మరింత రెచ్చగొట్టాయి. నా భయమల్లా నువ్వు ఒప్పుకుంటావా లేదా అనే!

కాని మర్నాడు కారు పంపగానే

● 'ఇదిగో అప్పారావ్! నన్ను వూరికే విసిగించకు. ఈ ఏటికి నేను ఒక్క పైసకూడా అప్పిచ్చే పరిస్థితిలో లేను. కావాలంటే వచ్చే ఏడాది ఇదే రోజున కనబడు. అప్పుడు వీలైతే చూస్తాను' అన్నారొక సుబ్బారావుగారు అప్పుకోసం అదేపనిగా వేధిస్తున్న అప్పారావుతో.

'సరేలెండి...మీరలా అంటే నేనింకేం చెప్పగలను. అయితే ఆ రోజు ఎన్ని గంటలకు తమ దర్శనం చేసుకోమంటారండీ' అన్నాడు ఆశావాది అప్పారావు.

—అర్వీ సుబ్బారావు, బొంబాయి.

వచ్చావు. దాన్నిబట్టి ఆ క్షణంలో నీకు జాబ్ చాలా అవసరం అని గ్రహించాను. ఈ అవకాశాన్ని నేను జారవిడవ దల్చుకోలేదు. ఈ రూపంగా దోవ కల్పించుకుని నీ మనసులో స్థానం కల్పించుకోవాలని నా ఆశ.

"నువ్వు సెక్రటరీగా చేరిం తర్వాత నా యింటికే కాదు. నా జీవితానికి కూడా కొత్త కాంతి వచ్చింది. నీ రూపం, అమాయకమైన నీ మాటలు నాకు చాలా హాయిగా వుండేవి. వంటరితనం మెల్లమెల్లగా నాకు తెలియకుండానే మాయ మవసాగింది. ఎప్పటికైనా నిన్ను నా వైపుకి తిప్పుకో గలను అనే ఆశ మనసులో వుదయించటం ప్రారంభించింది.

ఆరోజు నా పుట్టిన రోజు. హఠాత్తుగా సినిమాలో నేను పంపించిన చీర కట్టుకుని కోటి కాంతులతో వెలిగి పోతున్న నిన్ను చూసేసరికి నిజంగా నాకు మతిపోయింది. నిన్నలా చూస్తూ యెన్ని గంటలయినా నిశ్శబ్దంగా గడపవచ్చు ననుకున్నాను. అంతకు ముందు నేనెంతమందికో

యెన్ని రకాలుగానో బహుమతులు యిచ్చాను. కాని నువ్వు యీ చీర కట్టుకున్నప్పుడు చూడగానే కలిగిన తృప్తి నా కెప్పుడూ కలగలేదు.

ఆ రాత్రి - గోకుల్ విహార్‌లో పైన రూఫ్‌గార్డెన్ మీద ఒంటరిగా నీవున్నప్పుడు నువ్వు పిట్టగోడ దగ్గర అంచున ఆనుకుని క్రిందకిచూస్తూ బొమ్మలాగుంటే వెనకగా వచ్చి నిన్ను రెండు చేతులతో యెత్తుకుని యెక్కడికైనా పారిపోవాలని పించింది. మరి కొంచెంసేపు అలా వంటరిగా వుంటే నా మనసు నన్నే పిచ్చి పనులవైపు రెచ్చగొడుతుందో ననే భయంతో గబగబా నిన్ను క్రిందకి లాక్కు వచ్చేశాను.

నిన్నిక యెక్కువకాలం యిలా దాచి వుంచలేనని అనుకున్నాను. అందుకే సోవియట్ బృందానికి పార్టీ యిచ్చినప్పుడు నిన్ను అందరికీ పరిచయం చేసేసి పెళ్ళి చేసుకోవాలనే కోర్కె కూడా బైట పెట్టటానికి నిశ్చయించుకున్నాను. అంతక్రితం చీరె గొడవతో నువ్వు మొహం ముడుచుకున్నావని తెలుసు. కాని ఆ విసుగు నువ్వలా హఠాత్తుగా చెప్పకుండా వెళ్ళిపోయేంత వుందని తెలియదు. నిజంగా నీ మీద మొట్ట మొదట సారిగా కోపం వచ్చిన క్షణాలవి.

రేఖారాణీ వాళ్ళంతా జయంతిని సెక్రటరీగా యెలా తీసుకున్నావని నిలవ దీశారు. నాకు తెలిసిన ఒకాయన రికమెండ్ చేస్తూ వుత్తరం పంపాడని, కాదనలేక పోయానని అబద్ధం ఆడాను. కాని మనసులో వాళ్ళందరికీ అప్పటికే అనుమానం కలిగిందని నేను గ్రహించక పోలేదు. కనీసం నువ్వు మర్నాడు కూడా సరిగ్గా మాట్లాడలేదు.

ఆ మర్నాడు రేఖారాణి వచ్చింది. జయంతిమీద నీకున్న నిజమైన అభిప్రాయం చెప్పమని పట్టు బట్టింది. జాలితప్ప యింకేం లేదన్నాను. నీ పట్ల నా కనురాగం వున్నమాట నిజమే! నా మనసంతా నువ్వే నిండి వున్నావని నాకు తెలుసు. కాని యేం చేయాలి! నీ మనసులో వుద్దేశం తెలుసుకోకుండా యిలాటి అభిప్రాయాలు బైట పెట్టడం యెంత ప్రమాదం! అప్పటికే నీ హృదయం యింకొకరికి అంకితం కాలేదనినాకేం నమ్మకం!

రేఖారాణి తను మానసికంగా నరకం, అనుభవిస్తున్నానని, ఆభర్తతో అసలు సుఖం లేదని - జీవితం వ్యర్థం అవుతుందని నువ్విష్టపడితే ఆయనకి డైవోర్స్ యిచ్చేస్తాను మనిద్దరం పెళ్ళి చేసుకుందాం అని యేవేవో మాట్లాడడం మొదలు పెట్టింది. రేఖారాణిని మందలించడమే కాకుండా యిలాటి చనువు యిక తగ్గిస్తే బాగుంటుందని కూడా అన్నాను.

ఉన్నట్టుండి రేఖారాణి నామీదకి ఒరిగి నా గుండెల్లో మొహం దాచుకుని హిస్టీరియా వచ్చిందానిలా ఏడవసాగింది. నా కెంచేయాలో తోచ

లేదు. ప్రపంచంలో ప్రతి మగవాడి లాగనే ఆడవాళ్ళ కన్నీళ్ళుచూసి భరించేశక్తి నాలో లేదు. పరిస్థితులు అర్థంచేసుకుని జీవితాన్ని సరిదిద్దుకునేందుకు ప్రయత్నించమని—ఎప్పటికీ నేను స్నేహితుడిగా వుంటానని సముదాయించసాగాను. కొద్దిసేపైం తర్వాత రేఖారాణి ఏడుపు తగ్గింది.

"నిన్ను పోగొట్టుకుంటానేమో నన్న భయం నన్ను వెర్రిదాన్ని చేస్తోంది. అంతకంటే యింకేంలేదు" అంది కళ్ళు మూసుకుంటూ.

నేనేం మాట్లాడలేదు. ఇదంతా యింక యింతటితో స్వస్తి చెప్పాలి అని మృదువుగా రేఖారాణికి యెలా నచ్చ చెప్పాలా అని ఆలోచిస్తుండగా యింతలో నువ్వు వచ్చావు. క్షణం సేపు నిరుత్తరుడనైన నాకు ఏం చెప్పటానికి తోచలేదు. నువ్వు చూసిన ఆ దృశ్యం నా మనసులో ఎలాటి ముద్రవేస్తుందో వూహించలేని మూర్ఖుణ్ణికాదు.

రేఖారాణిని పైకి పంపి నిన్ను తీసుకొచ్చి గదిలో కూర్చోపెట్టాను, అప్పుడు నీ మొహం చూస్తూనే తెలిసింది. నువ్వు మంచి మూడ్‌లో లేవని.

రేఖారాణిని పంపేసి వచ్చిం తర్వాత మనిద్దరి మధ్య జరిగిన సంభాషణ నీకు గుర్తుండి వుంటుంది. అనవసరంగా నన్ను రెచ్చగొట్టావు.

ఆరోజు నిన్ను యింటి దగ్గరదింపి వెళ్ళింతర్వాత నాలో నాకే ఓ విధమైన భయం కలగ సాగింది. నువ్వు మళ్ళీ నా సెక్రటరిగా రావనే అన్పించింది. ఆ అనుమానానికి బలం కలిగిస్తూ నువ్వు మర్నాడు కారుపంపిస్తే రాలేదు. తిరగ్గొట్టావు. నీకు నిజంగా ఒంట్లో బాగాలేదని నేను నమ్మలేదు.


చివరికి ధైర్యంచేసి మీయింటికి వచ్చేశాను. ఆరోజు నేను రావడం యింకో గంట ఆలస్యం అయితే - నాకది గుర్తొస్తేయిప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

నిన్ను హాస్పిటల్లో జేర్పించిం తర్వాత ఆపరేషన్ జరిగి అంతా సవ్యంగానే వుందని తెలుసుకుని బామ్మని యింటి దగ్గర దించటానికి వచ్చాను.

"కూర్చో నాయనా!" అంటూ కుర్చీ చూపించి ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది. నువ్వుండే ఇల్లంతా పరీక్షగా చూశాను. చిన్న మంచం, ఒకే ఒక కుర్చీ, గోడలోవున్న అల్మారలో దేవుడు, పుస్తకాలు యివన్నీ పరీక్ష చేస్తున్న నాకు గోడ మీద వున్న ఓ ఫొటోమీద హఠాత్తుగా దృష్టి నిలిచిపోయింది. తెల్లబోయాను కూడా. లేచి వెళ్ళి మేకుకి తగిలించి వున్న ఆ ఫొటో తీసి పరీక్షగా చూశాను. సందేహం లేదు. మా అమ్మ ఫొటోనే! ఇక్కడెందుకుందో నాకర్థం గాలేదు

ఈ లోపల బామ్మ కాఫీ గ్లాసుతో తిరిగి వచ్చింది.

"ఈ ఫొటో యిక్కడెందుకుంది?" అన్నాను ఆత్రంగా.



ఆవిడ విచిత్రంగా నా వైపు చూసి "ఇక్కడెందుకుంది యేమిటీ, అది మా ఫొటో! మా అబ్బాయి, మా అమ్మాయి, మధ్యలో నేను."

"ఈయన, ఈయన జయంతి తండ్రా!"

"అవును. ఇటు కుడిప్రక్కనున్నది నా అక్కకూతురు రాజ్యలక్ష్మి—" నాకు సంతోషంతో గావుకేక పెట్టాలనిపించింది. ఆ ఫొటోని తీసుకుని ఆవిడ దగ్గరగా వెళ్ళి "కాని—కాని—ఇది—ఇది మా అమ్మది. ఈ ఫొటో మా యింట్లోకూడా వుంది" అన్నాను. కాఫీగ్లాసు అలాగే పట్టుకుని ఆవిడింకా తెల్లబోయి చూస్తోంది. నేను వెంటనే చెయ్యి పట్టుకుని "నిజం! రాజ్యలక్ష్మి మా అమ్మ. మా యింటికి వస్తే యిప్పుడేచూపుతాను. మైగాడ్—జయంతి—నాకు—" వాక్యం పూర్తి చేయలేకపోయాను.

తర్వాత బామ్మద్వారా తెలిసింది. మా అమ్మ చిన్నప్పుడే తల్లి తండ్రి పోతే వాళ్ళ మేనత్తదగ్గర పెరిగింది. నేను పుంగుకుంటాను అని

బామ్మ ఎంత బ్రతిమలాడినా ఆవిడ యివ్వలేదట. ఆ మేనత్త చాలా గయ్యాళి. మా అమ్మ అభిప్రాయం ఏదీ బైటపెట్టలేనంత హడలుగా పెంచిందట. కాని మీ నాన్న మా అమ్మ చాలా అప్యాయంగా వుండే వారుట.


చివరికి వయసు వచ్చిం తర్వాత-చాలా డబ్బుందని ఓ రెండో పెళ్ళి ఆయనతో సంబంధం కుదురుస్తే అది యిష్టపడక ప్రక్కింటి వారి అబ్బాయితో పారిపోయి వచ్చింది! ఇన్ని సంవత్సరాలు గడిచినా మా అమ్మకి - నాన్నకి ఆవిడంటే భయమే. అందుకే యెవరికీ వునికి తెలియకుండా వుండటంకోసం హైద్రాబాద్ వచ్చి స్థిరపడి పోయారు. వాళ్ళు మళ్ళీ తమవాళ్ళెవరితోనూ పరిచయం యేర్పరుచుకోవాలని ప్రయత్నించ లేదు.

బామ్మ యిదంతా చెప్పిం తర్వాత మా అమ్మ వాళ్ళు అంత వంటరిగా యెవరూబంధువులు లేకుండాఎందుకు గడిపారో నాకర్థంఅయింది. నాఆనందానికి హద్దులు లేకపోయినాయి. నేనింతగా కోరుకుంటున్న వ్యక్తి నాకు పరాయి మనిషి కాదు. నాకు మామయ్య కూతురు. నీ మీద నాకు అధికారం వుంది. అన్నింటికంటే చాలా రోజుల తర్వాత మా అమ్మని మరిపించేంత ఆప్యాయత యివ్వగలిగిన బామ్మ దొరికింది.

నీ మీద నాకు హక్కుందనే అహంకారంతో నే నిన్ను నా ఇంటికి తీసుకొచ్చాను. కాని బామ్మతో ఈ విషయం నేను చెప్పద్దని బ్రతిమలాడాను. నువ్వెలాగూ నా దానివే! కాని, యిలా చుట్టరికం తెలిసి, బామ్మ కోర్కె మీద కాక, నీ అంతట నువ్వు నన్ను కోరుకోవాలి. నీ అంతట నువ్వు నా దగ్గరకి రావాలి. అది నా కోర్కె. నాకు చిన్నప్పటి నుంచి అలాగే అన్పించేది. నా స్థితిగతుల్తో ప్రమేయం లేకుండా, నన్ను, నా వ్యక్తిత్వాన్ని చూసి ఆకర్షింపబడి అనురాగం చూపే మనిషి కావాలి నాకు. నిన్ను అలాగే గెలుచుకోవాలనుకున్నాను.

ఇక్కడ కూడా నాకు యెదురు దెబ్బ తగిలింది. బామ్మ హఠాత్తుగా మరణించటంతో నేను చేసిన పొరపాటు తెలిసింది. నా అంతట నేను చెప్పలేను. చెప్పటానికి యెలాగో యెన్నిసార్లో శక్తి అంతా కూడ దీసుకుని చెప్పటానికి ప్రయత్నించాను. కాని ప్రతిసారీ దెబ్బతిని కృంగిపోయే వాడిని. రోజురోజుకీ నువ్వు దూరమై పోతావేమోననే భయం నన్ను వెర్రివాడిని చేసేది. చివరికి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నారు. అదే ఆ రోజు రాధ కట్టటానికి వస్తే చెప్పేశాను.

మర్నాడు నాకు అర్జెంట్ గా బెజవాడ వెళ్ళాల్సిన పని తగిలింది. వెళ్ళటం యే మాత్రం యిష్టంలేదు. కాని



నేను వెళ్ళకపోతే ఆ పని జరగదు. పని పూర్తయేసరికి రాత్రి పొద్దుపోయింది. కొద్దిగావాన పడుతోంది. పోనీ ఆ పూట ఆగిపోదామనుకున్నాను. కాని మనసు ఒప్పుకోలేదు. నిన్ను యెప్పుడెప్పుడ[illegible] చూస్తానా అనే ఆత్రం అణుచుకో[illegible]పోయాను. ఆ ఆదుర్దాతో నే బైలుదేరాను. పెళ్ళికి ముందే నీకు చెప్పెయ్యటం మంచిదని కూడా మళ్ళీ అనుకున్నాను. రోడ్డు రాత్రిపూట అవటంవల్ల రద్దీగా లేదు. అందుకే నేను స్పీడ్ పోనియ్యమన్నాను. వెనకసీటులో చేరగిలబడి నీతోకలిసి గాలిమేడలు కడుతున్న నాకు దూరం నుంచి వస్తున్న పెద్ద లారీ కన్పించింది. నా డ్రైవరు కాషన్ యిచ్చి సైడు చూపించాడు. వాడు చేయి చూపించాడు. చూపించినట్టు చూపించి ప్రక్కకు తిరిగాడు. అంతే యేమైందో నాకు తెలియదు.

నాకు మళ్ళీ మెలకువ వచ్చేసరికి హాస్పిటల్లో వున్నాను. నాకంటే తక్కువగా దెబ్బలు తగిలిన డ్రైవర్ నన్నెలాగో తీసుకొచ్చి డాక్టర్ గారికి అప్పచెప్పాడట. అప్పటికప్పుడు హాస్పిటల్లో జేర్పించారు. మోచేతికి మోకాలికి బల[illegible]న దెబ్బలు తగ

లాయి. చెయ్యో కాలో యేదో ఒకటి పూర్తిగా దెబ్బతిని వుంటుందని, అంగవైకల్యం తప్పదని భయపడ్డాను. కాని అదృష్టమో, దురదృష్టమో సవ్యంగానే బైటపడ్డాను. దాదాపు నెల రోజులు హాస్పిటల్లో వున్నాను.

ఈ లోపల నువ్వు లేవు, కన్పించటం లేదన్న వార్త శరాఘాతంలా తగిలింది. నిన్ను ఆఖర్ని చూసింది నాయర్. వాడు కారు వద్దు, బస్సు మీద వెడతాను అని బైలుదేరావని చెప్పాడు. ఇంట్లోంచి బైలుదేరిన నువ్వు వెళ్ళవలసిన చోటు చేరుకోలేదు. మధ్యలో యేమైపోయావో, యెలా మాయమయ్యావో యెవరికీ తెలియదు. ఆ రోజు నువ్వు తనని పెళ్ళి చేసుకోమని అడిగావని, మందలించి వెళ్ళిపోయానని శివరామ్ చెప్పలేక చెప్పలేక చెప్పాడు. నా కప్పుడు చూచాయగా అర్థమైంది. నేను చాలా పొరపాటు చేశానని, నువ్వు పెళ్ళికి యిష్టపడటం లేదేమోనన్న అనుమానం అప్పుడొచ్చింది. కాని యేం చేయాలి! చేతులు కాలిం తర్వాత ఆకులకోసం వెతికిన మూర్ఖుణ్ణి. నీ కోసం అందరూ యెన్ని విధాల వెతకాలో అన్ని విధాలా వెతికారు. నువ్వు చచ్చిపోయావనే నా గాఢ నమ్మకం. గాయాలనుంచి కోలుకుని ఇంటికి వచ్చిన నన్ను నిన్ను గురించిన ఆలోచనలు భయంకరంగా పీక్కుతిన సాగినాయి. నేను పైకి యేమీ అనలేదు. కాని అందరికీ తెలుసు. లోపల నాలో ఎన్ని అగ్ని పర్వతాలు బద్దలవుతున్నాయో!

"నవ్వితే అందరితో కలిసినవ్వు. ఏడవ దల్చుకుంటే యెక్కడన్నా మారుమూలకి పోయి ఒంటరిగా యేడు." అన్న సూత్రాన్ని నేను నమ్ముతాను. అందుకే నా దుఃఖం యెవరికీ పంచదల్చుకోలేదు.

హాస్పిటల్ నుంచి యింటికివచ్చిన నాలుగైదు రోజులకి, అంటే అప్పటికి నువ్వెళ్ళిపోయి దాదాపు నెలమీద వారం కావస్తుంది. కాగితాల కోసం డ్రాయరు తెరిచిన నాకు వాటి అట్టడుగున నీ వుత్తరం కన్పించింది. ఆత్రంగా వుత్తరంచూసి నిశ్చేకారి పోయాను. కోపంతో – అసహనంతో ఒంట్లో రక్తం మరిగి పోయింది. నాయర్ని పిలిచి యిదెప్పుడు వచ్చిందని గర్జించాను. వాడు నాకు తెలియదన్నాడు. వాసుని పిలిచి అడిగితే నిజమేనని – నాకు దెబ్బలు తగిలి హాస్పిటల్‌కి పరుగెత్తే ఆ ఖంగారులో ఆ వుత్తరం డ్రాయరులో పడేసి మర్చిపోయానని ఒప్పుకున్నాడు. నాకింతవరకూ యెప్పుడూ యెవర్నీ కొట్టాలనిపించలేదు. కాని ఆ క్షణంలో వాడిని నిలువునా చీరెయ్యాలనిపించింది.

ఆ రాత్రికి రాత్రి బెంగుళూరు బైలుదేరాను. మనసులో యెగిరెగిరి పడుతున్న ఆశా, నిరాశల మధ్య హొటల్‌కి వచ్చేసరికి నిరాశే గెలిచింది. నిన్ను గురించి వివరాలేం నాకు చెప్పలేక పోయారు. అక్కడే పది రోజులుండి బెంగుళూరు అంతా వెతికాను. చిత్రం యేమిటంటే అప్పుడు ప్రసాద్ దగ్గర కూడా రెండు రోజులున్నాను. కాని అతని తప్పేంవుంది! అతనికేం తెలుసు నేనేపని మీద వచ్చానో! నేను చెప్పలేదు.

బరువైన హృదయంతో హైద్రాబాద్ తిరిగివచ్చేశాను. ఒంట్లో బాగుండక నీ పిలుపు అందుకోలేక పోయానని నీకెలా తెలుస్తుంది; తెలియదు. ఎప్పటికీ తెలియదు. అదే నన్ను వేధించేది.

ఈ మధ్యలో ప్రమీల గొడవ ఒకటి. రేఖారాణి వాళ్ళందరికీ నేనే నిన్ను మీ చుట్టాలింటికి పంపించేశానని చెప్పాను. డాక్టరుగారికి సునందా వాళ్ళకి, శివరామ్ ప్రమీలలకి తప్ప యింకెవరికీ యీ సంగతి తెలియదు.

నువ్వు లేవనే అదను చూసుకుని రేఖారాణి నన్ను మరింత విసిగించడం ప్రారంభించింది. చివరికి నిష్కర్షగా ప్రమీలని చేసుకోనని – నా కప్పటికి అసలు పెళ్ళి చేసుకునే వుద్దేశమే లేదని ఖచ్చితంగా బైట పెట్టేశాను. అలాగయితే కరుణాకరంగారు తన భర్త బిజినెస్‌లోంచి తప్పుకుంటారని బెదిరించింది. 'తప్పుకున్నా వున్నా నాకవసరం లేదు. కొద్దిరోజుల్లో ఈ బిజినెస్‌లో చాలా భాగం బొంబాయిలో ఓ మార్వాడికి అమ్మేస్తున్నా'నని చెప్పాను. రేఖారాణి తెల్లబోయింది. తగ్గి మెత్తగా అనునయంగా అసలు కారణం ఏమిటో చెప్పమని ప్రాధేయ పడింది. 'నీకనవసరం' అన్న ఒక్కమాట కంటే నే నింకేమీ మాట్లాడలేదు.

ప్రమీల కూడా యెదురు తిరిగింది, శివరామ్‌ని తప్ప యెవర్నీ చేసుకోనని. అంత యిష్టం లేకపోతే వాళ్ళ వాళ్ళ దగ్గరకి వెళ్ళిపోతానని బెదిరించింది. శివరామ్ కూడా యిప్పుడు ఫర్వాలేదు, మంచి వుద్యోగంలోనే వున్నాడు. నేనెలాగూ ప్రమీలని చేసుకోనని బైట పెట్టేశాను. కరుణాకరం వాళ్ళు విధిలేక వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోక తప్పలేదు.

ఈ బిజినెస్ విషయంలో మార్పులకోసం కొద్దిగా పనుండి మెడ్రాస్ వచ్చిన నేను చాలా

● "ఏమండీ, ఎడ్వర్టయిజ్‌మెంటువల్ల ఏమన్నా పని జరుగుతుందంటారా?" అన్నాడొక ఆసామీ మరొక వీరాసామితో.

"పని జరగకేం?— బ్రహ్మాండంగా జరుగుతుంది. ఆమధ్య మాకు నైట్ వాచ్‌మన్ కావాలని పొద్దున పేపర్లో వేయిస్తే ఆ రోజే రాత్రి మా యింట్లో దొంగలుపడి ఉన్నదంతా ఊడ్చుకు పోయారు."

— అగ్గి సుబ్[illegible]

రోజుల తర్వాత లక్ష్మిని చూడాలని పించి అక్కడకి వచ్చాను. కాని లక్ష్మి అంత గొప్పగా సగర్వంగా నా సెక్రటరీ, నా సెక్రటరీ అని చెబుతోంది, నీ గురించేనని నాకేం తెలుసు! నన్ను చూసి కూడా నువ్వు మాట్లాడే ప్రయత్నం చేయ లేదు. ఆ రాత్రి నా ప్రక్కగదిలో పిల్లలతోపాటు సుస్తీగా పడుకున్న ఆ అమ్మాయి నువ్వేనని నేను కలలో కూడా వూహించలేదు.

మళ్ళీ వచ్చినప్పుడు లక్ష్మికి వూరికే ఫోన్ చేస్తే ప్రసాద్ వచ్చాడని, యిక్కడే వున్నాడని చెప్పింది. చూడటానికి వచ్చాను. 'లేరు. వాళ్ళంతా కలిసి బీచ్‌కి వెళ్ళారు, వస్తారు కూర్చో' అంది లక్ష్మి. ఆ పూట భోజనానికి వచ్చాను నేనక్కడికి

లక్ష్మి పరిచయం చేస్తున్నప్పుడు తీరా వెనక్కి తిరిగి చూస్తే నువ్వు! నా కళ్ళని నేను నమ్మలేకపోయాను. నాకప్పుడు యేం కన్పించలేదు. విన్పించలేదు. వాళ్ళందరూ వున్నారన్న సిగ్గు కూడా వదిలేసి ఒక్కసారి చేతులు జాచి నిన్ను దగ్గరకి లాక్కుని గుండెలకి హత్తుకోవాలనుకున్నాను

అప్పటికే నువ్వెలాగో అయిపోయావు. నేను ముందుకి అడుగు వేసేలోపలే ప్రసాద్‌వచ్చి నిన్ను పట్టుకోవటం, చకచకా యేదో సంభాషణ జరిగిపోవటం, వెంటనే అతను నేను స్వయంగా చూస్తుండగానే నిన్ను రెండు చేతులతో యెత్తి లోపలికి తీసుకెళ్ళి పోవటం అంతా క్షణంలో జరిగిపోయింది.

ఆ క్షణంలో నేను అనుభవించినంత నరకం నా జీవితంలో ఎప్పుడూ అనుభవించలేదు. ఇక అనుభవించను కూడా.

నిన్ను పడుకోపెట్టిన తర్వాత విజయలక్ష్మి తిరిగివచ్చి ప్రసాద్, నువ్వు పరస్పరం ప్రేమించుకున్నారని పెళ్ళి చేసుకోబోతున్నారని చెప్పింది. నేను వెంటనే మరోమాట చెప్పకుండా చెప్పేందుకు లక్ష్మికి అవకాశం యివ్వకుండా వచ్చేశాను. ఇంకా కొద్ది క్షణాలు అక్కడుంటే యీర్ష్యతో మండుతున్న నా మనసు నన్ను ఏ వెర్రి పనులవైపు పురిగొల్పుతుందోనని నాకే భయం వేసింది. మద్రాసు వాతావరణమే భయంకరంగా అన్పించింది. ఆ గాలే నాకు అసహ్యం వేసింది. ఒక్క క్షణం అక్కడ వుండలేక పోయాను. ఉంటే వెనక్కు తిరిగి యే నిమిషం లక్ష్మి యింటికి పరుగెత్తాలనే ఆకాంక్షకి నేను లోబడి పోతానేమోనని భయం వేసింది. అప్పటికప్పుడు ఏరోడ్రోమ్‌కి వచ్చి ప్లేన్‌లో హైద్రాబాద్ వచ్చేశాను.

ఇప్పుడు మనిద్దరి మధ్యా కొన్ని వందల మైళ్ళ దూరం వుంది. నన్నెలాటి బలహీనతలు పిచ్చివాడిని చేసి నీ దగ్గరకి వెళ్ళమని పురిగొల్పినా నేను వెళ్ళలేను. నిన్ను చేరుకోలేను. నేను కోరుకున్నది కూడా అదే.

క్రమేపీ చల్లబడ్డాను. నా భావాలు నేను నిగ్రహించుకోటానికి చేసిన ప్రయత్నంలో విజయం పొందాను. నిన్ను నీ జీవితానికి వదిలేయటానికి నిశ్చయించుకున్నాను. నువ్వెలా పరిచయమో తెల్పమని ప్రసాద్ కి వుత్తరం వ్రాశాను. అతను వివరంగా ప్రకాశం సంగతి అంతా తెలియజేస్తూ నాకు వుత్తరం వ్రాశాడు. ఆ క్షణం వరకూ భగవంతుడి సాక్షిగా నువ్వు ప్రకాశంతో వెళ్ళిపోయావని మా కెవ్వరికీ తెలియదు. అప్పుడెప్పుడో శివరామ్, డాక్టరు గారూ వాళ్ళందరూ ప్రకాశం బెంగుళూరులో కలరాతో మరణించాడని చెప్పుకుంటుంటే విన్నట్టుగుర్తు. అంతవరకే తెలుసు నాకు. అదీ జరిగిన సంగతి.

మనిద్దరిలో నీపొరపాటో నాపొరపాటో ఒక అఘాతం సృష్టించుకోవటం జరిగింది. ఇది యేర్పడిందన్న బాధ నాకు లేదు. నేను ఈ చివరినుంచి చేతులుజాచి నిన్ను అందుకోగలను. కాని నువ్వు వాటిని అందుకోటానికి యిష్టపడవు. ఆసంగతి నాకు తెలుసు. ఓ విధంగా నువ్వు చాలా అదృష్టవంతురాలివి. ప్రసాద్ లాటివాళ్ళతో నీకుఆపరిస్థితుల్లోపరిచయం కలగడం కేవలం అదృష్టంతప్ప యింకేం కాదు.

జయంతీ! ఇప్పుడు నాలో బాధ కాని, కోర్కెగాని, దిగులుగాని, అలాటివేవీ లేవు. నేనెప్పటికీ నీవాడనే! నీ యిష్టం, నన్ను నీస్నేహితుడుగా తీసుకో, తండ్రిగా చూసుకో లేకసోదరుడిగా భావించుకో, ఎలా అయినా సరే! నీకు నచ్చిన విధంలో నీ ఆప్తుడిగా జీవితాంతం నీకు మిగలటానికి సిద్ధంగా వున్నాను. నానుంచి నీకు యివ్వటం తప్ప నీనుంచి నేనేం కోరను. నా యింటి తలుపులు నీ కెప్పుడూ తెరిచే వుంటాయి. నీకు పుట్టిన పిల్లలు నా ఆస్తికి వారసులవుతారు. నీ పిల్లల్ని దగ్గరకి తీసుకుని వాళ్ళలో నిన్ను చూసి వాళ్ళ ప్రేమానురాగాల్లో నిన్ను పొందగలుగుతాను. దీనివల్ల నీకేం నష్టం లేదు. నీతో యిలా నేను రాజీపడటంకంటే నా కింకో మార్గం లేదు. కారణం యేమిటని నువ్వడిగితే - నా మనసులో నువ్వు ఏర్పరిచి పోయిన యీ శూన్యాన్ని పూడ్చుకోవాలంటే నా జీవితం చాలదు. నా కంత శక్తి లేదు. అందుకే నేనే రాజీ పడుతున్నాను. నీకు నే నవసరంలేదు. కాని నాకు నువ్వు కావాలి. దానివల్ల నీకేం నష్టం కలగకుండా నా జీవితాన్ని సరిదిద్దుకుంటాను.

జయంతీ! యుగయుగాలుగా కవులు వర్ణించి, మనుష్యులు అపురూపంగా భావించే యీ ప్రేమ చాలా విచిత్రమైంది. ఇది మనుష్యులకి ఆకాశం అంత విశాలమైన హృదయం యివ్వగలదు. సూదిబెజ్జమంత స్వార్థంగా మారిపోగలదు. కావాలనుకుంటే స్వర్గం చూపిస్తుంది. వద్దంటే భయంకరమైన నరకంలో చిత్రహింస చేస్తుంది. గులాబీ రేకుకంటే మృదువుగా మారి హృదయాన్ని సేదదీర్చే యీ ప్రేమే వాడి ముల్లులా దాన్ని గుచ్చి చిల్లులు పొడవగలదు. ఎంతగా యెవరు చెప్పినా, యిది యేమనిషికైనా స్వానుభవంలోకి వస్తేగాని యీ అనుభూతులు తెలియవు. మొట్టమొదట ప్రసాద్ చేతుల్తో నిన్ను పైకి తీసుకెళ్ళిపోతుంటే అతన్ని హత్య చెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఇప్పుడు నా కదేంలేదు. అతనంటే యెలాటి ద్వేషంలేదు. పైనుంచి నీ ప్రేమని పొందిన వ్యక్తిగా అభిమానిస్తాను.

నువ్వు సుఖపడాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను. జయంతీ! నిన్ను పోగొట్టుకోవటానికి కారణం నేనే అని నాకు తెలుసు. ఈ బాధ మటుకు నన్ను జీవితాంతం వదలదు. కాని నన్ను చూసి భయపడాల్సిన అవసరం నీకు లేదు. అది నమ్మమని అడుగుతున్నాను.

మీ పెళ్ళికి రావాలనివుంది. వద్దనివుంది. ఇంకా మనసులో ఏ మూలో చల్లారనివేడి కొద్దిగా వుంది. అది పూర్తిగా తగ్గిపోతే వస్తాను. లేకపోతే రాను. ఇది నువ్వు సహృదయంతో అర్థంచేసుకో. కానీ— ఇలా నేను వెళ్ళిపోయేముందు ఒక్కసారి చూస్తాను. చూసి తీర్తాను. అప్పుడు భయపడకుండా చనువుగా మాట్లాడు. అది మర్చిపోకు.

నన్ను నువ్వెలాగైనా తీసుకో! నువ్వుమాత్రం నాకు జీవనజ్యోతివి. ఆప్తురాలివి ఒంటరిసమయంలో సదా వెంటవుండే కన్పించని తోడువి.

ఉంటాను,

ఆశీర్వచనములతో,

శేఖరం.

పి.ఎస్.: ఈ వుత్తరం ప్రసాద్ కి చూపించటం అవసరమనుకుంటే చూపించు. నా కభ్యంతరంలేదు. నిన్నుగురించి అతన్ని ఆరోజు అంత ఆత్రంగా ఎందుకు వివరాలు అడిగానో అతనికి అర్థం అవుతుంది.

• • •

ఉత్తరం చదవటం పూర్తయేసరికి జయంతి చెంపలమీద కన్నీళ్ళు కాల్వలు కడుతున్నాయి. శేఖరం! ఆ పేరే యిప్పుడు కొత్తగా వుంది! ఇందుకేనా అతను అన్నిసార్లు ఉత్తరం చూడలేదా చూడలేదా అని పదిసార్లు రెట్టించి అడిగాడు! భగవాన్! తనకేం తెలుసు. నిజంగా యిదంతా యెప్పుడో చెప్పాల్సింది. చెప్పకపోవటం అతని పొరపాటే! లేదు లేదు. చెప్పలేదూ! 'కేవలం నా స్థితిగతులు చూసికాదు. నన్ను, నా వ్యక్తిత్వాన్ని చూసి ఆకర్షింపబడినమనిషి నాకు కావాలి' అని. అదేఅతని వుద్దేశ్యం అయితే అగసే గెల్చాడు ఈ వుత్తరం చూడక ముందేగా తను వచ్చేసింది. ఇంగుంటికి చాలా సేపటి వరకూ అసలు

ఆ మంచం మీదనుంచి లేవాలనే అన్పించలేదు. ఒక్కరోజు రావటం ఆలస్యం అయితే - ఒక్క 24 గంటలు దూరంగా వుంటే, శేఖరం శాశ్వతంగా దూరమై పోయేవాడు

"వాసూ! నాయర్ని యిక్కడికి పిలు-" ముందుగదిలో శేఖరం మాట విన్పించింది. జయంతి చప్పున లేచి వుత్తరం తీసి దిండుక్రింద దాచేసింది. తను వెంటనేవచ్చి అద్దంముందు నిలబడి తల దువ్వుకోవటం ప్రారంభించింది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. శరీరం, మనసుయేకమై అతని కోసం అణువణువు ఆత్రంగా యెదురు చూస్తున్నాయి. ఇప్పుడు కన్పించబోయే శేఖరం వేరు. పూర్తిగా వేరు.

శేఖరం గదిలోకివచ్చి కోటువిప్పి కుర్చీమీద గిరాటేసి కూర్చుని బూటు విప్పుకోవటం ప్రారంభించాడు.

"ఇంకా నువ్వు తయారు కాలేదూ! ఏం చేస్తున్నావు యింత వరకూ! ఓ అరగంటలో వాళ్ళందరూ వస్తున్నారు—"

"ఎవరెవరు!-" తన గొంతు తనకే కొత్తగా విన్పించింది.

"డాక్టరు గారు, కామేశ్వరమ్మ గారు, శివరామ్, ప్రమీల, సునంద భర్త- పిల్లలు- నీ ఆప్తులంతా—"

జయంతిని అతను దగ్గరకి పిలవలేదు. అతని దగ్గరగా వెళ్ళాలనే కోర్కెని అణుచుకోవటం సాధ్యం కావడం లేదు.

"అన్ని ఏర్పాట్లు జరిగిపోయినాయి రేపురాత్రి బైలుదేరి ముందు సరాసరి తిరుపతి వెళ్ళటం—" శేఖరం ఆగిపోయాడు.

"వెళ్ళి?—" కుర్చీమీద పడేసిన అతని కోటు చేతిలోకి తీసుకుని చూస్తూ అంది.

"వెళ్ళి?—" జయంతి గొంతును అనుకరిస్తూ వెక్కిరిస్తూ నవ్వాడు.

జయంతి నిశ్శబ్దంగా అతనికోటుని తీసుకెళ్ళి హేంగర్‌కి తగిలించింది.

"వెళ్ళి—తర్వాత అక్కడనుంచి దేశయాత్ర! విసుగుపుట్టేవన్నిరోజులు. నువ్వు ప్రయాణం చెయ్యలేక—ఇల్లో యిల్లో అని గోలపెట్టేంత వరకూ—" శేఖరం వాక్యం పూర్తి చేయలేడు. మెల్లగా జయంతి వెనక నుంచి వచ్చి అతని మెడచుట్టూ చేతులువేసి భుజంమీద తల ఆన్చుకుంది.

"ఓ! దీని భావమేమి తిరుమలేశ!—" జయంతి తన మీదికి వంగటంతో ముందుకు పడిన పొడుగాటి జుట్టుని చేతిలోకి తీసుకుని గుప్పెట్లో పట్టి చూస్తూ అన్నాడు.

వెనకనుంచి సమాధానం రాలేదు.

"చెప్పు. యేమిటి? మళ్ళీ మూడ్ మారిందా? మెడ్రాసు వెళ్ళిపోవాలనుకుంటున్నావా?—" చేయి జాచి జయంతిని భుజంపట్టి తన ముందుకి లాక్కుంటూ అడిగాడు.

క్షణంసేపు ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. జయంతి రెండు కళ్ళ నిండా నీళ్ళు నిండివున్నాయి.

"మైగాడ్! జయంతీ!—" శేఖరం ఆదుర్దాగా చూశాడు.

జయంతి చప్పున అతని గుండెల్లో మొహం దాచుకుంది.

"ఏమిటి? ఏమైంది?" ఖంగారుగా అడిగాడు.

"మీరు - మీరు నాకెందుకు చెప్పలేదు"

"ఏమిటి? - ఏం చెప్పలేదు."

"అదే! ఈ రోజు వుత్తరం చూసిం తర్వాత తెలిసింది—"

"ఉత్తరమా?—"

మీరు మెడ్రాస్‌కి పోస్ట్‌చేసిన వుత్తరం ఈరోజున తిరిగి వచ్చింది-"

"జయంతీ!" శేఖరం పెదవులు అస్పష్టంగా పలికాయి వెంటనే జయంతిని భుజాలు పట్టి మోచేతి దూరంలో నిలబెట్టికళ్ళలోకి పరీక్షగా దేన్నో వెతుకుతున్నట్టు చూశాడు.

"మీరే గెల్చారు." కన్నీళ్ళమధ్య మనోహరమైన చిరునవ్వుతో అంది. శేఖరం యింకా అలాగేచూస్తున్నాడు.

జయంతి కళ్ళు మెల్లగా కిందికి వాలిపోయాయి.

"కాని - కాని - నేనలా వెళ్ళిపోవటమే మంచిదైంది. లేకపోతే యెప్పటికీ మీ విలువ తెలిసేది కాదేమో!—"

"నీ మొహం. కేవలం అదృష్టం తోడుగా వుండటంవల్ల ఎక్కడికి వెళ్ళినా జాగ్రత్తగా నాదగ్గరకి తిరిగి వచ్చావు. ఒకవేళ ప్రకాశమే బ్రతికుంటే—"

జయంతి శరీరం భయంతో జలదరించింది.

"నిజం!" అంది ఒప్పుకుంటున్నట్టు.

జయంతి మనస్సులో భయాన్ని గుర్తించిన శేఖరం దగ్గరకి లాక్కుని "నువ్వుగాడు. నేను అదృష్టవంతుడిని. లేకపోతే నా శేషజీవితం అంతా ఆ వేదనతో—మతి చలించినట్టు పిచ్చివాడిలా బ్రతకాల్సివచ్చేది. ఇప్పుడు చల్లని వెన్నెలలా అహ్లాదం ఇస్తున్న యీ మనశ్శాంతి అప్పుడు దూరంగా పారిపోయి ఎండమావిలా వెక్కిరించేది" అన్నాడు.

జయంతి సమాధానం చెప్పలేదు. మౌనంగా అతని భుజంమీద తల ఆన్చుకుని తృప్తితో కళ్ళు మూసుకుంది.

సమాప్తి



అంకితం: పాఠకులకు

ఇదింతే

క్లారు పోర్టికోలో ఆపి, తలుపు తీసు కుని, సీటుమీద వేసిన కోటు అందుకుని తోకాడించుకుంటూవచ్చిన 'రాజా' తల నిమిరి, డ్రాయింగ్ రూమ్‌లోకి ప్రవేశించాడు శంకరం. కోటుసోఫాచేతిమీదవేసి, 'టైనాట్' వదులుచేసుకుని, 'షూ లేసెస్'విప్పి, సిగార్ ముట్టించాడు. మెల్లిగా పొగ వదులుతూ,కళ్లుమూసుకుని సోఫాలో పడుకున్నట్టుగా జేరబడ్డాడు. మెల్లి మెల్లిగా గాలిలో కలిసిపోతోంది పొగ. కొంతసేపయ్యేసరికి ఏదో వెలితిగా అనిపించింది. ఏమిటో ముందు అర్థంకాలేదు. కళ్ళుతెరిచి కూర్చున్నాడు. హఠాత్తుగా తెలిసింది ఆ వెలితికి కారణం. లేచి తిన్నగా కూర్చున్నాడు.

ప్రతిరోజూ అతను డిస్పెన్సరీ నుంచి రాగానే, కోటు అందుకుని మంచినీళ్ళిచ్చి, పొగలు కక్కుతున్న కాఫీ అందించేది కామాక్షి. కాని యీ రోజు... ...అతనువచ్చి ఐదు నిమిషాలైంది... ...ఐనా కామాక్షి రాలేదు అతని ఇరవైరెండేళ్ళ వైవాహిక జీవితంలో యీ విధంగా ఎన్నడూ జరగలేదు. లేచి చుట్టూ చూశాడు. లోపలి 'గార్డెన్' లో అలికిడవుతే అక్కడికి వెళ్ళాడు. అక్కడ పదహారేళ్ళ లలిత ఏదో పుస్తకం చదువుతోంది. పనిమనిషి మొక్కలకి నీళ్ళు పడుతోంది. కామాక్షి ఏమయిందో అతనికి అర్థంకాలేదు.


'లల్లూ' అని పిలిచాడు.

లలిత వులిక్కిపడింది. తండ్రిని చూసి, 'హల్లో డాడీ! గుడీవినింగ్' అంది.

'మమ్మీ ఏదీ?' అన్నాడు.

'ఏదో మీటింగుట. వెళ్ళింది' అంది లేస్తూ.

మన్ మోహన్ సహాయ్



'ఆఁ!' అన్నాడు అర్థంగాక.

'లేడీస్ క్లబ్‌లో ఏదో మీటింగ్ వుందట. 'బోర్‌గా వుంది. వెళ్తాను. ఎనిమిదవుతుందేమో' అంది. నన్ను కూడా రమ్మంది. నే వెళ్ళలే' అంది.

'ఓ' అంటూ డ్రాయింగురూములోకి వచ్చాడు శంకరం. నీరసంగా సోఫాలో సాగిలపడ్డాడు. 'రాజా' తోకాడించుకుంటూ సోఫా సమీపంలో అతని చేతికి దగ్గరగా కూర్చుంది. మెల్లిగా దాని తల నిమిరాడు.

'బోర్‌గా వుంది వెళ్తాను' అని కామాక్షి లలితతో అన్న మాటలు అతనిలో మూల మూలలన్నీ కదిల్చాయి.

కామాక్షి కొత్తగా కాపురానికి వచ్చిన రోజులు. పల్లెటూళ్ళో డాక్టరుగా వేశారు శంకరాన్ని. ఆస్పత్రి పని ఎక్కువగా వుండేది కాదు. సాయంకాలం అతను వచ్చేసరికి కాఫీ తయారుచేసి వుంచేది కామాక్షి. చిక్కని కాఫీ [illegible] అతనికిష్టం. [illegible]

లేమో, పొదుగులో పాలే దొరికేవి. ఈ దీగాక ఆపాలు డాక్టరు బాబుగారికి. ఆ కాఫీ త్రాగుతూ, లోపలి దొడ్లో మొక్కల మధ్య కూర్చుని కబుర్లు చెప్పుకునే వారు యిద్దరూ. తెలియకుండానే కాలం గడిచి పోయేది.

"ఇలా సాయంత్రపు వేళ ఈ మొక్కలమధ్య కూర్చుని మీతో కబుర్లు చెపుతూ ఎన్ని జన్మలైనా గడపగలను" అనేది కామాక్షి.

ఆ తలంపుతో శంకరం హృదయం సన్నగా మూలిగింది.

అలా ఆ జీవితం మూడు సంవత్సరాలు గడిచింది. తర్వాత అతను విదేశాలకి వెళ్ళాడు పై చదువులకి. రెండు సంవత్సరాల తర్వాత విజయవంతుడై తిరిగి వచ్చాడు. అతని విజయానికి కారణం కామాక్షి అనక తప్పదు ఆమె వ్రాసే ప్రతీ ఉత్తరం అతనిలో ఉత్సాహాన్ని నింపేది. ఆమె చెంత లేదే అన్న చింత కలగకుండా చేసేవి ఆమె వ్రాసే వుత్తరాలు. అతను విదేశాల నుంచి తిరిగి రాగానే హైద్రాబాదులో పెద్ద ఉద్యోగమయింది ఇప్పుడు శంకరం సొంతంగా 'డిస్పెన్సరీ' నడుపుతున్నాడు.

అతను చేపట్టిన ఏ కేసు విఫలం కాదని జనవాక్యం. అతని దగ్గిరికి వచ్చే రోగులు 'బాబూ, మీరే ఈ జబ్బు నయం చేయగలరు. ఇంకెవ్వరిమీదా మాకు నమ్మకం లేదు' అని అన్నప్పుడు, అతని కళ్ళలో అతనికి తెలియకుండానే గర్వం నర్తించేది.

ఒంటరిగా కూర్చున్నప్పుడు తన జీవితాన్ని గుర్తుకు తెచ్చుకుని ఆనంద పడటం అతనికి అలవాటు. తనవంటి అదృష్టజీవి మరొకడుంటాడని — ఉన్నాడని అంటే, అతను ఒప్పుకోడు. అన్ని విధాలా తనని అర్థం చేసుకుని, తన అభిరుచుల కనుగుణంగా నడుచుకుంటూ, పనితో అలసి వచ్చే తనకి ఉత్సాహాన్ని, ఆనందాన్ని ఇచ్చి, సంసార జీవితంలో ప్రతిక్షణం నూతనత్వాన్ని చూపించే కామాక్షిలాంటి భార్య, తన తర్వాత తన ప్రాక్టీసు అందుకోవడానికి సిద్ధమవుతున్న మధులాంటి కొడుకు; అందానికి, గుణానికి తల్లికి తీసిపోని లలితలాంటి కూతురును పొందగలిగే భాగ్యం ఈ ప్రపంచంలో తనదే అని అతని విశ్వాసం. ముచ్చటైన సంసారం తమది, ఆదర్శ ప్రాయమైంది అని, అనుకుంటాడతను.

కాని ... ఇన్నాళ్ళుగా తను ఊహిస్తూ వచ్చింది పొరపాటేమో అనిపించింది శంకరానికి. తన హృదయాన్ని ఎవరో బిగించి పట్టినట్టుగా అయింది అతనికి. అతను కాలుస్తున్న 'సిగార్' రుచిపోయి చప్పగా తయారయింది. దాన్ని 'ఏష్ట్రే'లో నలిపి పారేశాడు. 'రాజా' తల పైకెత్తి, అతనివేపే చూసి తోకాడించింది.

'డాడీ, కాఫీ' అంటూ వచ్చింది లలిత.

"అక్కడ పెట్టమ్మా" అన్నాడు.

టేబుల్ మీది న్యూస్ పేపరు తీసి, కాఫీ కప్పు వుంచి వెళ్ళిపోయింది లలిత. కాఫీ కప్పు తీసుకుని, కప్పులోంచి వస్తున్న ఆవిరులను చూస్తూ వుండిపోయాడు.

అలా కాఫీ యిచ్చి పక్కన కూర్చుని కబుర్లు చెప్పేది కామాక్షి.

రోజూ మత్తెక్కించే కాఫీ వాసన వెగటుగా అనిపించింది. కడుపులో వికారం పెట్టినట్టుగా అయింది కాఫీ త్రాగకుండానే మధ్యనున్న బల్లమీద పెట్టేసి, మరో సిగార్ వెలిగించి వెనక్కి జేర్లబడి కళ్ళుమూసుకున్నాడు. ముందరి రెండుకాళ్ళు ఒక దానిమీద ఒకటివేసి ముట్టె ఆనించి యజమాని కసి చూస్తోంది 'రాజా.'

'బోర్‌గా వుంది. వెళ్తాను' అని కామాక్షి అన్నమాటలే శంకరానికి వినిపిస్తున్నాయి.

సాధారణంగా కామాక్షి ఎక్కడికీ వెళ్ళదు. అందులో అతను యింటికి వచ్చే సమయంలో ఎప్పుడూ వెళ్ళదు. ఇంటిపని చూసుకోవడమన్నా, అతని విషయాలు చూస్తూ వుండడమన్నా వుండే ఆసక్తి — ఆమెకి మిగతా విషయాలలో లేదు. అతని బలవంతం మీదే లేడీస్ క్లబ్‌లో మెంబరుగా చేరింది. రెండు మూడుమార్లు ప్రెసిడెంటుగా వుండమని క్లబ్ వాళ్ళు అడిగినా కాదంది. 'ఫంక్షన్స్' వున్నా వెళ్ళేదికాదు. అటువంటిది యీరోజు వెళ్ళింది.

తనమీద తనకే కోపం, విసుగు, జాలికలిగాయి శంకరానికి.

'పాను ఆమెకి మటుకు ఏం తోస్తుంది! ఏదోవిధంగా కాలక్షేపం జరగాలిగా' అనుకున్నాడు కాని, ఆ సమాధానం అతనికే రుచించలేదు.

పొద్దుటే ఎనిమిదింటికి 'డిస్పెన్సరీ'కి వెళతాడు మధ్యాహ్నం ఒంటిగంటకి వచ్చి భోజనంచేసి, వెంటనే వెళిపోతాడు. ఒక్కొక్కప్పుడు అక్కడికే భోజనం తెప్పించుకోవడం కూడా కద్దు సాయంకాలం డిస్పెన్సరీ నుంచి వచ్చి ఒక గంటసేపు కూర్చుని 'క్లబ్'కి వెడతాడు. పదింటికి వస్తాడు. ఇది అతని దినచర్య. ఆ కుటుంబంలో అందరూ కలుసుకోవడం వారంలో ఏ ఒకటి, రెండు సార్లలో జరుగుతుంది.

శంకరం పెదవులమీద పేలవంగా ఒక నవ్వు తొలగి పోయింది.

పోర్టికోలో స్కూటర్ చప్పుడయింది. 'రాజా' బయటికి పరిగెత్తి గంతులేస్తూ లోపలికొచ్చింది. వెనకాలే టెన్నిస్ రాకెట్ ఊపుకుంటూ మధు వచ్చాడు.

"గుడీవినింగ్ డాడీ" అంటూ లోపలికెళ్ళి పోయాడు.

శంకరం కూడా విష్ [illegible] కాని ఎందుకో [illegible] బోయాడు అతనిలో [illegible]

మూల పొడిచినట్లు గా అయింది. కామాక్షిమీద జాలేసింది.

టైమ్ చూసుకున్నాడు. అయిదు ఇరవై.

రోజూలా ఈ ఒక్క రోజు కామాక్షి లేక పోయేసరికి ఆమె లేక పోవడం తనని ఇంత బాధ పెట్టిందే- ఇన్నేళ్ళుగా ఆమె ఒంటరితనాన్ని ఎలా భరించగలిగింది' అనుకున్నాడు.

నీరసంగా లేచి బెడ్‌రూములోకి వెళ్ళాడు. మంచం మీద నుంచి వేళ్ళాడుతున్న చీరె, జాకెట్ కనిపించాయి అతనికి. అప్రయత్నంగానే వాటిని ముట్టుకున్నాడు. అప్పుడే విడిచినట్లుగా, వెచ్చగా వున్న ట్లనిపించాయతనికి. అనాలోచితంగానే 'కామూ' అనుకున్నాడు. అతని వేళ్ళు ఆ ఉడుపుల్ని లాలించాయి.

అతను రాత్రుళ్ళు — ముఖ్యమైన ఆపరేషన్లు చేసిగాని, క్లబ్బునించి కాని—అలిసిపోయి, అలస్యంగా వచ్చి ఎలాగో భోజనంచేసి, పరుపుమీదకి చేరినప్పుడు; కామాక్షి అతని సరసనజేరి, గోముగా తల నిమిరేది. ఇప్పటికీ అంతే. అతను మెల్లిగా ఆమెను పెదవులతో లాలిస్తే చాలు పారవశ్యం చెందేది.

కళ్ళలో నీళ్ళు తిరిగినట్టయి తుడుచుకోబోయాడు. పొడిగానే వున్నాయి. ఎటు కదిలినా సూది మొనలు గుచ్చుకునే బోనులో బంధించిన వాడిలా విలబడి పోయాడు. గాలికి 'కర్టెన్స్' రెప రెప లాడాయి. నీరసంగా అతని మనస్సు నిట్టూర్చింది. చీరని, జాకెట్టుని పక్కకి తొలగిస్తూ, జోళ్ళు జారవిడిచి మంచంమీద వ్రాలాడు.

అతనికి కామాక్షిమీద జాలేసింది. తనమీద తనకే జాలేసింది.

"అవును ఎలా తోస్తుంది కామాక్షికి!" అనుకున్నాడు. పెళ్ళయిన తర్వాత మూడు సంవత్సరాలు, విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఒక సంవత్సరం, తను ఇంట్లో ఎక్కువగా కాలం గడిపింది. తర్వాత— ఏముంది. రాత్రి నిద్రపోయేటప్పుడు తప్ప ఎప్పుడూ ఒక గంటుమించి ఎక్కువకాలం గడపలేదు. పిల్లలతో మాట్లాడుకునే విషయాలు ఏముంటాయి కామాక్షికి! అసలీ వయస్సులోనే భార్యా-భర్తలు ఒకరి కొకరు సన్నిహితంగా వుండాలని కోరుకునేది.

లలితకి పుస్తకాలపిచ్చి, మధుకి స్పోర్ట్సు-సొసైటీ. మరి కామాక్షికి కాలక్షేపం ఎలాగ? ఎంతసేపని యింటిపనులు చూసుకుంటుంది? అక్కడికీ "కుక్"నికూడా మాన్పించేసింది. ఐనామటుకు ... ...ప్చ్. లాభంలేదు. ఏవిధంగా కామాక్షికి సమయం గడుస్తుంది? ఎక్కడికీ వెళ్ళదు. ఈ రోజు క్లబ్‌కి వెళ్ళిందిగా... ...ఇన్నేళ్ళకి యీరోజు వెళ్ళింది. ఐనా అక్కడ ఎంతసేపని వుంటుంది ఎక్కువగా సొసైటీలో తిరిగే స్వభావంకాదు... పాపం! అనుకున్నాడు.

ఒకసారి, ఆదివారం పిక్‌నిక్‌కి వెళ్దాం రెడీగా వుండమని చెప్పాడు. పాపం అన్నీ సిద్ధంచేసుకుంది కామాక్షి. శనివారం రాత్రి క్లబ్ నించి తిరిగి వస్తూ "సారీ కామూ. రేపు నేను మీటింగ్‌కి 'ప్రిసైడ్' చెయ్యాలి. ఇంకోసారి వేసుకుందాం. తప్పకుండా" అన్నాడు. అప్పుడు నిజంగా ఎంత బాధపడిందో! ఇలా ఎన్ని ప్రోగ్రామ్స్ కాన్సిల్ చేశాడు తను. ప్రతీసారి ఆమె చాలా బాధపడి వుంటుంది. ఛ ఛ. ఇంతకాలం నేను గుర్తించలేకపోయాను.' అనుకున్నాడు.

అతనిమీద అతనికే చిరాకు కలిగింది.

లేచి కాల్తున్న సిగార్ కిటికీలోంచి విసిరేశాడు. తిరిగి వస్తూ మంచం మీద ఆమె వదిలిన చీర, జాకెట్టు చూశాడు. అనుకోకుండానే ముట్టుకున్నాడు. ఇంకా వెచ్చగానే వున్నట్టున్నాయి. అనాలోచితంగానే ముఖం పక్కకి తిప్పుకుని మంచం మీద వ్రాలాడు, నుదుటిమీద అర చెయ్యి ఆనిస్తూ. నుదురు వెచ్చగా వుంది. జ్వరం వచ్చినట్టుంది. కణతలు రాసుకున్నాడు.

ఇలా అతను ఎప్పుడైనా పడకేస్తే కణతలకి అమృతాంజనం పట్టించి, మెల్లిగా రాస్తూ కూర్చునేది కామాక్షి. ఏవో కబుర్లు చెబుతూ బాధని మరపించేది.

నిట్టూర్చాడు శంకరం.

ఇంతకాలం కేవలం మూర్ఖుడిలా ప్రవర్తించాడు తను. ఇక నుంచి తన అలవాట్లు మార్చుకోవాలి. సాధ్యమయినంత వరకు ఇంట్లోనే కాలం గడపాలి. డిస్పెన్సరీ నుంచి తిన్నగా ఇంటి కొచ్చెయ్యాలి.

అలా అనుకోవడంలో ఏమిటో సంతృప్తి కలిగింద అతనికి.

మెల్లిగా లేచి అద్దంముందు నిలబడి చూసుకున్నాడు. ముఖంలో అక్కడక్కడ చెదురు మదురుగా ముడతలు కనిపించాయి. నల్లజుట్టు తెల్లజుట్టుతో కలిసి పోతోంది.

"వయస్సు ముదిరి పోతోంది" అనుకున్నాడు.

ఇకనుంచి క్లబ్ మానేసి కనీసం సాయంకాలాలు ఇంట్లోనే గడపాలి. పెళ్ళైయిన కొత్తలోలా దొడ్లో పూల మొక్కలమధ్య తనూ కామాక్షి కూర్చుని కబుర్లు చెప్పుకోవాలి అనుకున్నాడు.

ఒక మందహాసం అతని గొ దోబూచులాడింది.

అలా అనుకుంటే నూత్న యౌవనం వచ్చినట్టుగా వుందతనికి.

'కామాక్షి రాగానే చెప్పేస్తాను' అనుకున్నాడు హుషారుగా.

కిటికీ దగ్గర నుంచుని కిటికీని అల్లుకున్న స్వర్ణ గన్నేరు తీగని, తీగనున్న పువ్వుల్ని చూస్తూ నుంచున్నాడు.

పోర్టికోలో కారాగిన చప్పుడయింది. కామాక్షిమాటవినిపించింది.

గబగబా వచ్చాడు శంకరం.

కామాక్షి లోపలికి వస్తోంది. అలా తొందరగా తనని సమీపిస్తున్న అతన్ని చూడగానే, ఆమె కళ్ళలో సంతృప్తి మెరిసింది. చిన్నగా నవ్వింది. అతనూ నవ్వాడు.

'ఏం కామూ. తొందరగా వచ్చేశావ్. ఎనిమిదింటి వరకు వుందిగా' అన్నాడు.

'ఊరికెనే' అంది.

'ఎలావుంది మీ క్లబ్' అన్నాడు.

'పదిహేను రోజుల్లో క్లబ్ కమిటీని ఎన్నుకుంటారుట' అంది బెడ్‌రూములోకి నడుస్తూ.

'నిన్ను దేనికన్నా వుండమన్నారా?' అన్నాడు.

తాపీగా వుంది అతనికి.

'కమిటీ మెంబరుగా వుండమన్నారు. నేనేమీ మాట్లాడలేదు' అంది అతనికేసి చూస్తూ.

'ఒప్పుకో. కాలక్షేపంగా వుంటుంది' అన్నాడు.

'చూద్దాం లెండి' అంది.

సిగార్ ముట్టించి అలవాటుగా వాచీ చూసుకున్నాడు. ఆరుంబావు.

'ఓ ఆరుంబావు' అనుకుంటూ 'షూస్' తొడుక్కుని 'టైనాట్' సరిచేసుకుని డ్రాయింగు రూములోకి వచ్చాడు. వెనకాలే కామాక్షి వచ్చింది.

ఆమె కళ్ళలో అసంతృప్తి, ముఖంలో చిరాకు, నిరాశ కనిపించాయి.

'ఏమండీ యివాళకూడా ఎక్కడికండీ?' అంది కోటు నందుకుంటున్న అతని చెయ్యి పట్టుకుంటూ.

'ఇంకెక్కడికి, క్లబ్‌కి. అప్పుడే ఆరూ యిరవై' అంటూ ఆమె బుగ్గమీద చిటికేసి పోర్టికోలోకి పరిగెత్తాడు.

టేబుల్‌మీద కప్పులో నిండా చల్లారిపోయివున్న కాఫీకేసి, కారు స్టార్టుచేస్తున్న శంకరంకేసి అయోమయంగా చూసింది కామాక్షి.

జాలి, విషాదం, నిరాశ, ఆశ్చర్యం అన్నీ మిళితమైన నవ్వొకటి ఆమె పెదాలమీద మొలిచి అణిగిపోయింది.

□□□

చిత్రరంగుని

చైత్రయాత్ర

తోడూ నీడా

తోడూనీడా లోనే జీవిత మాధుర్యం వున్నది. పాలూ చక్కెర వంటివి తోడూనీడా. గోపీ (రామారావు) రాధ (జమున) ఒకరికొకరు తోడూనీడా, పాలూ చక్కెర. తుదకు రాధ 'అస్థిరమైన నీడే' అయింది; పెంచిన పాపను మదవృషభం పొడవబోతే అడ్డువెళ్ళి, ఆ పోటు తను తిని, తనువు చాలించింది. గోపీ కిక సుఖపు విలువకు 'నీడ' లేదు. పూర్వపు నీడ (రాధ) క్రీనీడయి (మరువలేని విషాద స్మృతి అయి) బాధించింది; వేధించింది; మానసికంగా వధించింది.

కాని జీవితానికి తోడూ నీడా తప్పదు. తను (గోపీ) వద్దనుకొన్నా రాధ పెంచి యిచ్చిన 'పరాయి పాప' బాధ తీర్చడానికైనా 'నీడ' చూచుకోక తప్పదు. రక్త సంబంధానికి మించిన బంధం అది. రాధ తండ్రి, సర్వోత్తముడూ అయిన ధర్మారావు (రంగారావు)కు తన ధర్మం నెరవేర్చాలి అన్నా మరో 'నీడ' చూచుకోక తప్పదు. ముద్దు పాపకోసం, వృద్ధ ధర్మారావుకోసం గోపీ లక్ష్మి అనే నిజమైన లక్ష్మిని (భానుమతి) వివాహమాడక తప్పలేదు.

మూడు ముళ్ళయితే వేశాడుకాని ఆ తదుపరి జీవితం ముళ్ళమీద నడకే అయింది. పాపకు రాధ కొరత తీరలేదు. తనకు రాధ బాధ తప్పలేదు.

గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్టు ధర్మారావు కోడలు (రాణి) తండ్రి నాగరాజు (నాగభూషణం) ఆస్తికోసం గోపీపై పగబట్టి ధర్మారావుపై బుసకొట్టాడు. ఈ ఇద్దరిని ఆ కాటునుంచి రక్షించడంకోసం 'రెండవ నీడ' లక్ష్మి ప్రాణత్యాగానికైనా సిద్ధపడవలసి వచ్చింది. త్యాగం అమృతం వంటిది. త్యాగ యత్నము అమృత తుల్యము. త్యాగ యత్నము చేసిన లక్ష్మి తన 'తోడు' భర్త, గోపీ మనసునే అమృత తుల్యం చెయ్యగలిగింది. పోయిన రాధకు మించి గోపి జీవితం మధురతరం చెయ్యగలనని నిరూపించింది. అవరోధాలు తొలగాయి. బాధలు

పోయాయి. తోడూ నీడలోనే జీవిత మాధుర్యం వున్నదని గోపీయే కాదు. ఆయనకు సంబంధించిన అందరూ గ్రహించ గలిగారు.

(ఒక) తోడు (రెండు) నీడ (ల) కథ అది. రచించింది కె. ఎస్. గోపాల కృష్ణన్. తెర కెక్కించింది ఆదుర్తి సుబ్బారావు. హంగులు, రంగులు అమర్చింది ఎన్. ఎన్. భట్, ఏ. రామిరెడ్డి, రంగులు రామారావు (తోడు). జమున (మొదటి నీడ), భానుమతి (రెండవనీడ), రంగారావు, రామకృష్ణ, గీతాంజలి, నాగయ్య, రమణారెడ్డి, నాగభూషణం, రావి కొండలరావు మొదలైనవారు. రంగులకు హంగులైనది సముద్రాల రామానుజాచార్య కలం, ఆత్రేయ కవిత, కె. వి. మహదేవన్ స్వరం. ఘంటసాల. పి. బి. శ్రీనివాస్, సుశీల, జానకి, (అండ్ భానుమతి) గాత్రం, ఎమ్. కె. రాజు కెమెరా, కృష్ణారావు కళ, కృష్ణ కూర్పు, రెడ్డి నృత్యం.

'తోడూ నీడా'కు తోడునీడలైన అందమైన అంశాలను యిలా పొందు పరచవచ్చు.

కొత్తవి: ఏ తెలుగు చిత్రంలో లేని కొత్తది ఒకటిఉంది. అది అంగ్లం పాట. జోల పాట. పాడింది భానుమతి. పాపకోసం పాడింది... సినిమాలో ఆ పాప ఆ పాటకు నిద్ర పోదు. కాని సంగీత మాధుర్యం తెలిసిన 'అడల్ట్' ప్రేక్షకులు అన్ని 'వర్రీ'లు 'మెర్రీ' చేసుకుని నిద్రపోయేటంత హాయిగా వుంది ఆ పాట (వెన్ ఐ వజ్ జస్ట్ ఎ లిటిల్ గర్ల్... ...)

సూటూ బూటులలో నిగనిగ దుస్తులలో ధగధగలాడే రామారావును యీ చిత్రంలో నూరు నయాపైసల పల్లె అబ్బాయిలా చూస్తాము. ఆ నిగనిగ ఆ ధగధగ నటనలో వుంది.

విశిష్టమైనవి : ఛాయాగ్రహణం చాలా నీట్‌గా వుంది. పాలకంటె తెలుపు. పాదరసంకంటె చిక్కన.

"ఎన్నో రాత్రులు వస్తాయి"(భానుమతి పాట)కి స్వరకల్పన, "అత్తబడి పువ్వువలె మెత్తనమ్మా" (ఆత్రేయ) కవిత, సాంకేతికత, నటన ఉత్తమ ప్రమాణం. మాటలలో (సముద్రాల జూ॥) జాతీయత ఎంతైనా మెచ్చదగినవి. సెట్‌లు నేత్రపర్వం.

చిత్రం ప్రథమార్థంలో స్క్రీన్‌ప్లే చిత్రానికి జీవం పోసింది. ద్వితీయార్థంలో పాప నవ్వు తెస్తే రాధ నీడ బరువు యిచ్చింది. ధర్మారావు (రంగారావు) ఎటువంటివాడో టైటిల్స్ అయిన వెంబడిసే ఒక్క కారు యానంతో, బోర్డులతో చూపగలగడం మెచ్చదగింది. ఆ కారుతో ఆ షికారుతో మిగిలిన ముఖ్య పాత్రలను మధురంగా పరిచయం చెయ్య కలిగారు. చంటిపాప పెద్ద పాప అయినప్పుడు. గది గుమ్మంతో టైమ్‌లాప్స్ చూపడం, "అత్తబడి పువ్వువలె మెత్తనమ్మా"



"తోడూ నీడ"లో జమున, భానుమతి.

అనే పాటను రిపీట్ చేసినప్పటి ఘట్టాలు, "ఎందులకీకన్నీరు – ఎందుకిలా వున్నారో" పాట చిత్రీకరణ, రక్తసంబంధం కంటె ఉత్తమమైనది కరుణబంధం అని నిరూపించగల విధంగా ధర్మారావు, రాధ పాత్రలను (ఆదర్శప్రాయంగా) నడిపించడం, జమున, రమణారెడ్డి, నాగభూషణంలచే ఆశించినదానికంటె ఉత్తమంగా నటింప జేయడం — వీటిలోనూ మరికొన్నింటిలోను ఆదుర్తి సిద్ధహస్తం కానవచ్చింది.

టెక్నికల్ ఫినిష్ వుండి మధుర సంగీతం, ముచ్చటైన ఛాయాగ్రహణం, సెట్లు కలిగి, ఆదర్శ ప్రాయమైన పాత్రలు మెలిగి. అసభ్యతతో కాక సభ్యతతో సఖ్యత నెరపిన "తోడూ నీడా" మనసును, మేధను కంటిని, కర్ణమును, ఊహను, ఉద్దేశాలను రంజింప జేస్తుంది. వాహిని స్టుడియోస్ సాంకేతిక విజయ కిరీటానికి విజయభట్ మూవీస్ మరొక తురాయి చేర్చింది.

కీలుబొమ్మలు

అసత్తు నుండి సత్తునకు ... చీకటి నుండి వెలుతురునకు...మృత్యువు నుండి అమృతమునకు ... చేర్పుము అన్న "అర్థంకల శ్లోకంతో హైదరాబాద్ మూవీస్ వారి "కీలుబొమ్మలు" చిత్రం ప్రారంభ మౌతుంది.

శ్లోకార్థమునకు తగినట్లు నిరాశావాది ఆశావాదిగా రూపొందడం,



"కీలుబొమ్మలు"లో జమున

కర్తవ్యం తెలుసుకొని నిర్వర్తించడం నిరుపమా దేవి (బెంగాలీ రచయిత్రి) కథ ప్రధానాంశం.

మానవులు విధిచేతి కీలుబొమ్మలు. దుర్విధిలో యీ కీలుబొమ్మల కష్టాలకు అంతువుండదు. అమావాస్య తర్వాత పౌర్ణమిరాక తప్పదన్నట్లు సద్విధిరాగానే ఈ కీలుబొమ్మలకూ మంచికాలం వస్తుంది. కాలం, జీవిత పరమార్థం తెలుసుకొని సంచరించాలి,

ఇటువంటి వేదాంత ధోరణిలో గంగాధరరావు నిర్మించిన చిత్రం నడుస్తుంది. తెలుగుదనం ఉట్టిపడేటట్లు, తెలుగు సంసార ప్రతిబింబం కానవచ్చేటట్లు తెలుగు చిత్రాన్ని సి. ఎస్. రావు (దర్శకుడు), పి. సాంబశివరావు (సహకార దర్శకుడు) కె. ఎస్. ప్రకాశరావు (స్క్రీన్ ప్లే రచయిత), డి. వి నరసరాజు (సంభాషణల కర్త) తీర్చిదిద్దారు. "మూగమనసులు" తర్వాత తెలుగు వాతావరణం ఉట్టిపడిన (ఉత్తమ వేదాంత) చిత్రంగా "కీలుబొమ్మలు"ను పేర్కొనవచ్చు. శోకం తగ్గించి చిత్రానికి ఇంకా ఆకర్షకమైన పేరు నిర్ణయించి, కొత్త హాస్య సన్నివేశాలు ఎంచుకొని, చిత్ర దృశ్యాలను మరింత శోభాయమానంగా కాని, మరింత కళాత్మకంగాగాని రూపొందించి వుంటే ఈసున్నితచిత్రం ఇంకా హెచ్చుగా జనప్రీతి పొందేది.



"ప్రేమించి చూడు" చిత్రంలో జగ్గయ్య, కాంచన

మోహన్ (జగ్గయ్య) ధనికుడు. అయినా వేదాంతి. ఒక విధంగా నిరాశావాది. "పునరపి జననం పునరపి మరణం" ఇష్టం లేనివాడు. ఓ మోస్తరు పెద్ద గ్రామంలో వుంటున్నాడు.

తల్లిని మించిన పినతల్లి (కన్నాంబ) ఆ వూరుకు ఏ కొత్త కోడలు వచ్చినా తనకూ కోడలు కావాలని కలవరించేది. ఆ వూరిలో కెల్ల బ్రతికి చెడ్డ కుటుంబం రామయ్యది (గుమ్మడి). ఆయనకు రత్నాలవంటి పెళ్ళికాని పిల్లలు ఇద్దరు. జానకి (జమున), రాధ (వాసంతి). మరి యిద్దరు కుమారులు (చలం, బాబు). జానకిని పిలిచింది. జానకి పువ్వులు తెచ్చింది. పార్వతీ పరమేశ్వరుల ముందు పువ్వులు పెట్టింది, జానకి, మోహన్‌లు ఒకరి నొకరు చూసుకున్నారు. మరికొన్ని పువ్వులను జానకి మోహన్ ఫొటో ముందు పెట్టింది. మోహన్ పినతల్లి పాడమన్నది. జానకి వీణపై "పిల్లనగ్రోవి" పాటపాడి "కృష్ణా [illegible]" అని పిలిచేసరికి పినతల్లి [illegible] కోడలనే ఆశ ప్రతిధ్వనించింది; [illegible] మైన మోహన్ [illegible]

ద్దైనాడు. పినతల్లి రామశేషయ్యతో సంప్రతించి మోహన్, జానకి వివాహం నిశ్చయించింది. అటు నుంచి అంతా సిద్ధమయ్యాక ఇటు సంసార బంధాలలో చిక్కుకోదలచని మోహన్ తాను పెళ్ళి చేసుకోనన్నాడు. దైవాన్వేషణకు బయలుదేరాడు. రామశేషయ్య గుండె పగిలింది. జానకిని వృద్ధ శరభయ్య (ముదిగొండ లింగమూర్తి) కిచ్చి వివాహం చేశాడు. కాని తానొకటి తలిస్తే... మోహన్ సత్యాన్వేషణలో జీవిత ధర్మం తెలుసుకొని తిరిగి వచ్చాడు. జానకి ఇల్లు నిలబెట్టు దలచాడు. సంతోషంతో ఇంటికి తిరిగి వచ్చాడు. విశ్వస్త జానకి ఎదురైంది. జానకి తండ్రి ఈ లోకం విడిచి పోయాడు...ఆలోచనలో పడ్డ మోహన్ జానకి ఓ జమీందారుతో వుండడం చూచాడు. కారణం ?

రాధ జానకి చెల్లెలు. రాధనయినా ఓ యింటి దాన్ని చేద్దామనుకొన్నాడు. పెళ్ళికుదిర్చాడు. కాని పెళ్ళి పందిరి నుంచి మొగ పెళ్ళివారు అమాంతం వెళ్ళి పోయారు. రాధ పేరు వినరాకూడదన్నారు. కారణం ?

మోహనే ఆదుకున్నాడు. అందరూ వదలిన రాధను తానే వివాహ మాడాడు. జానకి తులసి కోటకు అంజలి ఘటించారు. కారణం ? "చీకటినుండి వెలుతురునకు" వచ్చినందున. ఎలా ? "కీలు బొమ్మలే" నిరూపించింది.

పాత్రపోషణ (క్యారక్టరైజేషన్)—రామశేషయ్య, రామశేషయ్య తల్లి తప్పిస్తే — చాలా ఉత్తమంగా వుంది. కీలుబొమ్మలు చూస్తున్నంత సేపూ సినిమా అని కాక ఒక నిజమైన జీవితం చూస్తున్నామనిపిస్తుంది. సినిమా విలువల కంటె సంసార విలువలకు ప్రాధాన్యమిచ్చారు. బెంగాలీ ధోరణి చిత్రాలు అభిమానించే వారికి "కీలు బొమ్మలు" బంగారు బొమ్మలు. జమున నటన, పిల్లన గ్రోవి పాట, "బొట్టుకాటుక పెట్టి" అన్న పాట, జాతీయతకల సంభాషణలు, అన్నింటికి మించి హైదరాబాద్ మూవీస్ యూనిట్ వాస్తవికతాభిమానం ప్రశంసించ దగినవి.

తారాగణంలోనేమి, సాంకేతిక గణంలోనేమి పైన పేర్కొన్నవారే కాక క్రింది వారి కృషికూడా గమనార్హం.

నాగయ్య, రమణారెడ్డి, సూర్యకాంతం, చదలవాడ, రావి కొండలరావు, గీతాంజలి, చంద్రశేఖర్, ఆరుద్ర, ఆత్రేయ, కొసరాజు, నారాయణరెడ్డి, కోదండపాణి, జె. సత్యనారాయణ. వీరప్ప, సూరన్న.

● ● ●

మద్రాసు ఫిలిం ఫాన్స్ వారు మద్రాసులో హంగరీ చలన చిత్రోత్సవం జయప్రదంగా జరిపారు.



"ప్రమీలార్జునీయం"లో రామారావు, సరోజాదేవి

చలన చిత్ర వార్తలు

కె. వి. రెడ్డి తదుపరి చిత్రం

కె. వి. రెడ్డి తదుపరి చిత్రం జయంతీ వారి బ్యానర్‌లో తయారవుతుంది. జానపదం. మాటలూ–పాటలూ పింగళినాగేంద్రరావు సమకూర్చారు. స్క్రిప్టు దాదాపు సిద్ధంగా వున్నట్లు చెప్పవచ్చు.

భారీ చిత్రం "ప్రమీలార్జునీయం"

జూన్‌లో విడుదలకానున్న సర్వాడంబర సర్వాకర్షక చిత్రం ఎస్. ఆర్. మూవీస్ వారి "ప్రమీలార్జునీయం" మే మాసాంతానికే రీ రికార్డింగ్ కూడా పూర్తయి జూన్ ఆరంభంలో విడుదలకు నిరీక్షిస్తున్నది. పూర్వపు తార స్వర్గీయ శ్రీరంజని (సీనియర్) కుమారుడు మల్లికార్జున [illegible] కుడుగా పరిచ[illegible] [illegible]

న్యం కల యీ చిత్రానికి సాహిత్యం సమకూర్చింది పింగళి నాగేంద్రరావు. నేత్రానందకరమైన సెట్లు, మధురమైన సంగీతం, ప్రమీలగా బి. సరోజాదేవి, అర్జునునిగా రామారావు నటన చిత్ర విశేషాలని రషెస్ చూసినవారు చెబుతున్నారు. నిర్మాతలు కె. నాగమణి, కె. ఆదిబాబు. వాహినీ విడుదల.

"ఇల్లాలు" ప్రత్యేకత

ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి "ఇల్లాలు"లో ముఖ్యమైన షూటింగ్ అంతా పూర్తి అయి ఓ వారంపట్టే ప్యాచ్ వర్క్ మాత్రం మిగిలివుంది. గొప్ప హాలీవుడ్ చిత్రాలలోవలె ఇందులో కలర్ దృశ్యాల బ్లాక్ అండ్ వైట్ ఘట్టాల విశిష్ట సమ్మేళనం వుంటుంది. ఫ్లాష్ బ్యాక్‌లు ఈస్ట్‌మన్ కలర్‌లో తీశారు. సూటి దృశ్యాలకు తెలుపు నలుపు ఛాయాగ్రహణం వాడారు. "ఇలవేల్పు" అయిన అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ ఇన్నాళ్ళకు మళ్ళీ తెలుగు చిత్రం తీశారు. అంతేకాదు, మద్రాసులో స్వంత స్టుడియోలో రంగులతో సయితం నిర్మించారు. అంతేకాదు కె. నాగేశ్వరరావు (రవికాంత్) అనే కొత్తనటుని పరిచయం చేశారు. ఈతడు చాలా సంతృప్తికరంగా నటించినట్లు "ఏ" క్లాస్ హీరోకోవకు చేరగలరన్నట్లు రషెస్ చూసినవారు "రష్" అయి చెబుతున్నారు. (నాయిక గీతాంజలి). కొత్తస్టుడియో, కొత్త లొకేషన్‌లు, కొత్త హీరో. అంతటితో ఆగలేదు. కొత్త దర్శకుని కూడా పరిచయం చేస్తున్నారు. ఫిలిం ఎడిటర్‌గా ఈ వరకే ప్రఖ్యాతి చెందిన అక్కినేని సంజీవి ఈచిత్రం దర్శకుడు. రచన ముళ్ళపూడి వెంకటరమణ. ఇప్పుడు విడుదల కానున్న చిత్రాల తుఫానుతగ్గి అసలు వర్షాకాలంకూడా పోయిన మీదట సెప్టెంబర్ ప్రాంతాల "ఇల్లాలు" ఆంధ్ర సినిమాయిళ్ళకు రాగలదు. సంగీత దర్శకుడు కె. వి. మహదేవన్ "మల్లెపూవులు విరిసెనే" హిట్ సాంగ్ కాగలదంటున్నారు.

కురుక్షేత్రంలో మైక్‌లు

రాజలక్ష్మివారి "వీరాభిమన్యు"కు వాహినీ స్టుడియోలోని బ్రహ్మాండమైన కొత్త ఫ్లోర్ (8వ నెంబర్)లో కురుక్షేత్ర యుద్ధంలోని కొన్ని ఘట్టాలు మే నెలలో చిత్రీకరించారు. ఆ ఫ్లోర్ ఎంత పెద్దదీ అంటే లైట్ బాయిస్‌కు, ఆర్టిస్టులకు డైరక్టర్ నోరు చించుకొని అరచినా వినపడదు. అందుచేత డైరక్టర్ ఆర్టిస్టులకు, కెమెరామెన్, లైట్ బాయిస్‌కు ఆదేశాలు ఇవ్వడానికి స్పెషల్ మైక్‌లు ఏర్పాటు చేశారు. భీముడు దండమూడి రాజగోపాల్ ఏనుగుపై ఎక్కి గదా యుద్ధం చేసే సీను ఒకటి భయోత్పాతం కలిగించేటట్లుగా షూట్ చేశారు. పద్మవ్యూహం లోనికి అభిమన్యుడు చొచ్చుకొని

వెళ్ళడం, సైంధవుడు ఆటంకం, ద్రోణాచార్యులతో పోరు మొదలైనవి చిత్రీకరించారు. వందలకొలది సైనికులు, పదుల సంఖ్యలో రథాలు, ఏనుగులు, పాతికల సంఖ్యలో అశ్వములు యుద్ధములో పాల్గొనుటకు వలయు వైశాల్యము ఆ ఫ్లోర్‌లో ఉంది దాదాపు అన్ని షూటింగ్‌లో పాల్గొన్నవి రామారావు, శోభన్‌బాబు, కాంతారావు, ధూళిపాళ, కాంచన, వరలక్ష్మి ద్వయం తారాగణలో కలరు. దర్శకుడు – విమధు నిర్మాతలు – సహాతా, డూండీ

రవీంద్ర ఆర్ట్స కొత్త చిత్రం

రవీంద్ర ఆర్ట్సవారి తాజా సాంఘిక చిత్రం షూటింగ్ హైదరాబాద్ శ్రీ సారథీ స్టుడియోలో జూన్ ఒకటవ తేదీనుంచి సాగించడానికి ఏర్పాట్లు పూర్తి అయినవి. మొదటి షెడ్యూలు జూన్ పదివరకు జరుగుతుంది. హీరో సెట్ పై మొదటి షూటింగ్ సాగుతుంది. నాగేశ్వరరావు, కృష్ణకుమారి, గుమ్మడి, హేమలతలకు ఆ సెట్‌లో పని వుంది. ముళ్ళపూడి మాటలు, సి. నారాయణరెడ్డి, దాశరథి పాటలు, చలపతిరావు సంగీతం, వి. మధుసూదనరావు దర్శకత్వం ఈ చిత్రానికి అమరినవి.



"ఆకాశ రామన్న"లో ఎల్. విజయలక్ష్మి

పద్మనాభం "పిచ్చి"

రేఖా అండ్ మురళి ఆర్ట్స వారి "దేవత" తుదిమెరుగులు దిద్దుకుంటున్నది. చిత్రంలో సినీ పిచ్చివాడి వేషం వేసిన పద్మనాభం మద్రాసులో సినిమాలో నటించేందుకు పడిన పాట్లు చిత్రంలో ఒక ముఖ్యఘట్టం. అతడు కొందరు తారలయిళ్ళకు వెళ్ళి ఆటోగ్రాఫులు తీసుకొనడం షూట్ చే[illegible] రామారావు, సావిత్రి [illegible] ధారులు. దర్శకుడు [illegible] రావు.



"జ్వాలాద్వీప రహస్యం"లో
కాంతారావు

అన్నపూర్ణావారి చిత్రం

అన్నపూర్ణావారు మూడునాలుగు సబ్జెక్టులపై చర్చించి చర్చించి, మే మాసంలో ఒక ఒరిజినల్ సబ్జెక్టును చివరకు నిర్ణయించారు. జులైమాసాంతంలోకాని ఆగస్టు ఆరంభంలో కాని షూటింగ్ ప్రారంభ మౌతుంది.

"పరమానందయ్య శిష్యులు"లో కైలాసం సెట్టు

శ్రీదేవి ప్రొడక్షన్స్‌వారి 'పరమానందయ్య శిష్యులు కథ' షూటింగ్ మే 10వ తేదీన మద్రాసు వీనస్ స్టుడియోస్‌లో కైలాసం సెట్టుపై ప్రారంభ మైంది. శివ - పార్వతుల (శోభన్‌బాబు, లక్ష్మిదేవి) ముందు యక్షకన్య (కె. ఆర్. విజయ)నృత్యం ఆ నాడు షూట్ చేసిన ఘట్టం. ఎన్. త్రివిక్రమరావు అంతకుముందు పూజచేశారు. జి. కామరాజ్ కెమేరాకు స్విచ్ ఆన్ చేశారు. ముఖ్య నటుడు ఎన్. టి. రామారావు క్లాప్ కొట్టారు. రచన సదాశివబ్రహ్మం. సంగీతం ఘంటసాల. నిర్మాత టి. సుబ్బారావు. దర్శకుడు సి. పుల్లయ్య.

జెమిని చిత్రంలో జోగ్ జలపాతం

జెమినీవారి చిత్రం 'ఆడబ్రతుకు' విడుదలకు సిద్ధంగా వున్నది. మైసూరులోని జోగ్ జలపాతంవద్ద తీసిన కొన్ని ఘట్టాలు అద్భుతంగా వున్నవి రామారావు, రంగారావు, కాంతారావు, పద్మనాభం, దేవిక, గీతాంజలి మొదలైనవారు తారాగణంలో కలరు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

12 రీళ్ళు తయారైన 'శ్రీకృష్ణ పాండవీయం'

రామకృష్ణ అండ్ ఎన్. ఏ. టి. వారి 'శ్రీకృష్ణ పాండవీయం' మే మధ్యకి 12 రీళ్ళు తయారైంది. జనవరిలో విడుదల చెయ్యాలని నిర్మాతలుసంకల్పించారు. అక్టోబర్ కే షూటింగ్ పూర్తి అవుతుంది. దర్శకుడు రామారావు కృష్ణుడుగాను, దుర్యోధనుడుగాను నటిస్తున్నారు. మే ఆరంభంలో శ్రీకృష్ణుడు హిడింబిలతోటికొన్ని ఘట్టాలు చిత్రీకరించారు. రచన సముద్రాల రాఘవాచార్య.

విజయావారి కొత్తచిత్రాలు

విజయావారు మే నాల్గవ తేదీన 'సి. ఐ డి.'చిత్రం షూటింగ్ వాహినీ స్టుడియోస్‌లో ప్రారంభించారు. జమునపై సుందర ప్రాసాదఉద్యానపు సెట్‌లో రెండు పాటలు చిత్రీకరించారు. పాడి దిన శీల స్వరం కల్పించింది ఘంటసాల. రచించింది పింగళి నాగేంద్రరావు. సంభాషణ డి. వి. నరసరాజు. కళ కృష్ణారావు. కెమేరా బుల్‌బులె. దర్శకుడు తాపీ చాణక్య. తారాగణంలో రామారావు, రంగారావు, రమణారెడ్డి, జమునముఖ్యులు.

మార్కస్ బార్ట్లీ విజయా సంస్థలో తిరిగి చేరారు. పిక్చర్ బేసిస్‌పై పని చెయ్యగలరు. 'రాముడు-భీముడు' హిందీ కలర్ చిత్రానికి పనిచెయ్యగలరనుకొంటున్నారు.



శ్రీ సరస్వతీ మూవీస్ అండ్
వెంకటేశ్వరవారి
'శ్రీ సింహాచల క్షేత్రమహిమ'లో
గిరిజ

ఇండో-బ్రిటిష్ [illegible] 'మహాత్మ గాంధి' [illegible] చిత్రంలో [illegible]

రంగా తీసిన అనేకచిత్రాలలో ఆయన ఎంతో సహజంగా కన్పించారు. అంత అమెరికాలోనూ పంచకట్టులో నాగేశ్వరరావును చూచినప్పుడే తెలుగువారి పంచప్రాణాలూ చూసినట్లయింది. తెలుగుదనం, పల్లెదనం, ఆయనలో సహజంగా వుంది.

రసం—నీరసం : హీరో అన్నాక నవరసాలూ ఒలికించాలని ఎక్కడా లేదు. ఆకృతిబట్టి, అంతస్తుబట్టి, సహజమన స్తత్వంబట్టి, అభిరుచులుబట్టి, అభిలాషలుబట్టి కొన్ని రసాలలో నే రాణించినా తప్పులేదు. అన్నింటిలో వేలుబెట్టి కొన్నింటిలో రసంబదులు నీరసం చూపడంకంటె కొన్నే తీసుకొని బహుచక్కటిరసం చూపడమే మేలుకదా!

ఆ మాటకువస్తే విదేశ నటులకంటే మన తెలుగువారే ఎక్కువ రసాలు పోషించ గలరు. ఎక్కువ పాత్రలు, ఎక్కువ చిత్రాలు కాబట్టి బహురస పోషణకు ఇచ్చటే అవకాశ మున్నది. విదేశాలలో సాధారణంగా నటులు ఒకటో రెండో ఎంచుకొని, వాటిలో మటుకు 'పర్ఫెక్షన్' సాధిస్తారు. వాటికి వారే సరి. హాస్య, కరుణ రసములకు చార్లి చాప్లిన్‌ను మించినవా రున్నారా?

నాగేశ్వరరావు వయసులో వున్నప్పుడు వీరరస ప్రధాన భూమికలను మొత్తంమీద నిర్వహించారు కాని ఇప్పుడది 'ఔట్ ఆఫ్ బౌండ్స్' అని నా అభిప్రాయం; ఆయన అభిప్రాయం కూడా. రౌద్ర, భయానక, బీభత్స రసముల పొలిమేరలకు ఆయన రూపం పోనివ్వదు; ఆ రూపధారి పోరు. శృంగార, అద్భుత రసములలో అక్కినేని అగ్రస్థానమే వహించ గలిగారు. కాని కరుణ, శాంత, హాస్య రసాలలో ఆయన స్థాపించిన స్థానం ఇంకా ఉన్నతమైనది; మహోన్నతమైనది.

వీరరసం

నాగేశ్వరరావు బండమొండి పర్వతాకార వీరరసమును సినిమా పాత్రలలో అయితే చూడకపోవచ్చు కాని సినిమా జీవితంలో మటుకు నిరూపించారు.

మద్రాసులో 1 62 లో రెండవ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగినప్పుడు ప్రభుత్వంవారు నాగేశ్వరరావుకు ఆహ్వానం పంపలేదని "ఇక ఈ మద్రాసునుంచి ఈఆంధ్రుడు ఎంత త్వరగా వెళ్ళిపోతే అంతమంచి" దని అనుకొని నాగేశ్వరరావు హైదరాబాద్ ప్రయాణం కట్టినట్లు ఒక సభలో తలనెరసిన ఓ దర్శకులు ప్రకటించారు. నాగేశ్వరరావు అక్కడికక్కడే సమాధానమిస్తూ తానంతటి పిరికివాణ్ణి కానని తలచుకొంటే ఆ ఆహ్వానాన్ని రప్పించి మరీ వెళ్ళేవాడినని అన్నారు. తెర వెనుక యీ హీరోపట్టు అంతగట్టి.

తొమ్మిదేళ్ళ నాటక రంగంలో 'నారీ' వేషాలు వేసిన అవిద్యావంతుడు, 21 ఏళ్ళుగా సినీజీవితంలో హీరోగా నిలవగలిగారూ అంటేఎంత పట్టుదల వుండివుండాలి! నిలవగలగడమే ఒక వీరత్వంకదా. ఓ పల్లెటూరు మనిషి అమెరికాలో మనిషి అయ్యారూ అంటే దానివెనుక ఎంత శ్రమ, దీక్ష, సంకల్పము, వీరత్వము అన్నింటికి మించి అదృష్టం వుండి వుండాలి!



జగపతి పిక్చర్స్‌వారి "అంతస్తులు"లో
నాగేశ్వరరావు, గుమ్మడి

నాగేశ్వరరావు సూక్తులు

మనుషులపైన, మనసులపైన, కళపైన, కనకం (బాక్స్ ఆఫీస్) పైన నాగేశ్వరరావు సూక్తులలో ఆయననటనలోవలెనేప్రత్యేకతవుంది జూన్ నెల ఆరవ నెల. ఆయన ఆరు సూక్తులు యివి :

1. నాకు దేవుడిలో నమ్మకం లేదు. ఎందుచేతనంటే ఉత్తముడైన మానవుడు దేవుడికంటె గొప్ప. మానవులలోను దానవులున్నారు. బహుశా వీరే ఎక్కువ.

2. ఒక్కొక్కప్పుడు అబద్ధాలు తియ్యగా వుంటువి. ప్రా... ...తమైన భంగములందేకాక సి... ...గా

అబద్ధాలు చెప్పక తప్పదు. ఈ ప్రపంచంలో మనిషి సక్రమంగా జీవించడం కష్టం.

3. ప్రజలు వివిధాభిప్రాయాలు లేకుండా ఒక్కసారైనా చూసి ఆనందించే చిత్రాన్ని విజయవంతమైన చిత్రం కింద లెక్క కట్టవచ్చు. కథావస్తువు చాలా బాగా వుండాలి. మంచి సంగీతం వుండాలి. కనీసం రెండు పాటలైనా "హిట్స్" కావాలి. శరీరం పులకరింపజేసే నృత్యాలు రెండైనా వుండాలి. ప్రేక్షకుల్ని శోకంలో ముంచెత్తే ఒక ఘట్టం వీలైతే పాటతో సహా వుండాలి. కథకు సంబంధించిన హాస్యపు జోడీ వుండాలి.

4. నేను అనుభవించేది నా ఒక్క జీవితాన్నే. నేను చవిచూచేది అనేక అవతారాలు, అనేక మనస్తత్వాలు. అలా యిప్పటికి దాదాపు 120 అవతారాలెత్తాను. అన్ని పాత్రల మనస్తత్వాలూ అర్థం చేసుకొని నటించడానికి ప్రయత్నించాను. వీటిలో కొన్నింటిని అర్థం చేసుకోలేక ఎదురు దెబ్బలు తిన్నాను. కొన్నింటిని మననం చేసుకొని మెప్పించి మెప్పింప చేసుకొని ఆత్మానుభూతిని పొందగలిగాను. దానికి కారణం నా ఒక్కడి ఆత్మబలం కాదు, అనేకమంది సహకారబలం.

5 నాకు విద్యాలయం చదువు లేకపోయినా, డిగ్రీ లేకపోయినా వందల ఎమ్. ఎ. పట్టభద్రుల కు మించిన జీవితానుభవాన్ని నేను ధరించిన పాత్రలద్వారా గ్రహించాను. జీవితం నిర్వచనం నాకంటె మిన్నగా 2) అక్షరాల డిగ్రీకల పట్టభద్రుడు కూడా చెప్పలేకపోవచ్చు

6. చలన చిత్ర స్థాయి పెంచే భారం ప్రేక్షకులమీద వుంది. వారి అభిలాషే మా అభిలాష. వారి అభిరుచే మా అభిరుచి. వారి బలమే మా బలమూ. ప్రేక్షకులు ఒక విధంగా డాక్టర్లయి వ్యాధి కల చిత్రాలను అంటుకోకపోతే వచ్చేవి ఆరోగ్య దాయకమైన చిత్రాలే.

□□□

బాబూ మూవీస్ షెడ్యూలు

బాబూ మూవీస్ వారు "కన్నె మనసులు", "విశాల నేత్రాలు" నిర్మాణానికి హంగులన్నీ అమర్చుకొంటున్నారు. జులై ఆగస్టులలో "కన్నె మనసులు" నిర్మాణం ప్రారంభించి 1965 సెప్టెంబరు చివరలోగా విడుదలకు సిద్ధం చేస్తారు. ఈ లోగా "విశాల నేత్రాలు" పిలకా గణపతి శాస్త్రి నవల ఆధారం). కాస్ట్యూమ్లు, డెకార్ సిద్ధం చేస్తారు. "విశాల నేత్రాలు" జనవరిలో సెట్స్‌కి వెళ్ళగలదు. రెంటికి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు.

Edited and Published by V. V. Raghavaiah and Printed by him at Jyothi Press, Congress Office Road, Governorpet, Vijayawada-2.

JYOTI JUNE '65 Regd. No. H368

